అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 12-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 234
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

పాఠకులకు, ప్రకటనకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు



దసరా పండుగ సందర్భంగా శనివారం కార్యాలయానికి సెలవు. ఆదివారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

- చీఫ్ జనరల్ మేనేజర్, నవతెలంగాణ

వర్గీకరణ కమిషన్ ఛైర్మెన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్

- మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకే
- షెడ్యూల్ కులాల శాఖ జీవో జారీ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఈ కమిషన్‌కు ఛైర్మెన్‌గా 2023 వరకు తెలంగాణ హైకోర్టు జడ్జిగా పనిచేసి రిటైరైన జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. ఈ మేరకు శుక్రవారం జీవో నెంబరు 8ని విడుదల చేసింది. షెడ్యూల్ కులాలకు సంబంధించి వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేయాలని కమిషన్‌కు సర్కారు సూచించింది. అనంతరం సిఫారసులు చేయాలని కమిషన్‌ను కోరింది. ఈమేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ శ్రీధర్ ఉత్తర్వుల్లో ...11లో

సమగ్ర కులగణనపై ఉత్తర్వులు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి

- సర్వే బాధ్యత ప్రణాళిక శాఖకు అప్పగింత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్టు జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్టు ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. సర్వే బాధ్యతను ప్రణాళికశాఖకు అప్పగించారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, విద్యా ఉద్యోగ, రాజకీయ అవకాశాలను మెరుగుపరిచేందుకు వీలుగా సర్వే చేయాలని రాష్ట్ర మంత్రివర్గం ఈ ఏడాది ...11లో

పార్టీలో నేను చెప్పిందే ఫైనల్

హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చడం సరిగాదు



- రిటైనింగ్ వాల్‌తో మూసీని సుందరీకరించొచ్చు
- బీఆర్‌ఎస్‌తో కలిసిపోం.. విడిగానే మా పోరాటం
- 370 పునరుద్ధరించే ప్రసక్తే లేదు
- జమ్మూకాశ్మీర్‌లో ఆశించిన దానికంటే ఎక్కువే సాధించాం : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

2లో..

కొండా సురేఖను తప్పించం



- ఆమె ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదు
- మూసీ ప్రక్షాళన ఆగదు... హైడ్రా వెనక్కి తగ్గదు
- బీఆర్‌ఎస్ పదేండ్లలో వందేండ్ల దోపిడీకి పాల్పడింది
- తాత్కాలికంగా చేరికలకు బ్రేక్
- కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం...అపోహలొద్దు : టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

10లో.

కులాల అంతరాలు తొలగాలి

మత విద్వేషాలకు తావివ్వొద్దు

- పేదలందరికీ మెరుగైన విద్యనందించడమే లక్ష్యం
- పేదలు బానిసలు కావొద్దు.. భావితరాలకు వెలుగవ్వాలి
- గత పాలకులు పేదలను గొర్రెలు, బర్రెల కాపరులను చేసిండ్రు
- కేసీఆర్ బడులను మూసిండు.. బంగళాలు నిర్మించుకుండు.. : కొందుర్గులో యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 28 నియోజకవర్గాల్లో క్యాంపస్‌లు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి, కొందుర్గు

కుల మతాల మధ్య వైషమ్యాలు తొలగిపోవాలని, అదే తమ విధానమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ కుటుంబ సభ్యులే రాజ్యాలు ఏలాలన్నది కేసీఆర్ విధానమని సీఎం ఎద్దేవా చేశారు. 'మీ పిల్లలు రాజ్యాలు ఏలాలి కానీ.. పేదల పిల్లలు బర్రెలు, గొర్రెలు కాసుకోవాలా..' అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. బలహీన వర్గాలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోన్నదని సీఎం తెలిపారు. కుల, మత అంతరాలు తొలిగి సమాజంలో మార్పు రావాలన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు మెరుగైన విద్య, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చామని.. అందుకు అంకిత భావంతో కట్టుబడి పని చేస్తున్నామని స్పష్టంచేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా 28 నియోజకవర్గాల్లో శుక్రవారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సీఎం, రాష్ట్ర మంత్రులు ...10లో

జపాన్ సంస్థ నిహాన్ హిడాంక్యోకు నోబెల్

అణుదాడి బాధితుల పక్షాన సంస్థ పోరాటం



స్టాక్‌హోం: ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి -2024 జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థను వరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన ఈ సంస్థ పోరాడుతోంది. ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కృషి చేస్తుండడంతోపాటు బాధితుల జీవితగాథల్ని ఉదహరిస్తూ మరోసారి అణ్వాయుధాలను వాడకుండా ప్రయత్నాలు చేస్తున్నందుకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. "హిరోషిమా, నాగసాకి అణుబాంబు నుంచి ప్రాణాలతో బయటపడిన వారు శారీరక సమస్యలు, విషాద జ్ఞాపకాలతో జీవిస్తున్నప్పటికీ వారిని గౌరవించాలని భావిస్తున్నాం. శాంతి, విశ్వాసం పెంపొందించడానికి వారి విలువైన అనుభవాలను ఉపయోగించుకునేందుకు శాంతి బహుమతిని ఇవ్వాలని నిర్ణయించాం' అని నోబెల్ బృందం ...11లో

నేటి నుంచి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు


ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



11లో..

సీఏఏ లబ్ధిదారుల వివరాల్లేవ్

కేంద్ర హోం శాఖ



వివరాలు 11లో

దసరా స్పెషల్ తాగుతూ..తూలుతూ

10 రోజుల్లో సర్కారుకి ఇచ్చిన ఆదాయం రూ.713.25 కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ఆబ్కారీ శాఖ దసరా నవరాత్రుల సందర్భంగా పదిరోజుల్లో రూ.713.25 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాదితో పోలిస్తే రూ.10 కోట్లు అదనంగా సంపాదించింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున డ్రై డే కావడంతో కొంత ఆదాయం తగ్గినట్టు ఆబ్కారీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇక దసరా పండుగకు ముక్క, చుక్క కామన్ కావడంతో మద్యపాన ప్రియులు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. సర్కారుకు ఆదాయం పెంచడంపైనే దృష్టినిలిపారు. వారికి ఎక్కడా ఎలాంటి లోటు రాకుండా అబ్కారీ శాఖ కూడా వైన్స్, బార్లకు టార్గెట్లు పెట్టిమరీ, స్టాకును సరఫరా చేసింది. రాష్ట్రంలో మొత్తం 2,620 మద్యం షాపులు, 1,082 (2బీ) బార్లు, 89 ఎలైట్ బార్ల ద్వారా పదిరోజుల్లో ఈ ఆదాయం లభించినట్టు ఆబ్కారీ శాఖ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఆబ్కారీ ఆదాయం రూ,2,838.92 కోట్లు. 2023లో ఇదే నెలలో ఆశాఖకు వచ్చిన ఆదాయం రూ.2,640.33 కోట్లు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.198.59 కోట్లు అదనంగా సంపాదించింది. ఏ ఏటికి ఆ యేడు మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయే తప్ప, తగ్గుతున్న దాఖలాలే లేవు. గమ్మత్తుగా ఆశాఖ పేరులో మద్య నియంత్రణ కూడా ఉండటం గమనార్హం!!



ఇదీ మందు అమ్మకాల లెక్క (లక్షల కేసెస్)

సెప్టెంబర్ మాసంలో...	2024లో..	2023లో..
ఐఎమ్ఎల్ కేసెస్	28.82	26.46
బీర్ కేసెస్	39.77	40.07
మొత్తం అమ్మకాలు (రూ.కోట్లలో)	2,838.92	2,640.33
అక్టోబర్ నెల తొలి పదిరోజుల్లో అమ్మకాలు		
ఐఎమ్ఎల్ కేసెస్	7.03	6.61
బీర్ కేసెస్	12.18	12.99
మొత్తం అమ్మకాలు (రూ.కోట్లలో)	713.25	703.02

పూల ధరలకు రెక్కలు

అధిక వర్షాలే కారణం

- యుద్ధాలు, దిగుమతి సుంకం ప్రభావంతో మండుతున్న నూనె ధరలు
- ఉడకని పప్పులు
- పండుగల నేపథ్యంలో చిటపటమంటున్న రేట్లు
- పక్షం రోజుల్లోనే రెట్టింపు

పండుగల వేళ పూజలు, ఇంటి అలంకరణకు వినియోగించే పూల ధరలకు రెక్కలొచ్చాయి. మరోపక్క ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. యుద్ధాలు, దిగుమతి సుంకం ప్రభావం తో వంట నూనెలు మండిపోతున్నాయి. అధిక వర్షాలు, ఆశించిన దిగుబడులు లేక పప్పులు ఉడక నంటున్నాయి. దసరా, దీపావళి పూట రెట్టింపైన ధరలతో పక్షం రోజులుగా వంటిల్లు నిర్వహణ భారంగా మారింది.



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పండుగల పూట వంటింట్లో ధరల చిటపట మొదలైంది. పూలు, నూనెలు, పప్పుదినుసులు ఇలా ఏ వస్తువు ధర చూసినా మండుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు పండుగలు అత్యంత భారంగా మారాయి. అధిక వర్షాలు, వరదల కారణంగా స్థానికంగా పూల తోటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. తద్వారా కిలో రూ.50కి లభించే బంతి పూలకు రూ.100 వెచ్చించాల్సి వస్తోంది. యుద్ధాలు, దిగుమతి సుంకం పెంపుతో అన్ని రకాల వంటనూనెలపై కిలోకు రూ.40-50 పెంపుదల కనిపిస్తోంది. ఆశించిన దిగుబడులు



లేకపోవడం, అధిక డిమాండ్‌తో పప్పుల ధరలు చుక్కలు చూపుతున్నాయి. కిలో రూ.50 నుంచి 70 వరకు పెరిగాయి. మిగిలిన వస్తువుల ...2లో

371 పోస్టులకు అనుబంధ నోటిఫికేషన్లు




272 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మాసిస్ట్ పోస్టులు

మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటన 11లో..

టాటా ట్రస్ట్స్ ఛైర్మెన్‌గా నోయల్ టాటా

రతన్ టాటా వారసుడిగా నియామకం



ముంబయి: టాటా ట్రస్ట్స్ ఛైర్మెన్‌గా నోయల్ టాటా నియమితులయ్యారు. రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటాను ఎంపిక చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. రతన్ టాటాకు నోయల్ వరసకు సోదరుడు అవుతారు. సవతి తల్లి సిమోన్ టాటా ...11లో

తెర వెనుక..!

వినోద పరిశ్రమలో అంతా విషాదమే

దేశంలో ఉద్యోగ సంక్షోభానికి నిరుద్యోగం మాత్రమే కారణం కాదు. చాలా మందికి కనీస పని గంటలు అనేవి కాగితాలకే పరిమితం. ఏ పరిశ్రమలో చూసినా, ఏ సంస్థలో చూసినా శ్రమ దోపిడీయే కన్పిస్తుంది. పని ప్రదేశాలలో దుర్భర పరిస్థితులు తాండవిస్తుంటాయి. ఇష్టమున్నా లేకున్నా పొట్ట నిండాలంటే పని చేయాల్సిందే. మరి నిర్విరామంగా 27 గంటలు పని చేయాల్సి వస్తే...ఆలోచించడానికే భయం వేస్తుంది. ముంబయిలోని వినోద పరిశ్రమలో ఇలాంటి దృశ్యాలే మనకు కన్పిస్తాయి. కాస్త విరామం లభిస్తే... పడుకోవడం, మళ్లీ షూటింగ్‌కు సిద్ధపడడం సర్వసాధారణంగా జరిగేదే. నెలకు కేవలం రెండు రోజులు మాత్రమే విశ్రాంతి. మిగిలిన దినాలలో ఎప్పుడు చూసినా ఇలాగే ఉంటుంది. ఎప్పుడు తెల్లవారుతుందో, ఎప్పుడు చీకటి పడుతుందో వారికి అనవసరం. రోజంతా పని...పని...పని...

- వేళాపాళా, నిద్రాహారాలుండవు
- పొట్ట నిండాలంటే నిర్విరామంగా పని చేయాల్సిందే
- నిబంధనల ఊసే లేదు
- ఆరోగ్యం బాగోకపోయినా పట్టించుకోరు
- జూనియర్ ఆర్టిస్టులు, సిబ్బందిపై వివక్ష



న్యూఢిల్లీ : ప్రేక్షకులకు వినోదాన్ని అందించే సినీ పరిశ్రమలో కార్మికులకు అన్నీ కష్టాలు, కడగండ్లే. క్షేత్ర స్థాయిలో నిబంధనలంటూ ఏవీ ఉండవు. వారి భౌతిక, మానసిక ఆరోగ్యాన్ని గురించి పట్టించుకునే నాథుడే ఉండడు. అధిక పని ఒత్తిడి, కాలంతో సంబంధం లేని షెడ్యూల్స్ కార్మికులకు, చిన్నా చితకా ఉద్యోగులకు విశ్రాంతి అనేదే లేకుండా చేస్తాయి. సినీ, టీవీ పరిశ్రమలోనే కాదు...యాడ్స్ రూపకల్పనలోనూ అదే పరిస్థితి. ఓ వ్యాపార ప్రకటనను రూపొందించేందుకు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న ఒక మహిళ రెండు రోజులలో...అంటే 48 గంటలలో ఏకంగా 38 గంటల పాటు నిర్విరామంగా షూటింగ్ చేశారు. ప్రీ-షూట్స్ ఒత్తిడితో మరో అసిస్టెంట్ డైరెక్టర్ అనారోగ్యం బారిన పడ్డారు.



కాంట్రాక్ట్ కుదిరితే అంతే

నటీనటులకు కూడా ఈ బాధలు తప్పవు. ఆరోగ్య బాగా లేదని చెప్పినా ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే సిబ్బంది అంతా సిద్ధంగా ఉంటారు. నిజమైనా, కుంటిసాకు అయినా తేలికగానే తీసుకుంటారు. ఇలాంటి పరిస్థితులలో పనిని, జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతుంది. వ్యాపార ప్రకటనల తయారీ కోసం పనిచేసే నటీనటులు, ఇతర సిబ్బందికి ఒక్కోసారి పనే ఉండదు. గోళ్లు గిల్లుకుంటూ ...11లో

వివక్ష ఎక్కువే

ఇక వివక్ష గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సీనియర్ ఆర్టిస్టులకు రాచమర్యాదలు లభిస్తాయి. అదే జూనియర్ ఆర్టిస్టులు, సాంకేతిక సిబ్బందిని చిన్నచూపు చూస్తారు. భోజనం విషయంలోనూ తారతమ్యాలు ఉంటాయి. మౌలిక సదుపాయాల విషయంలోనూ వివక్ష కన్పిస్తుంది. సీనియర్ నటీనటులకు ప్రత్యేకంగా వానిటీ వ్యాన్లు ఉంటాయి. వాటిలోనే వాష్‌రూమ్స్ ఉంటాయి. కానీ ఇతర మహిళలకు అలాంటి సదుపాయాలేవీ ఉండవు. టీవీ రంగంలో మహిళలు నిర్మాతలుగా, ఎగ్జిక్యూటివ్‌లుగా రాణిస్తున్నప్పటికీ తోటి వారికి కనీస వసతులు కూడా కల్పించరు. అసిస్టెంట్ డైరెక్టర్లు, లైట్‌మెన్‌లకు తమ సామానులు పెట్టుకునే స్థలం కూడా ఉండదు. డబ్బు ఆదా చేసుకునేందుకు కొందరు నిర్మాతలు నాసిరకం ఆహారాన్ని ...11లో

ప్రజలకు గవర్నర్ దసరా శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవరాత్రి పండుగ ఆనందం, ఉల్లాస స్ఫూర్తితో మనల్ని పునరుద్ధరిస్తుందని చెప్పారు. చెడుపై మంచి విజయానికి దసరా ప్రతీక అని తెలిపారు. సత్యమే విజయం సాధిస్తుందనేది మన జాతీయ విధానమని గుర్తు చేశారు. దసరా పండుగ సందర్భంగా వ్యాధులు, పర్యావరణ ప్రమాదాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన దేశాన్ని సృష్టించడానికి సమిష్టిగా ప్రయత్నించాలని సూచించారు. ఈ వేడుక సందర్భంగా ప్రజలకు దుర్గామాత ఆశీస్సులుండాలని ఆయన ప్రార్థించారు.

డీఏవో అభ్యర్థులకు 8 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) గ్రేడ్-2 పోస్టులకు తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులకు వచ్చేనెల ఎనిమిదో తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో, వికలాంగులను 1:5 నిష్పత్తిలో ధ్రువపత్రాల పరిశీలనకు ఆహ్వానించామని తెలిపారు. వచ్చేనెల 8 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ ప్రక్రియను చేపడతామని వివరించారు. ఇతర వివరాల కోసం www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 53 డీఏవో పోస్టుల భర్తీకి 2022, ఆగస్టు 4వ తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

న్యాయం కోసం 24 గంటల నిరాహార దీక్ష

- ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

న్యాయం కోసం ఆరోగ్యసంరక్షణ రంగంలో పని చేస్తున్న వారంతా 24 గంటల పాటు నిరాహారదీక్ష చేయనున్నట్టు ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఆ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పి.కె.జబ్బార్, కార్యదర్శి డాక్టర్ కె.వి.ఎస్.హరికుమార్ తదితర నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. కోలకతా ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జరిగిన ఘటనపై న్యాయం కోసం యువ వైద్యులు ప్రాణాలకు తెగించి నిలబడ్డారని వారికి సంఘీభావం తెలిపారు. వైద్యరంగంలో పని చేస్తున్న తమ తోటి వారందరికి న్యాయం దక్కాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు వారికి మద్దతుగా రావాలని పిలుపునిచ్చారు.

చెన్నై శివారులో రైలు ప్రమాదం

- గూడ్స్‌ను ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్ రైలు.. రెండు బోగీలు దగ్ధం



చెన్నై: తమిళనాడులోని చెన్నై శివారులో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు సమీపంలోని కావరిపెట్టై వద్ద ఆగి ఉన్న గూడ్సును ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. పలువురు ప్రయాణికులు గాయపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైలు మైసూరు - దర్భంగా మధ్య నడిచే భాగమతి ఎక్స్‌ప్రెస్‌గా తెలుస్తోంది. పట్టాలపై నిలబడి ఉన్న సరకు రవాణా రైలును అతి వేగంతో వచ్చిన ఎక్స్‌ప్రెస్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో పలు బోగీలు పట్టాలు తప్పగా.. ఎక్స్‌ప్రెస్ రైలులో రెండు బోగీల నుంచి మంటలు చెలరేగాయి.

సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సహాయ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో బోగీల్లో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారా.. లేదా అనే వివరాలు తెలియాల్సి ఉన్నది.


ఆరో రోజుకు వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష

న్యూఢిల్లీ : లడఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం ఆరవ రోజుకు చేరింది. లడఖ్ నుంచి 150మందితో కలిసి శాంతియుతంగా పాదయాత్ర చేపట్టి ఢిల్లీకి వచ్చిన వాంగ్‌చుక్ ఇక్కడ లడఖ్ భవనలో దీక్ష చేపట్టారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంత సంస్కృతీ సాంప్రదాయాలను, పర్యావరణ వారసత్వాన్ని పరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సెప్టెంబరు 1న మొదలుపెట్టిన పాదయాత్ర ఇటీవల ఢిల్లీ చేరుకుంది. ఆ వెంటనే శాంతియుతంగా నిరసన తెలియచేయాలన్న ఆయన ప్రయత్నాలకు అనుమతినివ్వకుండా పోలీసులు కస్టడీలోకి తీసుకుని లడఖ్ భవన్‌కే పరిమితం చేశారు. దాంతో వారు అక్కడే నిరసన చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

మరణంలోనూ వీడని స్నేహం

- బైకు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఇద్దరు..



నవతెలంగాణ- రాయపర్తి/గీసుగొండ/ వాజేడు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు యువకులు మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. చిన్ననాటి స్నేహితులిద్దరూ.. పండుగ రోజున బైక్ పై పక్క గ్రామానికి వెళ్తూ బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొని అక్కడిక్కడే మృతి చెందిన ఘటన రాయపర్తి మండలంలో జరిగింది. స్థానిక ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్ర లలిత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు రాజు (24), ఈదునూరి కళ్యాణి, యాకయ్య దంపతుల కుమారుడు బన్నీ(18).. గురువారం సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. రాత్రి ఇద్దరు యువకులు కలిసి వెంటనే వస్తామని కుటుంబ సభ్యులకు తెలిపి తమ ద్విచక్ర వాహనంపై కిష్టాపురం నుంచి కాట్రపల్లి వెళ్తూ వాంకుడోత్ తండా క్రాస్ రోడ్డు తోడెల బండ మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పక్కనున్న చెట్టుకు ఢీ కొట్టింది. దాంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. యువకుల మృతదేహాల వద్ద వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలు అవిసెల విలపిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గుళ్లపల్లి అఖిల్ శుక్రవారం ఉదయం వరంగల్ వెళగా.. నగరంలోని 16వ డివిజన్ గొర్రెకుంట క్రాస్ వద్ద వరంగల్ నర్సంపేట హైవే పై అతని బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు. అఖిల్ మరణంతో ఉప్పరపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ములుగు జిల్లా వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం భూపతిరావు (32)తో పాటు మరో ముగ్గురు మిత్రులు కలిసి కాటాపూర్‌కు వెళ్తున్న క్రమంలో తాడ్వాయి మండలం బీరెల్లి-కాటాపూర్ రోడ్డు బంజర వద్ద రోడ్డుపై పడి ఉన్న చెట్టుకు ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు వాజేడులోని ఫెరిడో రిసోర్ట్స్ బోగత హోటల్ విధులు నిర్వహిస్తున్నారు.

శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్‌ను గుర్తించాలి

- యాజమాన్యం, ప్రభుత్వం నిరాకరణ
- నెల రోజులుగా సమ్మె
- అణచివేత పెరిగినా వెనక్కి తగ్గని కార్మికులు
- కార్మికులు, సంఘం నేతల అరెస్టు
- సమ్మె వేదిక కూల్చివేత



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్‌ను గుర్తించాలనే ప్రధాన డిమాండ్‌తో కార్మికులు చేపట్టిన సమ్మె నెలరోజులు పూర్తి చేసుకుంది. అయినా యూనియన్ గుర్తింపునకు శాంసంగ్ యాజమాన్యం, తమిళనాడు ప్రభుత్వం నిరాకరించాయి. మరోపక్క ప్రభుత్వ అణచివేత పెరిగింది. అయినా కార్మికులు వెనక్కి తగ్గలేదు. దీంతో శాంసంగ్ ఇండియాకు చెందిన చెన్నై ప్లాంట్‌లో సమ్మె చేస్తున్న వందలాది మంది కార్మికులను, కార్మిక సంఘ నేతలను బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసింది. అంతేకాక ఆ రాష్ట్ర పోలీసులు సమ్మె వేదికను కూల్చివేశారు. అరెస్టైన వారిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. సౌందరరాజన్, శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయూ) అధ్యక్షుడు ఇ. ముత్తు కుమార్ ఉన్నారు. మరోపక్క సమ్మె చట్టవిరుద్ధమని తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. కొన్ని గంటల నిర్బంధం అనంతరం కార్మిక నాయకులను బెయిల్‌పై విడుదల చేశారు.

ఎస్ఐడబ్ల్యుయూ గుర్తింపు, మెరుగైన వేతనాలు, పని పరిస్థితులపై డిమాండ్ చేస్తూ చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ ప్లాంట్‌లో 1,300 మందికిపైగా శాంసంగ్ కార్మికులు సెప్టెంబర్ 9 నుంచి సమ్మె చేపట్టారు. వీరి డిమాండ్లపై యాజమాన్యం నేరుగా మాట్లాడేందు కు నిరాకరించారు. దీంతో వారు చేపట్టిన సమ్మె మంగళవారం నాటితో నెల రోజులు పూర్తి చేసుకుంది. చట్టం ప్రకారం సమ్మె ప్రారంభానికి 14 రోజుల ముందు యాజమాన్యానికి నోటీసు అందించినందున తాము చేస్తున్న సమ్మె చట్టబద్ధమైనదేనని కార్మికులు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహకాలు, వాణిజ్య శాఖ మంత్రి టి.ఆర్.బి. రాజాతో సహా ముగ్గురు మంత్రులు శాంసంగ్ యాజమాన్యం, కార్మికులు కలిసి ఒక తీర్మానం చేసుకున్నట్టు ప్రకటించారు. కంపెనీ వేతనాల పెంపునకు, మెరుగైన పని పరిస్థితులు కల్పించడానికి అంగీకరించినట్టు రిపోర్టులు వచ్చాయి. అయితే మంత్రుల ప్రకటనను కార్మికులు వ్యతిరేకించారు. కార్మికులను విభజించే ప్రయత్నమని పేర్కొంటూ సమ్మె చేస్తున్న కార్మికులు ఒప్పందాన్ని తిరస్కరించారు. యాజమాన్యం కొంతమంది కార్మికులను "వర్కర్స్ కమిటీ" అని పిలుస్తోందని, వారితో ఒప్పందంపై సంతకం చేసినట్టు నటించిందని, సమ్మె చేస్తున్న కార్మికులతో ఎటువంటి చర్చలు చేయలేదని కార్మికులు తెలిపారు.

దేశంలో శాంసంగ్ ప్లాంట్లు చెన్నై, ఢిల్లీలో రెండు ఉన్నాయి. చెన్నై ప్లాంట్ టీవీలు, ఫ్రిజ్‌లు వంటి గృహానికి సంబంధించిన వాటిని ఉత్పత్తి చేస్తోంది. ఢిల్లీ (నోయిడా)లో ఉన్న ప్లాంట్ ఎక్కువగా మొబైల్ ఫోన్‌లను ఉత్పత్తి చేస్తోంది. చెన్నై ప్లాంట్‌లో 1,700 మంది కార్మికులు ఉన్నారు. అందులో 1,550 మంది ఎస్ఐడబ్ల్యుయూ (సీఐటీయూ అనుబంధం) లో ఉన్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు జి. రామకృష్ణన్ సమ్మె చేస్తోన్న కార్మికులకు వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఇచ్చిన పిలుపుల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా, యూనియన్‌ను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా అక్టోబర్ 5న సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందితో ఆందోళన చేపట్టాయి.

యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు

కంపెనీకి ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కంపెనీకి మద్దతు ఇస్తోందని సీఐటీయూ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎ. సౌందరరాజన్ విమర్శించారు. "మా ప్రధాన డిమాండ్ యూనియన్ గుర్తింపు. దానికి అంగీకరిస్తే వెంటనే సమ్మె విరమిస్తాం. ఇతర విషయాలు తరువాత చర్చించుకోవచ్చు" అని అన్నారు. శాంసంగ్ కార్మికుల సమ్మె కేవలం వేతనాల గురించి మాత్రమే కాదని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం సంఘం ఏర్పాటు చేసుకునే రాజ్యాంగ హక్కు కోసమని స్పష్టం చేశారు.

-సీఐటీయూ తమిళనాడు రాష్ట్ర నాయకుడు ఎ. సౌందరరాజన్

పార్టీలో నేను చెప్పిందే ఫైనల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూసీ పరివాహక ప్రాంతాల్లో అనేక కష్టాలకోర్చి 30, 40 ఏండ్ల కింద పేదలు కట్టుకున్న ఇండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు హైడ్రాపేరుతో కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తప్పుబట్టారు. హైడ్రా విషయంలో బీజేపీ నేతల మధ్య భిన్నాభిప్రాయాలుండటంపై ప్రశ్నించగా.. పేదల ఇండ్లను కూల్చాలని తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎక్కడైనా చెప్పారా? అని అడిగారు. పార్టీలో తాను చెప్పిందే ఫైనల్ అనీ, అదే పార్టీ వాయిస్ అని చెప్పారు. దామగుండంలో రాడార్ స్టేషన్ ఏర్పాటు, దేవాదాయ భూముల బదిలీపై అడగ్గా..దానిపై పూర్తిస్థాయిలో అవగాహన లేదంటూనే రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామంటూ దాటవేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హర్యానాలో ఈవీఎం ట్యాపరింగ్ వల్లనే బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల ను ఖండించారు. కాంగ్రెస్ లేఖకు ఈసీ దీటుగా జవాబిచ్చిందని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లో రెండో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు. జమ్మూలో 29 సీట్లు గెలిచామనీ, కాశ్మీర్ లోయలోనూ తమ ఓటు బ్యాంకు పెరిగిందని చెప్పారు. ఇండిపెండెంట్లు ఎక్కువ ఓట్లు చీల్చడం ద్వారా హంగ్ ఏర్పడుతుందని తాము భావించామన్నారు. కానీ, జమ్మూలో బీజేపీవైపు, కాశ్మీర్‌లో ఎన్‌సీవైపు ఏకపక్షంగా ఓటర్లు మొగ్గు చూపారని చెప్పారు. ఎలాంటి హింస లేకుండా, బైపోలింగ్ లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. ఐదుగురు నామినేటెడ్ ఎమ్మెల్యేల ఎన్నిక పార్లమెంట్ చేతుల్లో ఉందని చెప్పారు. బీడీసీ, డీడీసీలను దారిలో పెట్టామనీ, పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి వాటా మేరకు నిధులు కేటాయించామని తెలిపారు. బీఆర్ఎస్‌తో కలిసిపోయే ప్రసక్తే లేదనీ, రాష్ట్ర సర్కారుపై తాము ఒంటరిగానే పోరాడుతామని చెప్పారు.

రిటైనింగ్ వాల్‌కట్టి మూసీని సుందరీకరించొచ్చు

మూసీ ప్రక్షాళన కోసం పేదల ఇండ్లను కూల్చాల్సిన పనిలేదనీ, రిటైనింగ్ వాల్ కట్టి సుందరీకరించొచ్చని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే అక్కడ పేదలు ఇండ్లు కట్టుకున్నారనీ, ప్రభుత్వమే రోడ్లు, డ్రయినేజీ, తాగునీటి సరఫరా, ఇంటి నెంబర్ల కేటాయింపు తదితర సౌకర్యాలు కల్పించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ ఇండ్లను కూల్చడమేంటని ప్రశ్నించారు. పేదలకు అండగా తమ పార్టీ ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూసీపై కట్టిన మెట్రోస్టేషన్‌ను, ఎంజీ బస్‌స్టేషన్‌ను ప్రభుత్వం కూలుస్తుందా? అని నిలదీశారు. సీఎం కూర్చొని మూసీ పరివాహక ప్రాంతంలోని పేదలను ఒప్పించి వారిని మంచి ప్రాంతాలకు తరలిస్తే తమకు ఏ అభ్యంతరమూ లేదని స్పష్టం చేశారు. డ్రయినేజీ నీళ్ల మొత్తం మూసీలోనే కలుస్తున్నాయనీ, దానికి ప్రత్యామ్నాయం చూపెట్టకుండా సుందరీకరణ ఎలా సాధ్యమని నిలదీశారు. 1.50 లక్షల కోట్ల రూపాయలతో ఏం చేయబోతున్నారు? దాని కోసం మలక్‌పేట రేసు కోర్సు స్థలాన్ని అమ్మాలని చూడటమేంటి? సుందరీకరణకు సమగ్ర కార్యాచరణ ఏది? ఇండ్లు కూలగొట్టిన తర్వాత సుందరీకరణ ఆగిపోతే బాధిత పేదల పరిస్థితేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ముందు హైదరాబాద్ చుట్టు పక్కలున్న సబ్‌అర్బన్ ప్రాంతాల్లో డ్రయినేజీ, తాగునీటి, రోడ్ల లాంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు.

అర్జెంటీనాలో మిలే సంస్కరణలపై కార్మికవర్గం కన్నెర్ర

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనాలో జేవియర్ మిలే నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంస్కరణలపై కార్మిక వర్గం కన్నెర్ర చేసింది. ఆటోమోటివ్, ఏరోస్పేస్, ఇంధన, జౌళి వంటి పలు పారిశ్రామిక రంగాలకు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ ఇండస్ట్రియల్ యూనియన్ ఈ సంస్కరణలు యాజమాన్యాలకు అనుకూలంగా వున్నాయని విమర్శిం చింది. కార్మికులు ఎంతగానో కష్టపడి సాధించిన హక్కులను కాలరా స్తున్నాయని పేర్కొంది. సమాజంలోని అన్ని తరగతులు, రంగాలకు చెందిన కార్మికులపైన ఇవి తీవ్ర ప్రభావం చూపిస్తాయని విమర్శించాయి. చర్చలు , సమిష్టి బేరసారాల ద్వారా కుదుర్చుకున్న ఒప్పందాలతో కూడిన వ్యవస్థను నీరుగార్చేలా ప్రభుత్వం కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. వీటివల్ల అనిశ్చితిని పరిష్కరించగలుగుతామని, కార్మికులను తొలగించిన సమయంలో తలెత్తే సమస్యలు పరిష్కరించుకోవడానికి ఈ సంస్కరణలు అనువుగా ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. నష్టపరిహారానికి సంబంధిం చిన నిబంధనల స్థానే కొత్త వ్యవస్థను అమలు చేయడం వల్ల కార్మికవర్గ ప్రయోజనాలు దెబ్బతింటాయని అర్జెంటీనా కార్మిక సంఘం సీటీఏ పేర్కొంది.

ప్రజావాణికి 295 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 295 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖకు 90, మైనారిటీ వెల్ఫేర్ శాఖకు 32, విద్యుత్ శాఖకు 18, హోం శాఖకు 10, ఇతర శాఖలకు 145 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డా.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సులు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. తొలి దశలో వేర్‌హౌజ్ ఎగ్జిక్యూటివ్, కీ కన్సైనర్ ఎగ్జిక్యూటివ్, ఫినిషింగ్ స్కిల్స్ ఇన్ నర్సింగ్ ఎక్సలెన్స్, ఫార్మా అసోసియేట్ ప్రోగ్రాం కోర్సులను నవంబర్ 4 నుంచి నిర్వహించనున్నారు. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 29 వరకు గడువుంది. తాత్కాలికంగా వీటిని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీ), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ప్రాంగణాల్లో చేపట్టనున్నారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చు.

గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు

ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని రాజంపేట మండలంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఎస్పీ వివరాలు వెల్లడించారు. రాజంపేట్ మండల కేంద్రానికి చెందిన బల్ల రవీందర్ గతంలో రాజంపేట్‌తోపాటు, కామారెడ్డిలోని కౌసల్య ఆస్పత్రిలో స్కానింగ్ విభాగంలో పనిచేసేవారు. 2021లో కౌసల్య హాస్పిటల్ సీజ్ కావడంతో ఖాళీగా ఉన్నాడు. డబ్బులు సంపాదించాలనే ఆశతో గతంలో అనుభవం ఉన్నటు వంటి లింగ నిర్ధరణ పరీక్షలు నిర్వహించేందుకు ఆన్‌లైన్‌లో అల్ట్రా సౌండ్ స్కానర్ గురించి తెలుసుకొని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ అర్బన్ గాంధీనగర్‌కు చెందిన కొట్టాల సాంసన్, కృష్ణా జిల్లా ప్రకాష్ నగర్‌లోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్ నుంచి స్కానర్‌ను కొనుగోలు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఇంట్లోనే స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. కాగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ కాలనీకి చెందిన బోయిని యాదగిరి, దోమకొండ మండలం గొట్టుముక్కల గ్రామంలో ఆర్ఎంపీగా విధులు నిర్వహిస్తున్న భక్కీ



ప్రవీణ్ కుమార్‌ను గర్భిణులను లింగనిర్ధారణ కోసం ఆయన దగ్గరకు పంపేవారు. కాగా సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు.. స్థానిక రాజంపేట్ పోలీసులతో కలిసి గురువారం సోదాలు చేయగా.. ఆ సమయంలో సిద్దిపేట్ జిల్లా వర్గల్‌కు చెందిన మహిళకు లింగ నిర్ధారణ చేస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకున్నా స్కానర్‌ను విక్రయించినవారితో పాటు సహకరిస్తున్న ఇద్దరిని, ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి అల్ట్రా సౌండ్ (మిన్డై కంపెనీ), ట్రెండుసర్ కేబుల్ (ప్రోబ్), పవర్ కేబుల్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పూల ధరలకు రెక్కలు



(మొదటిపేజీ తరువాయి)

ధరల పరిస్థితీ అదే విధంగా మారింది.

నూనెల ధరలపై దిగుమతి సుంకం పెంపు ప్రభావం

వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగాయి. సగటున కిలోకు రూ.40 నుంచి రూ.50 వరకు ధరల పెంపుదల ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గృహ, వాణిజ్య అవసరాల కోసం నెలకు సుమారు 4,300 మెట్రిక్ టన్నుల వంట నూనెలను వినియోగిస్తున్నారు. పామాయిల్, రైస్‌బ్రాన్, పొద్దుతిరుగుడు, వేరుశెనగ నూనెలను వాడుతారు. ముడిచమురుపై దిగుమతి సుంకాన్ని 5.50శాతం నుంచి 22శాతం పెంచుతూ కేంద్రప్రభుత్వం గత నెలలో నిర్ణయం తీసుకుంది. దీనికి తోడు ఇరాన్-ఇజ్రాయిల్, ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధాలు నడుస్తుండటం కూడా నూనెల ధరలపై ప్రభావం చూపుతోంది. పొద్దుతిరుగుడు నూనెను 60శాతం వరకు ఉక్రెయిన్- రష్యా నుంచి భారతదేశం దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా ముడిచమురు ధరలూ పెరిగాయి. మలేషియా- ఇండోనేషియా నుంచి పామాయిల్‌ను అధికంగా దిగుమతి చేసుకుంటుండటంతో ముడిచమురు దిగుమతి సుంకం పెరిగిన నేపథ్యంలో నూనెల ధరలు పెరుగుతున్నాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. స్థానిక హోల్‌సెల్ మార్కెట్‌లో నూనెల ధరల పెరుగుదలను పరిశీలిస్తే.. పామాయిల్ గత నెలలో రూ.90 ఉండగా ఇప్పుడు రూ.130, పొద్దు తిరుగుడు రూ.113 నుంచి రూ.140, వేరుశెనగ రూ.140 నుంచి రూ.150, రైస్‌బ్రాన్ రూ.110 నుంచి రూ.140కి పెరిగాయి. ఇందులోనూ క్వాలిటీ, కంపెనీని బట్టి రేట్ల పెంపుదల అధికంగా ఉంటుంది.

దిగుబడులు లేక పప్పుల ధరలు పైపైకి...

అధిక వర్షాలకు తోడు రైతులు పప్పు పంటలపై ఆసక్తి చూపకపోవడంతో దేశీయ అవసరాలకు విదేశాల నుంచి పప్పులను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. బ్రెజిల్, అర్జెంటీనా, మొజాంబిక్, టాంజినియా, మయన్మార్ తదితర దేశాల నుంచి పప్పుదినుసులను భారతదేశం దిగుమతి చేసుకుంటోంది. దేశీయంగా పప్పు ధాన్యాల ఉత్పత్తి ఏటేటా క్షీణిస్తోంది. 2022-23లో 261 లక్షల టన్నుల ఉత్పత్తి ఉండగా 2023-24 నాటికి 234 టన్నులకు ఉత్పత్తి పడిపోయింది. ఈ నేపథ్యంలో ధరలు సగటున రూ.50కి పైగా పెరిగాయి. హోల్‌సెల్ మార్కెట్ ధరల ప్రకారం.. కందిపప్పు రూ.115 నుంచి 160, పెసర పప్పు రూ.70- 130, శెనగ పప్పు రూ. 60- 100, మినప గుండ్లు రూ.90- 160, పల్లీలు రూ.100 నుంచి రూ.150, ఉప్మా రవ్వ కిలో రూ.35 నుంచి రూ.45కు పెరిగాయి. వీటికితోడు ఉల్లిగడ్డలు కిలో రూ.30 నుంచి రూ.80కి చేరాయి.

అధిక వర్షాలతో పూల ధరలకూ రెక్కలు

అధిక వర్షాలు, వరదలతో పూల ధరలకూ రెక్కలొచ్చాయి. బంతిపూలు హోల్‌సేల్‌గా రూ.70-80 వరకు ఉండగా బయట రూ.100కు పైగా విక్రయిస్తున్నారు. ఇటు బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు, భవానీ, అయ్యప్ప మాలదారులు, పండుగల నేపథ్యంలో గుళ్ల, గోపురాలు, ఇండ్లలోనూ పూజలు అధికం కావడంతో పూల ధరలు భారీగా పెరుగుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.250 ఉన్న గులాబీ ఇప్పుడు రూ.350 పలుకుతోంది. బయట రూ.400 వరకు కూడా వీటిని విక్రయిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 250-300 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 350-400 ఎకరాల్లో పూల తోటలు సాగు చేస్తారు.

బంతి, చామంతి, మల్లె, కనకాంబరం, లిల్లీ పూలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వరదల కారణంగా పూల తోటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా ధరలపై ప్రభావం పడింది. శనివారం దసరా, ఆ తర్వాత సైతం దీపావళి, కార్తీకమాసం, సంక్రాంతి వరకు పూజలు పునస్కారాలు ఎక్కువగా నిర్వహిస్తారు. కాబట్టి పూల ధరలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి ఉండదని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి పూలను దిగుమతి చేసుకుంటున్నారు.

డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు అన్యాయం

- ఎస్సీ,ఎస్టీయూఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్సీ,ఎస్టీయూఎస్‌టీఎస్ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్, ప్రధాన కార్యదర్శి చావన్ సుభాన్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ మెరిట్‌లో ఎంపికైన ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ అభ్యర్థులను ఆయా రిజర్వేషన్ కేటగిరీల కింద నియామకం చేశారని తెలిపారు. దానివల్ల ఆ కేటగిరీలోని రిజర్వేషన్ అభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు. ఇంకోవైపు పోస్టింగ్‌ల కంటే ముందు నియామకాల సమయంలోనే లోకల్‌బాడీ, గవర్న మెంట్ అనే ఆప్షన్ అడగడం వల్ల అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారని తెలిపారు. నియామకం తర్వాత పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో వెబ్‌ఆప్షన్ల ద్వారా లోకల్‌బాడీ, గవర్నమెంట్ ఏది కావాలో అడగాలని వివరించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ అభ్యర్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయం పాటించాలి : బీటీఏ

డీఎస్సీ నియామకాల్లో యాజమాన్య ఆప్షన్ ఫామ్‌తో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బీటీఏ అధ్యక్షులు కె చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 1:1 నిష్పత్తిలో ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందనుకున్న రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు రాలేదని తెలిపారు. ఓపెన్ కోటాలో ఎంపికైన అభ్యర్థులను ఆ రిజర్వేషన్ కేటగిరీల్లో ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో వారు ఉద్యోగం పొందితే రిజర్వేషన్ కేటగిరీలో మరొకరికి ఉద్యోగం వచ్చేదని తెలిపారు. కానీ మెరిట్‌లో ఉన్న వారికి రిజర్వేషన్ కేటగిరీలో ఎంపిక చేయడం వల్ల ఆ కేటగిరీలో ఉన్న మరొకరికి ఉద్యోగం రాకుండా పోయిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలనీ, వారికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఓటమికి కారణాలనేకం

బీజేపీతో ఐఎన్ఎల్‌డీ కూటమి లోపాయికారీ అవగాహన

- కొంపముంచిన అసమ్మతి
- హ్యాండిచ్చిన దళితులు
- ఐదు నెలల్లోనే ఓట్లకు భారీగా గండి
- హర్యానాపై పోస్ట్‌మార్టం


చండీగఢ్ : హర్యానా శాసనసభ ఎన్నికలలో వచ్చిన అనూహ్య ఫలితాలు రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. కాంగ్రెస్ విజయం తథ్యమంటూ ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తప్పడమే దీనికి కారణం. ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. వీటిపై ఎన్నికల కమిషన్‌కు ఈ నెల 9న ఫిర్యాదులు కూడా అందజేసింది. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలను 'పూర్తిగా ఛార్జింగ్' చేశారన్నది కాంగ్రెస్ ప్రధాన అభియోగం. ఈవీఎంలను పూర్తిగా ఛార్జింగ్ చేయకూడదని, అలా చేస్తే వాటిని తారుమారు చేశారనో లేదా మార్చేశారనో అనుమానించాల్సి వస్తుందని ఆ పార్టీ వాదిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకూ పది శాసనసభ స్థానాలకు సంబంధించి ఫిర్యాదులు అందించింది. మరికొన్ని స్థానాలపై కూడా ఫిర్యాదులు ఇస్తామని తెలిపింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరునాడే కాంగ్రెస్ తన తొలి ఫిర్యాదును అందజేసింది. ఫలితాలను న్యాయస్థానంలో సవాలు చేస్తామని కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫలితాల ప్రకటనలో ఏవైనా అవకతవకలు జరిగాయా లేక ఓటమికి కాంగ్రెస్ పార్టీ సాకులు వెతుకుతోందా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

బీజేపీతో ఐఎన్ఎల్‌డీ కూటమి 'అవగాహన'

శాసనసభ ఎన్నికలలో ఐఎన్ఎల్‌డీ, బీఎస్పీ, హెచ్ఎల్‌పీ పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఆ పార్టీలు ముందుగానే బీజేపీతో అవగాహన కుదుర్చుకున్నాయని వార్తలు వచ్చాయి. సిర్సా శాసనసభ స్థానంలో జరిగింది అదే. అక్కడ బీజేపీ తన అభ్యర్థిని ఉపసంహరించుకొని హర్యానా లోకొహిత్ పార్టీ (హెచ్ఎల్‌పీ)కి మద్దతు తెలిపింది. ఇది కేవలం ఆ ఒక్క సీటుకే పరిమితం కాలేదు. సిర్సా లోక్‌సభ స్థానం పరిధిలోని దబ్వాలీ, రనియా, ఎలెనాబాద్ శాసనసభ స్థానాలలో బీజేపీ అభ్యర్థులకు చాలా తక్కువ ఓట్లు పడ్డాయి. ఈ మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు సిర్సా లోక్‌సభ స్థానం పరిధిలోనివి. ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఈ మూడు స్థానాలలో బీజేపీకి వచ్చిన ఓట్లతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా లక్ష ఓట్లు తగ్గాయి. దబ్వాలీలో బీజేపీకి ఓటేసిన వారిలో 82 శాతం, ఎలెనాబాద్‌లో 72 శాతం, రనియాలో 65 శాతం మంది ఈసారి ఆ పార్టీకి ఓటేయలేదు. సంస్థాగతంగా ఎంతో బలముందని చెప్పుకునే బీజేపీ కొన్ని స్థానాలలో 70 శాతం ఓట్లను కోల్పోవడం సాధారణంగా జరిగే పని కాదని, దీని వెనుక ఏదో వ్యూహం ఉండవచ్చునని పరిశీలకులు తెలిపారు. అయితే ఈ ఓట్లు కాంగ్రెస్‌కు పడలేదు. వాస్తవానికి దబ్వాలీలో కాంగ్రెస్ పార్టీ కూడా 18 వేల ఓట్లను కోల్పోయింది. అంటే దీనర్థం బీజేపీ ఓట్లన్నీ ఐఎన్ఎల్‌డీ నేతృత్వంలోని కూటమికే పడ్డాయని స్పష్టమవుతోంది. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ మూడు స్థానాలలో బీజేపీ ఓటింగ్ గణనీయంగా పడిపోయినప్పటికీ మిగిలిన మూడు స్థానాలలో మాత్రం పెరగడం గమనార్హం.

లోక్‌సభ ఎన్నికలలో సిర్సాలోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలలోనూ కాంగ్రెస్ ఆధిక్యత కనబరచింది. ఇప్పుడు వీటిలో రెండు స్థానాలను ఐఎన్ఎల్‌డీకి, ఒక దానిని బీజేపీకి కోల్పోయింది. కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన జాట్లు, దళితుల ఓట్ల కోసమే ఐఎన్ఎల్‌డీ కూటమి కూడా వెంపర్లాడింది. రెండు స్థానాలలో బీజేపీకి వచ్చిన మెజారిటీ కంటే ఈ కూటమికే ఎక్కువ ఓట్లు లభించాయి.



ఆ ఓట్లన్నీ ఏమయ్యాయి?

లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి 46 శాసనసభ స్థానాలలో ఆధిక్యత లభించింది. మిత్రపక్షమైన ఆప్‌తో కలిసి 47 శాతం ఓట్లు సాధించింది. శాసనసభ ఎన్నికలు వచ్చే సరికి దాని ఓట్లు ఏకంగా ఎనిమిది శాతం తగ్గాయి. అనేక స్థానాలలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 36 స్థానాలలో కాంగ్రెస్ ఓట్లు పది వేలు తగ్గాయి. 18 స్థానాలలో ఆ పార్టీ 20 వేల ఓట్లను కోల్పోయింది. 28 స్థానాలలో ఆ పార్టీ 20 శాతం ఓట్లను చేజార్చుకున్నదని గణాంకాలు చెబుతున్నాయి. అంటే ఈ 28 స్థానాలలో లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రతి ఐదుగురిలో ఒకరు అసెంబ్లీ ఎన్నికలలో వేరే పార్టీకి ఓటేశారు. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఇంత మార్పు ఎందుకు వచ్చింది?

దెబ్బతీసిన 'తిరుగుబాట్లు'

తిరుగుబాటు అభ్యర్థుల కారణంగా కాంగ్రెస్ పార్టీ అనేక స్థానాలను కోల్పోయిన మాట వాస్తవం. ఉచనా కలాన్, కల్కా, బద్రా, గొహానా స్థానాలలో తిరుగుబాటు అభ్యర్థులు గణనీయంగా ఓట్లు సాధించి కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీశారు. అయితే ఇక్కడో ట్విస్ట్ ఉంది. కొన్ని స్థానాలలో కాంగ్రెస్ అధికార అభ్యర్థుల కంటే తిరుగుబాటు అభ్యర్థులకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. పుండ్రి, అంబాలా కంటోన్మెంట్, బల్లబ్‌ఘర్, బహదూర్‌ఘర్ వంటి స్థానాలు ఇందుకు ఉదాహరణ. టిక్కెట్ల కేటాయింపులో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని దీనిని బట్టి అర్థమవుతోంది. సర్వేలను విశ్వసించకపోవడం, సొంతగా నిర్వహించిన సర్వేలు కూడా తప్పుడు అంచనాలు వేయడం దీనికి కారణంగా చెప్పవచ్చు.

భూపీందర్ ఇలాకాలోనూ...

దీపేందర్ సింగ్ హూడా కుటుంబానికి కంచుకోటగా చెప్పుకునే రోహ్‌తక్‌లో సైతం కాంగ్రెస్ ఓట్లకు భారీగా గండి పడింది. లోక్‌సభ ఎన్నికలలో హూడాకు 7.83 లక్షల ఓట్లు రాగా ఆ స్థానం పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 5.93 లక్షలు మాత్రమే. అంటే ఆ పార్టీ రోహ్‌తక్ పరిధిలో 1.9 లక్షల ఓట్లను కోల్పోయింది. దీపేందర్ తండ్రి భూపీందర్ సింగ్ హూడా ముఖ్యమంత్రి పదవికి పోటీ పడినప్పటికీ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయకపోవడాన్ని అర్థం చేసుకోవడం కష్టంగానే ఉంది. భూపీందర్‌కు సొంత ఇలాకాలోనే ప్రజాదరణ తగ్గడం గమనార్హం. ఏ ఒక్క సర్వే దీనిని పసిగట్టలేకపోయింది.

దూరమైన దళితులు

హర్యానా శాసనసభ ఎన్నికలపై కులాలు కూడా ప్రభావం చూపాయి. జాట్లు కాంగ్రెస్‌నే బలపరచినప్పటికీ దళితులు మాత్రం దూరమయ్యారు. దళిత నేత కుమారి సెల్జాను కాంగ్రెస్ అవమానించిందని, పట్టించుకోలేదని వారు భావించారు. బీజేపీ అవలంబించిన ఉప వర్గీకరణ విధానం కూడా కాంగ్రెస్ నుండి దళితులను దూరం చేసింది. కొన్ని స్థానాలలో బీఎస్పీ అభ్యర్థులకు దళితులు పెద్ద సంఖ్యలో ఓటేశారు. అంతర్గత కుమ్ములాటలు, వెన్నుపోట్లు కూడా కాంగ్రెస్ కొంప ముంచాయి. తిరుగుబాటు అభ్యర్థులు గణనీయంగా ఓట్లు పొందడమే దీనికి నిదర్శనం. దీనిని కూడా సర్వేలు పసిగట్టలేకపోయాయి. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సర్వేలు కూడా అసమ్మతి ముప్పును పట్టించుకున్నట్లు లేవు. కర్ణుడి చావుకు కారణాలు అనేకం అన్నట్లు హర్యానాలో కాంగ్రెస్ పరాజయానికి ఇవన్నీ దోహదపడ్డాయి.



ఎన్సీకి కాంగ్రెస్ మద్దతు

జమ్మూలో ఒమర్ ప్రభుత్వ ఏర్పాటుకు సహకారం

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగాను 42 స్థానాల్లో గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు జమ్మూకాశ్మీర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా.. నేషనల్ కాన్ఫరెన్స్ కీలక నేత ఒమర్ అబ్దుల్లాకు లేఖ అందజేశారు. అంతముందు జమ్మూకాశ్మీర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సమావేశమైంది. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి మద్దతు తెలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం తీర్మానం కాపీని పార్టీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్‌కు ఇచ్చారు. తాజా పరిణామాల నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా నేడు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధతను తెలిపే అవకాశం ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ ఆహ్వానం మేరకు నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ పార్టీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి. మరోవైపు జమ్మూకాశ్మీర్‌లో ఏకైక స్థానాన్ని గెలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఎన్సీకే మద్దతు తెలిపింది.

సామాజిక భద్రతా కోడ్ నివేదిక జాప్యం

కేంద్రాన్ని నిలదీసిన ఎన్‌హెచ్చార్సీ

న్యూఢిల్లీ : సామాజిక భద్రతా కోడ్ అమలుపై అవసరమైన నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్రాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్చార్సీ) హెచ్చరించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రిమైండర్ జారీ చేసింది. నివేదికను సమర్పించకపోతే.. కమిషన్ ముందు వ్యక్తిగత హాజరు కోసం సంబంధిత అధికారిని పిలిపిస్తా, మానవ హక్కుల పరిరక్షణ (పీహెచ్ఆర్) చట్టం, 1993లోని సెక్షన్ 13 ప్రకారం బలవంతపు చర్యలను ప్రారంభించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్చార్సీ హెచ్చరించింది. సామాజిక భద్రత లేని సమాజంలోని బలహీన వర్గాల కోసం ఉద్దేశించిన సామాజిక భద్రతా కోడ్ అమలులో లేకపోవటంపై సుప్రీంకోర్టు న్యాయవాది, ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన కేసును అనుసరించి ఈ పరిణామం చోటుచేసుకున్నది. ప్రతిస్పందనను సమర్పించడానికి ఎన్‌హెచ్చార్సీ సంబంధిత మంత్రిత్వ శాఖకు నాలుగు వారాల గడువునిచ్చింది. కేంద్రం నోటిఫై చేసిన కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020ని అమలు చేయకపోవటం తక్కువ ఆదాయ వర్గాల ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని త్రిపాఠి ఆరోపించారు. జాతీయ సామాజిక భద్రతా బోర్డు, రాష్ట్ర అసంఘటిత కార్మికుల బోర్డులు, వారి పాత్రలు, అధికారాలను నిర్వచించటం కోసం కోడ్ వివరణాత్మక నిబంధనలను కలిగి ఉన్నదని నొక్కిచెప్పారు. కేంద్రం నోటిఫై చేయాల్సిన తేదీ నుంచి కోడ్ అమలులోకి రావాల్సి ఉండగా నేటికీ సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలను నెరవేర్చటంలో విఫలమైనందున.. త్రిపాఠి ఎన్‌హెచ్చార్సీ జోక్యాన్ని కోరుకున్నారు. ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్.. ఆరు వారాల్లోగా చర్య తీసుకున్న నివేదికను సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. జులై 2 నుంచి ఆగస్టు 22 నాటి విచారణలో ఎన్‌హెచ్చార్సీ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శికి రిమైండర్‌లు జారీ చేసింది. అయినప్పటికీ.. కమిషన్‌కు సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి నివేదిక కూడా అందకపోవటం గమనార్హం.



ఫైరింగ్ శిక్షణలో మిస్ ఫైర్

ఇద్దరు అగ్నివీరులు మృతి

హైదరాబాదీలుగా గుర్తింపు

నాసిక్: దేశానికి సేవ చేయాలని ఎంతో ఆశగా ఫైరింగ్ శిక్షణకు వెళ్లారు. కానీ అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో వారి కళ నెరవేరకుండానే అసువులు బాసారు. శిక్షణలో ఇండియన్ ఫీల్డ్ గన్ నుంచి షెల్ మిస్‌ఫైర్ కావడంతో ఇద్దరు ఆర్మీ అగ్నివీరులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన మహారాష్ట్రలోని నాసిక్‌లో గురువారం చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన విశ్వరాజ్ సింగ్ (20), సైఫట్ షిట్ (21) ఫైరింగ్ శిక్షణ కోసం నాసిక్‌కు వెళ్లారు. అక్కడ డియోలాలిలోని ఆర్టిలరీ స్కూలులో ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా ఒక షెల్ పేలి మిస్‌ఫైర్ అయ్యింది. దీంతో ఇద్దరు అగ్నివీరులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని స్థానికంగా ఉన్న డియోలాలిలోని ఎంహెచ్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని అధికారులు తెలిపారు. దీనిపై కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీకి ఆదేశించినట్టు ఇండియన్ ఆర్మీ అధికారులు తెలిపారు. కాగా, ఘటనపై హవల్దార్ అజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు డియోలాలి క్యాంప్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఇదే తరహా ఘటన రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో కూడా చోటుచేసుకుంది. మాక్ డ్రిల్ జరుగుతుండగా మంటలార్పే యంత్రం పేలి అగ్నివీర్ సౌరభ్ పాల్ (24) మృతిచెందాడు. అతను ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తించారు.

మహారాష్ట్రలో ముదిరిన రాజకీయం

క్యాబినెట్ మీటింగ్ నుంచి డిప్యూటీ సీఎం వాకౌట్



ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహాయుతి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీల మధ్య లుకలుకలు తీవ్రస్థాయికి చేరాయి. సీఎం ఏక్‌నాథ్ శిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎన్సీపీ చీఫ్, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ విభేదించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం క్యాబినెట్ సమావేశం ప్రారంభమైన పది నిమిషాల తర్వాత ఆయన అజిత్ వాకౌట్ చేశారు. విరార్ - అలీబాగ్ కారిడార్ ప్రాజెక్ట్ ఈ వివాదానికి కారణంగా తెలుస్తున్నది. ఈ ప్రాజెక్టుకు ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వాలని సీఎం శిండే ఆదేశించారు. కాగా, ఆర్థిక శాఖ బాధ్యతలు చూస్తున్న అజిత్ పవార్ ఆ ఫైల్‌పై ఇంకా సంతకం చేయలేదని తెలుస్తోంది. దీంతో శుక్రవారం మంత్రివర్గం సమావేశంలో ఈ విషయంపై చర్చ జరగడంతో అజిత్ పవార్ మధ్యలోనే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు అజిత్ పవార్‌ను పక్కన పెట్టేందుకు బీజేపీ, శివసేన ప్రయత్నిస్తున్నాయన్న లీకులు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహాయుతి కూటమి ప్రభుత్వాన్ని ఆయన వీడవచ్చన్న టాక్ వినిపిస్తున్నది. ఇదే జరిగితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహాయుతి ప్రభుత్వం కూలిపోయే అవకాశమున్నదని సంకేతాలు వస్తున్నాయి.

పీఎస్‌యూ కార్మికులకు గుడ్‌న్యూస్

- బోనస్‌లు, అదనపు చెల్లింపులు ప్రకటించిన తమిళనాడు సీఎం



న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), చట్టబద్ధమైన బోర్డుల్లోని కార్మికులకు తమిళనాడు సీఎం స్టాలిన్ తియ్యని కబురు అందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 2.75 లక్షల మంది ఉద్యోగులకు బోనస్, ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం.. గ్రూప్ సీ, డీ కింద లాభాలర్జించే పీఎస్‌యూలకు చెందిన అర్హులైన కార్మికులందరికీ కనిష్ట బోనస్ రూ. 8,400, గరిష్టంగా రూ. 16,800 చెల్లించబడుతుందని ప్రభుత్వ వర్గాల తెలిపాయి. అనుమతించదగిన మిగులు లేని పీఎస్‌యూల ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, 1.67 శాతం ఎక్స్‌గ్రేషియా చెల్లించబడుతుందని వివరించాయి. "పండుగ (దీపావళి) సీజన్‌కు ముందు మొత్తం 2,75,670 మంది రాష్ట్ర పీఎస్‌యూ కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తమిళనాడు ముఖ్యమంత్రి అక్టోబర్ 10న ఆదేశించారు" అని ప్రభుత్వ ప్రకటన పేర్కొన్నది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 369.65 కోట్ల భారం పడనున్నదని సమాచారం.

టాన్‌జెడ్కో, రాష్ట్ర రవాణా సంస్థలు, తమిళనాడు పౌర సరఫరాల కార్పొరేషన్, సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య కార్మికులు, ఉద్యోగులకు 20 శాతం బోనస్, ఎక్స్‌గ్రేషియా అందనున్నది. అయితే తమిళనాడు హౌసింగ్ బోర్డ్ అండ్ చెన్నై మెట్రోపాలిటన్‌లోని గ్రూప్ సీ, డీ ఉద్యోగులు, నీటి సరఫరా, డ్రైనేజీ బోర్డు 10 శాతం బోనస్, ఎక్స్‌గ్రేషియా పొందుతుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొన్నది. తమిళనాడు వాటర్ సప్లై అండ్ డ్రయినేజీ బోర్డు ఉద్యోగులకు 8.33 శాతం బోనస్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కార్మికులకు రూ.3,000 ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల పీఎస్‌యూ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.


టిక్‌టాక్ షాక్

వందలాది మంది ఉద్యోగులపై వేటు

కౌలాలంపూర్ : కరోనా తర్వాత ఉద్యోగాల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. లేఆఫ్స్ పేరిట ఉద్యోగులను ఇష్టానుసారంగా తీసేయటానికి వెనకాడటం లేదు. తొలుత మాంద్యం భయాలతో ఉద్యోగులను తొలగించిన సంస్థలు.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. తాజాగా ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. మలేషియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీలో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. సుమారు 700 మంది ఉద్యోగులను ఇంటికి సాగనంపినట్టు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే చాలామంది ఉద్యోగులకు లేఆఫ్‌లకు సంబంధించిన ఈ-మెయిల్స్ అందినట్టు తెలుస్తోంది. అయితే, టిక్‌టాక్ మాతృసంస్థ బైట్ డ్యాన్స్ మాత్రం ఈ లేఆఫ్స్ ప్రభావం 500 కంటే తక్కువ మంది ఉద్యోగులపైనే చూపిందని స్పష్టం చేసింది. ఈ ఏడాది మేలో కూడా టిక్‌టాక్ ప్రపంచవ్యాప్తంగా 1,000 మందికిపైగా ఉద్యోగులను తొలగించింది.

ఉన్నత విద్యలో అమ్మాయిల ముందడుగు

- డిగ్రీ ప్రవేశాల్లో 53 శాతం వారే
- అబ్బాయిల కన్నా 7.24 శాతం అధికం
- కామర్స్‌కే జై కొడుతున్న విద్యార్థులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించే వారిలో అమ్మాయిలే ముందంజలో ఉన్నారు. అబ్బాయిల కన్నా ఎక్కువగా వారే చదువుతున్నారు. అవనిలో సగం, ఆకాశంలో సగం మహిళలు అన్న నానుడి ఉన్నది. కానీ ఉన్నత విద్యలో సగానికి కంటే ఎక్కువ మంది అమ్మాయిలు చదువుతుండడం గమనార్హం. రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి వివిధ విడతల్లో భర్తీ ప్రక్రియ సాగింది. ఇప్పటి వరకు 1,055 డిగ్రీ కాలేజీల్లో 4,57,704 సీట్లుంటే, 1,96,442 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో అమ్మాయిలు 1,05,329 (53.62 శాతం) మంది ప్రవేశం పొందారు. 91,113 (46.38 శాతం) మంది అబ్బాయిలు చేరారు. ఈ గణాంకాలను బట్టి డిగ్రీ కోర్సుల్లో అబ్బాయిల కన్నా అమ్మాయిలు 7.24 శాతం అధికంగా ప్రవేశాలు పొందడం గమనార్హం. వైఎస్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సులతోపాటు ఉన్నత విద్యలో ప్రవేశాలు పెరిగాయి. అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్య చదివేందుకు అది దోహదపడింది. గత ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దాని వల్ల బాల్య వివాహాలు తగ్గడంతోపాటు ఉన్నత విద్య చదివే అమ్మాయిల సంఖ్య ఏటా పెరుగుతున్నది. ప్రస్తుతం ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) జాతీయ సగటు 28.4 శాతం ఉంటే, తెలంగాణలో 40 శాతం నమోదైంది. అమ్మాయిల జీఈఆర్ జాతీయ సగటు 28.5 శాతం, తెలంగాణలో 41.8 శాతం ఉన్నది. ఈ గణాంకాలను బట్టి దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్నత విద్యలో అమ్మాయిలే అధికంగా చదువుతున్నారని తెలుస్తున్నది.

డిగ్రీలో బీకాం కోర్సుకే డిమాండ్

దోస్త్ ద్వారా ఏటా డిగ్రీ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సుకు, డిగ్రీలో బీకాం కోర్సుకు భారీగా డిమాండ్ ఉన్నది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో డిగ్రీలో 1,96,442 మంది ప్రవేశాలు పొందారు. అందులో బీకాం కోర్సులోనే 77,469 (39.44 శాతం) మంది విద్యార్థులు చేరారు. ఆ తర్వాత బీఎస్సీ లైఫ్ సైన్సెస్ కోర్సులో 36,733 (18.70 శాతం) మంది ప్రవేశం పొందారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులో 32,181 (16.39 శాతం) మంది చేరారు. బీఏలో 28,362 (14.44 శాతం) మంది అడ్మిషన్ పొందారు. బీబీఏలో 15,835 మంది, బీసీఏలో 5,170 మంది, డిప్లొమా కోర్సుల్లో 556 మంది, బీబీఎంలో వంద మంది, బీఎస్‌డబ్ల్యూలో 25 మంది, బీ ఒకేషనల్ కోర్సులో 11 మంది చొప్పున చేరారు.

డిగ్రీ కాలేజీల్లో మిగిలిన సీట్లు 2.61 లక్షలు

రాష్ట్రంలో 1,055 డిగ్రీ కాలేజీల్లో 4,57,704 సీట్లున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 1,96,442 (42.92 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 2,61,262 (57.08 శాతం) సీట్లు మిగిలి ఉన్నాయి. 160 ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో 89,337 సీట్లుంటే, 55,361 (61.97 శాతం) సీట్లు నిండాయి. ఇంకా 33,976 (38.03 శాతం) సీట్లు మిగిలి ఉన్నాయి. 816 ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో 3,44,793 సీట్లుండగా, 1,32,388 (38.40 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. వాటిలో 2,12,405 (61.60 శాతం) సీట్లు మిగిలాయి. రాష్ట్రంలోని ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదని ఈ గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. 79 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 23,574 సీట్లుండగా, 8,693 (36.88 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. వాటిలో ఇంకా 14,881 (63.12 శాతం) సీట్లు మిగిలాయి. గురుకుల డిగ్రీ కాలేజీల్లోనూ సీట్లు ఖాళీగా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది.

డిగ్రీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం : ఆర్ లింబాద్రి

డిగ్రీ విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చామని ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)లో భాగంగా తాము కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని అన్నారు. పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను కూడా ప్రవేశ పెట్టామని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు డిగ్రీ విద్యార్థులకూ బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టామని వివరించారు. బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ (ఆనర్స్) నాలుగేండ్ల కోర్సును ప్రవేశపెట్టామని చెప్పారు. అందుకోసం డిగ్రీ కాలేజీలు, ఆస్పత్రులు, బయో ఫార్మాసూటికల్ సంస్థలతో ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుందని వివరించారు. ఇలా డిగ్రీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

నవతెలంగాణ

తన అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం - సర్వేపల్లి రాధాకృష్ణన్

సంపాదకీయం

ఉంగరాల వేళ్లతో..!

"సహనం ఒక మంచి లక్షణం కావచ్చు... కాని మా సహనం ముగింపుకొస్తోంది" అన్న సుప్రీం వ్యాఖ్యలు మోడీ సర్కార్‌కు కర్రు కాల్చి వాత పెట్టినట్లే ఉన్నాయి. ప్రధానంగా వలస కార్మికులకు రేషన్ కార్డులిచ్చి, వారు బతకడానికి అవసరమైన తిండి గింజలివ్వమని చెప్పి మూడేండ్లవుతున్నా ఇంకా ఎందుకు తాత్సారం చేస్తున్నారని సుప్రీం ఉంగరాల వేళ్లతో మొట్టింది. తదుపరి విచారణ నవంబరు 19న జరుగుతుందని ఆలోగా తగు చర్యలు తీసుకోవాలని అదే చివరి అవకాశమంటూ ఘాటుగా హెచ్చరించింది. దేశంలోని పేదల పట్ల, వలస కార్మికుల సంక్షేమం పట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ స్థాయిలో స్పందించటం అభినందనీయం. తనకు తానుగా అన్నార్తులకు అండగా నిలవకపోగా, సుప్రీం చెప్పిన తరువాత కూడా ఇన్నేళ్లూ పట్టించుకోని మోడీ ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం.

> ఈ నయాఉదారవాద ఆర్థిక విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగుల నిజవేతనాలు భారీగా తగ్గిపోగా, నిత్యావసరాల ధరలు ఆకాశానికి ఎగసాయి. ఎగుమతి- దిగుమతి విధానంలోనూ కార్పొరేటు అనుకూల నమూనానే పాటించటం వల్ల వంటనూనె తదితర నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయి. నువ్వులు, వేరుశనగ కాయలు, ఆయిల్ పామ్ గెలల ధరలు దారుణంగా తగ్గిపోయాయి. ఇటు రైతులకు నష్టం, అటు వినియోగదారులకు కష్టం కలిగించే కేంద్రం అంబాదానీ విధానం దేశానికి ప్రమాదకరం.



"దేశంలో ఏ ఒక్కరూ పస్తులతో పడుకున్నా మన స్వాతంత్య్రానికి సంపూర్ణత లేదన్నట్టే!" అన్నారు మహాత్మాగాంధీ. ఆ మాట ప్రకారం చూస్తే.. ఆడంబరంగా అమృతోత్సవం జరుపుకొన్న 75 ఏండ్ల స్వరాజ్య పాలన తరువాత కూడా మనం ఇంకా సంపూర్ణత సాధించలేదు. దేశంలో రోజూ 19 కోట్ల మంది ప్రజలు ఖాళీ కడుపుతో పడుకుంటున్నారని జాతీయ ఆరోగ్య సర్వే నివేదించింది. అన్ని తరగతుల ప్రజలూ నిత్యావసరాల కోసం నానా ఇక్కట్లూ పడుతున్న పరిస్థితి రోజురోజుకీ పెరుగుతోంది. రెక్కాడితేనే కాని డొక్కాడని కోట్లాదిమంది శ్రామికుల జీవనం మరింత దుర్భరంగా మారింది. 2020 నాటి కోవిడ్ కాలం ఈ దుర్భర దృశ్యాన్ని దేశానికి కళ్లకు కట్టినట్టు చూపించింది. రోజువారీ పని ఒక్కసారిగా ఆగిపోతే- వలస కార్మికులు ఆ మరుసటి రోజుకే కడుపు నింపుకోవడం కనాకష్టమైన దుస్థితిని దృశ్యమానం చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని, దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదని, తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేసి, బియ్యం వగైరా దినుసులు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇది జరిగి మూడేళ్లు పూర్తయినా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం. పైగా తమ పాలనలో దేశం బ్రహ్మాండంగా వెలిగిపోతున్నట్టు, ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగ మించి, అందరూ ధనికులైపోతున్నట్టు గొప్పలు వల్లించింది.

అంతర్జాతీయ ఆకలి సూచిలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందని; పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా పరిస్థితి అధమంగా ఉందని నివేదికలు వెల్లడిస్తే, అవన్నీ తప్పుడు లెక్కలని అధికార బీజేపీ నాయకులు ఖండించటానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల దైనందిన సమస్యలను గాలికొదిలేసి, ఉద్వేగ ఉద్రేక రాజకీయాలతో దేశాన్ని ఊగించటానికి ప్రధాని మోడీ సహా కాషాయ నేతలు తెగించారు. వాస్తవాలతో సంబంధం లేని ఉద్వేగాలూ, ఉన్మాదాలూ ఏ సమస్యనూ పరిష్కరించలేవు. పైగా పరిస్థితిని జటిలం చేస్తాయి. మోడీ హయాంలో జరిగిందిదే! ప్రపంచంలో 82 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే ..అందులో 20 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నారు. రోజూ పస్తులతో పడుకుంటున్న అన్నార్తుల్లో 24 శాతం మంది మనవాళ్లే! ఆకలి, పోషకాహార లేమి కారణంగా రోజూ 4500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి గట్టెక్కించటానికి యుపిఎ- 1 ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటివి ఎంతోకొంత దోహదపడ్డాయి. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిధులు తగ్గించి ఈ చట్టాలను నిర్వీర్యం చేశారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లను అత్యంత సంపన్నులుగా మార్చే పథకాలూ విధానాలు చేపట్టి, సాధారణ ప్రజల అభివృద్ధిని గాలికొదిలేశారు.

ఈ నయాఉదారవాద ఆర్థిక విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగుల నిజవేతనాలు భారీగా తగ్గిపోగా, నిత్యావసరాల ధరలు ఆకాశానికి ఎగసాయి. ఎగుమతి- దిగుమతి విధానంలోనూ కార్పొరేటు అనుకూల నమూనానే పాటించటం వల్ల వంటనూనె తదితర నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయి. నువ్వులు, వేరుశనగ కాయలు, ఆయిల్ పామ్ గెలల ధరలు దారుణంగా తగ్గిపోయాయి. ఇటు రైతులకు నష్టం, అటు వినియోగదారులకు కష్టం కలిగించే కేంద్రం అంబాదానీ విధానం దేశానికి ప్రమాదకరం. సుప్రీంకోర్టు చీవాట్లు తరువాతనైనా కేంద్ర ప్రభుత్వం తన విధివిధానాలను, ప్రాధాన్యాలను ప్రజానుకూలంగా మార్చుకోవాలి. తక్షణమే వలస కార్మికులకు, పేద ప్రజలకు రేషన్ కార్డులు అందించి, కేరళ తరహాలో పూర్తిస్థాయి నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా అందజేయాలి.

విస్తరిస్తున్న లైంగికదాడుల సమర్థనా సంస్కృతి



బృందాకారత్

> భారతదేశంలో నేరస్తుని, బాధితురాలి కుల,మతాల గుర్తింపుకు అనుసంధానం చేయబడిన అదనపు లైంగికదాడి సంస్కృతుల కోణాలున్నాయి. ఇప్పటికే భారతీయ సమాజంలో ఉనికిలో ఉన్న కఠినమైన కుల శ్రేణీగత వ్యవస్థకు కట్టుబడి, మహిళలకు వ్యతిరేకంగా ఉన్న మనువాద భావజాలాలు, సంస్కృతులు అలాంటి అత్యాచార సంస్కృతులకు మరింత ఊతమిస్తున్నాయి. ముస్లిం మహిళల్ని లక్ష్యంగా చేసుకున్న మతోన్మాద అధికసంఖ్యాక ఆధిపత్య వాదం (కమ్యూనల్ మెజారిటేరియ నిజం), అన్నివర్గాల మహిళలలు ముఖ్యంగా దళిత మహిళలపై ప్రభావం చూపే మనువాద అధిక సంఖ్యాక ఆధిపత్య వాదాలను మహిళల పై హింసను సమర్థించే, బీజేపీ పాలనలోని భావజాలాలను ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల అండతో బీజేపీ-ఆరెస్సెస్ ల ఆవరణ వ్యవస్థ (ఎకో సిస్టం) ప్రోత్సహిస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, హింసకు పాల్పడిన నేరస్థుల్ని, వారి కుల, మతాల గుర్తింపు ఆధారంగా రక్షించేందుకు ప్రభుత్వ అధికారాన్ని వినియోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

కోల్‌కతాలోని ఆర్.జీ.కార్ ఆసుపత్రిలో హత్యాచార బాధితురాలికి న్యాయం జరగాలనే సంఘీభావ ఉద్యమాలు కేవలం బెంగాల్‌కు మాత్రమేకాక దేశాన్నే కదిలించాయి. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్ల సంఘం, డాక్టర్ల ఉమ్మడి వేదికలు అగ్రభాగాన నిలిచాయి. వామపక్ష ప్రజా సంఘాలు, నిరంతరం శాంతియుతంగా న్యాయం కోసం దృఢమైన నిబద్ధతను ప్రదర్శిస్తున్నాయి. వామపక్షానికి ఉన్న బలమైన మద్దతు వల్ల నిరసన స్వరాలు పట్టణాల నుండి బెంగాల్ వ్యాప్తంగా మారు మూల ప్రాంతాలకు, గ్రామాలకు విస్తరించాయి. వాస్తవానికి నిరసనల బలం, స్వరాలు రోజురోజుకూ మరింత శక్తివంతంగా ప్రతిధ్వనిస్తున్నాయి. ఏదో వ్యక్తిని అరెస్ట్ చేయడంతోనే న్యాయం అంతం కాదని నిరసనలు స్పష్టం చేస్తున్నాయి. భయంకరమైన నేరం, అవినీతి, ప్రోత్సాహం, కప్పిపుచ్చడం, దీనిలో ప్రమేయం ఉన్న వారందరి వెనుక ఉన్న బంధాన్ని లక్ష్యం చేసుకొని, వాటిని నిర్మూలించాలనేది దీని అర్థం. పౌర సమాజపు వాలంటీర్‌గా పిలువబడే ఒక వ్యక్తి, ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న యువ వైద్యురాలిపై మానభంగానికి పాల్పడి, ఆ నేరం నుండి తప్పించు కోగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు. వాస్తవమేమంటే, ఈ సందర్భంలో పోరాటం లేకుంటే అతడు కచ్చితంగా తప్పించుకొని ఉండేవాడు. ఈ ఉద్యమం, న్యాయాన్ని నిర్మూలించే ప్రతీఘాత శక్తుల్ని, ఐక్యంగా ఉన్న వందల, వేల సంఖ్యలో ఉన్న ప్రజలు సవాల్ చేసి, ప్రతిఘటించి, ఓడించగలరనే విశ్వాసాన్నిచ్చింది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణలు, కోర్టుకు సమర్పించబడిన సీబీఐ నివేదికలు, 'మనకు తెలిసిన వివరాల కంటే కూడా, చాలా దారుణమైన వివరాల్ని సూచిస్తున్నాయని' సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. డాక్టర్లు, నిరసనలను చాలా ప్రమాదకరమైనవిగా చిత్రించిన టీఎంసీ ప్రభుత్వం వెనక్కి తగ్గి, కొన్ని డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చింది. పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతోంది.


లైంగికదాడి సంస్కృతితో నిర్మాణ అసమానతల అనుసంధానం

నేను ఈవ్యాసంలో, పాలక పార్టీ టీఎంసీ, దాని ప్రతినిధులు, సమర్థించడానికి వీలులేని వాటిని కాపాడే వివిధ దశల్లో ప్రవేశ పెట్టిన లైంగికదాడుల సంస్కృతులకు సంబంధించిన ఆర్.జీ.కార్ కోణాన్ని చూస్తున్నాను. న్యాయం కోసం పోరాడే మహిళా సంఘాలు, ఉద్యమాలు, ఈ సంస్కృతి, భారతదేశంలో మహిళల ద్వితీయ హోదా సంబంధమున్న నిర్మాణ చట్రంతో అనుసంధానమై ఉన్నాయని తెలుపుతున్నాయి. వాస్తవానికి, భారతదేశంలో లైంగికదాడులు, లింగ, కుల ఆధారిత అనాగరిక కృత్యాల మూలాలు, పుట్టుక నుండి మరణం వరకు స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతల్లోనే ఉన్నాయి. అసమానతలున్న దేశంలో గ్రామీణ ఉన్నత వర్గాలు, కాంట్రాక్టర్ల ఆధిపత్యంలో సురక్షితంకాని పని పరిస్థితుల్లో శ్రామిక మహిళలు ముఖ్యంగా గ్రామీణ పేద మహిళల నిస్సహాయత నిర్మాణాత్మకమైనది. భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం చేర్చుకున్న విషపూరిత కుల వ్యవస్థ, ఈ నిర్మాణంలో భాగంగా ఉంది. ఇది దళిత, ఆదివాసీ మహిళలకు వ్యతిరేకంగా హింస తీవ్రతకు దారి తీస్తుంది. భారతదేశంలో ఇలాంటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో అత్యాచార సంస్కృతుల్ని ప్రోత్సాహిస్తున్నారు.

మహిళా సంఘాల ఐక్య పోరాటాలు, వ్యక్తిగత మహిళలు సాధించిన విజయాలు కలిసి అనేక అడ్డంకుల్ని బద్దలు కొట్టిన ఒక బలమైన కూటమికి రూపకల్పన చేశాయి. అయితే ఈ విజయాల్ని వివిధ మార్గాల్లో ప్రతీఘాత శక్తులు బలహీనపరిచే ప్రయ త్నాలు చేస్తున్నాయి. మహిళల అభివృద్ధికి, వారు బహిరంగంగా చేసే సమాన హక్కుల వక్కాణింపుకు వ్యతిరేకంగా ఎదురుదెబ్బ తీసే దానిలో భాగంగానే లైంగికదాడులను సమర్థించే సంస్కృతి ప్రతిబింబిస్తున్నది..

లైంగికదాడులను సమర్థించే సంస్కృతి

లైంగికహింసను సమర్థించే, లేక అల్పమైన విషయంగా భావించే లేదా తిరస్కరించడాన్ని అత్యాచారాన్ని సమర్థించే సంస్కృతులు అంటాం. మానభంగానికి గురైన బాధితురాలికి న్యాయం జరగకుండా ఉండే వాతావరణాన్ని లైంగికదాడుల సంస్కృతులు సృష్టిస్తాయి. మీడియాను వినియోగించడంతో పాటు అనేక సాధనాల ద్వారా అత్యాచార సంస్కృతులు న్యాయ ప్రక్రియలకు విఘాతం కలిగిస్తాయి. లైంగిక హింసకు పాల్పడిన నేరస్థుడ్ని నిందించడానికి బదులుగా ఈ సంస్కృతులు లైంగిక హింసను ఎదుర్కొంటున్న మహిళను బాధ్యురాలిని చేస్తూ నిందిస్తాయి. భారతదేశంలో నేరస్తుని, బాధితురాలి కుల,మతాల గుర్తింపుకు అనుసంధానం చేయబడిన అదనపు లైంగికదాడి సంస్కృతుల కోణాలున్నాయి. ఇప్పటికే భారతీయ సమాజంలో ఉనికిలో ఉన్న కఠినమైన కుల శ్రేణీగత వ్యవస్థకు కట్టుబడి, మహిళలకు వ్యతిరేకంగా ఉన్న మనువాద భావజాలాలు, సంస్కృతులు అలాంటి అత్యాచార సంస్కృతులకు మరింత ఊతమిస్తున్నాయి. ముస్లిం మహిళల్ని లక్ష్యంగా చేసుకున్న మతోన్మాద అధికసంఖ్యాక ఆధిపత్య వాదం (కమ్యూనల్ మెజారిటేరియ నిజం), అన్నివర్గాల మహిళలలు ముఖ్యంగా దళిత మహిళలపై ప్రభావం చూపే మనువాద అధిక సంఖ్యాక ఆధిపత్య వాదాలను మహిళల పై హింసను సమర్థించే, బీజేపీ పాలనలోని భావజాలాలను ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల అండతో బీజేపీ-ఆరెస్సెస్ ల ఆవరణ వ్యవస్థ (ఎకో సిస్టం) ప్రోత్సహిస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, హింసకు పాల్పడిన నేరస్థుల్ని, వారి కుల, మతాల గుర్తింపు ఆధారంగా రక్షించేందుకు ప్రభుత్వ అధికారాన్ని వినియోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇది న్యాయ నిబంధన కాదు, న్యాయ చట్రం కూడా కాదు కానీ, ఎవరు శిక్షను అనుభవించాలి, ఎవరు స్వేచ్ఛగా తిరగాలి అనేది నిర్ణయించేది నేరస్థుని, లేక బాధితురాలి కుల, మతాల గుర్తింపు మాత్రమే. ఇలాంటి కేసుల్లో కులం, జాతికి నేరాలను అనుసంధానం చేసే అవకాశాన్ని లైంగికదాడి సంస్కృతులు కల్పిస్తాయి.



ఆర్.జీ.కార్ కేసులో నిర్మాణాత్మక సమస్యలు

బెంగాల్‌లో ఈ దారుణ కృత్యం తృణమూల్ కాంగ్రెస్ పాలనలో జరిగింది. ప్రభుత్వం, పౌర వాలంటీర్లుగా పిలువబడే వారి నియామక విధానం, ప్రిన్సిపాల్‌ను రక్షించడంలో ప్రభుత్వ, ఆరోగ్య శాఖామంత్రి పాత్ర, ఈ కేసు లేకుండా చేసే ప్రయత్నంలో ప్రిన్సిపాల్, పోలీసుల పాత్ర, పాలనా వ్యవహారంలో యథేచ్ఛగా అవినీతి, భయంకర నేరం మరియు అవినీతిలో భాగస్వాములైన వారి మధ్య సంబంధాలు, ఆసుపత్రి సెమినార్ గదితో పాటు అన్ని గదుల్లోకి పౌర వాలంటీర్ ప్రవేశానికి అవకాశం కల్పించిన బంధానికి సంబంధించిన ప్రశ్నలు, ఆసుపత్రిలో వైద్యాధికారులు, శ్రామిక మహిళల రక్షణలో లోపం లాంటివి ప్రధానమైన అంశాలుగా ఉన్నాయి. అయితే ఒక వ్యక్తి చేసిన నేరానికి మించిన సమస్యలు ఇవి. ఈ కేసు, ప్రభుత్వం, పోలీస్, ప్రభుత్వ విధానాలతో ముడిపడి ఉంది కాబట్టి ఇది నిర్మాణాత్మక సమస్యే.

లైంగికదాడి సంస్కృతుల విస్తరణ

తప్పుడు వార్తల్ని తిప్పికొట్టే పేరుతో ఒక మహిళా ఎంపీ, బాధితురాలి పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లోని వివరాలు చెప్పడం సిగ్గుచేటు. ప్రైవేట్ పార్ట్స్ బరువు, కనుగొనబడిన లేక కనుగొనబడని వీర్యం వివరాలను చర్చించడానికి, అది గ్యాంగ్ రేప్ అనే అభియోగాలను కొట్టిపారేసే బాధ్యత ఆమె తీసుకుంది. బాధితురాలి తుంటి ఎముక విరిగిందా లేదా? అనే చర్చను మొదలుపెట్టి, పోస్ట్‌మార్టంలో అది అబద్ధంగా తేలిందని ప్రకటించింది. భయంకర లైంగికదాడి నేర స్వభావం నుండి దృష్టిని మరల్చడం కోసం బాధితురాలిపై, ఆమె శరీరంపై ఒక బహిరంగ చర్చను ప్రారంభించడానికి ఇలాంటి వివరాలు మాట్లాడుతున్నారు. అంటే దీనర్థం ఏమిటంటే, లైంగికదాడితో పాటు ఇంకా ఎముకలు విరిగినట్టు రుజువు కాకుంటే, లైంగికదాడి 'సాధారణంగానే' జరిగినట్టని, లైంగికదాడిని సాధారణీకరణ చేస్తారు. మరో మహిళా ఎంపీ టీవీలో మాట్లాడుతూ, 'గత పాలనలో పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం మహిళా విద్యార్థులను ఎగ్జామినర్ల ఒళ్ళో కూర్చోబెట్టేవారని' చెప్పింది. ఇలాంటి వ్యాఖ్యలు కూడా లైంగికదాడి సంస్కృతులను పెంచుతాయి. ఇప్పుడు జరుగుతున్న అకృత్యాలకు సమాధానంగా గత ప్రభుత్వాలు కూడా ఇలాంటివి ఎన్నో చేశాయి అని చెపుతారు.

'మమతా బెనర్జీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అనుచితంగా వ్యాఖ్యలు చేసే వారి కుటుంబాలకు చెందిన వారి తల్లులు, అక్కాచెల్లెళ్ళ చిత్రాల్ని వక్రీకరించి వారి తలుపులపై ఉంచుతానని' ఒక టీఎంసీ కౌన్సిలర్ అన్నాడు. ఇది కూడా మహిళలకు వ్యతిరేకంగా జరిగే హింసను సమర్థించే లైంగికదాడి సంస్కృతులకు ఉదాహరణ. ఒక మహిళపై లైంగికదాడి జరిగితే, నీ నాయకులను సమర్థించాల్సి వచ్చినప్పుడు, ఆ నేరం అల్పమైనది గానే మారిపోతుంది. ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన వారిపై కేసులు నమోదు చేయడంలో బెంగాల్ ప్రభుత్వం రికార్డులు సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. కానీ కౌన్సిలర్ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు లైంగికదాడి సంస్కృతి యొక్క మరో కోణాన్ని తెలియజేస్తున్నాయి.

లైంగికదాడి కేసుల 'రాజకీయీకరణ'

మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాల్ని ఎదుర్కోవడంలో విఫలమయ్యారని, ఒకరినొకరు ఆరోపణలు చేసుకునేందుకు రాజకీయ పార్టీలు 'లైంగికదాడి'ని ఒక సమస్యగా ఉపయోగించుకుంటున్నాయి. దీనిని లైంగికదాడి 'రాజకీయీకరణ' అని తరచుగా విమర్శిస్తున్నారు. ప్రభుత్వాలు చాలా కఠినంగా వ్యవహరించాలి, లేక నేరారోపణలు చెయ్యాలి లేదా లైంగికదాడి కేసుల్లో నిందితుల్ని రక్షించడం వంటి చర్యలకు బాధ్యతవహించాలి. అత్యాచారం పితృస్వామ్య కులవ్యవస్థ ఉన్న సమాజంలో అధికార వినియోగం, పురుషుల హక్కు సంస్కృతికి సంబంధించిన రాజకీయ అంశంగా మారింది. మహిళలపై హింస, పెరుగుతున్న లైంగిక నేరాలు 'రాజకీయ సమస్యలు'. యథాతథ రాజకీయాలు ఈ సమస్యల్ని రాజకీయ భాషలో 'మృదువైన సమస్యలు'గా ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. వరకట్న హత్యలు, గృహహింస, పిల్లల పై లైంగిక వేధింపులు, లైంగిక దాడులు ఇవన్నీ 'రాజకీయ రహిత, మృదువైన సమస్యలు' అని మహిళల విభాగంలో పడేశారు. మహిళా పోరాటాలు, నేరాల నుండి బతికి బయటపడిన వారి ధైర్యం ఆ విభాగం గేటు బద్దలు కొట్టాయి.

న్యాయం కోసం జరుగుతున్న మన పోరాటాలు, అవసరమైన 'రాజకీయీకరణకు', 'సంకుచిత పార్టీ రాజకీయాలకు' మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. తేడాను గుర్తించడం ఎందుకు అవసరమో చెప్పడానికి బెంగాలే ఒక మంచి ఉదాహరణ. డాక్టర్లు స్వయంగా నాయకత్వం వహించిన భారీ నిరసన ఉద్యమాలను బలహీనపర్చి, తక్కువ చేయడానికి బెంగాల్లో టీఎంసీ, బీజేపీలు ప్రయత్నించాయి. ఛాత్ర సమాజ్ వేదికను ఉపయోగించడం ద్వారా బీజేపీ ఈ సమస్యను అదుపుచేసే ప్రయత్నం చేసింది. ఈ ఛాత్ర సమాజ్ వేదిక, టీఎంసీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక హింసాత్మక ప్రదర్శనను నిర్వహించింది. చర్యల్లోకి పోయే విధంగా పోలీసుల్ని రెచ్చగొట్టడంతో, ఉద్యమ అదుపు చర్యలు బీజేపీ, టీఎంసీల మధ్య జరిగే సంకుచిత రాజకీయ పోరాటంగా మారింది. బాధితులమని చెప్పుకున్న బీజేపీ, దృష్టిని లైంగికదాడి బాధితురాలిపై పెట్టడానికి బదులుగా దృష్టిని తనపై పెట్టే విధంగా ప్రయత్నం చేస్తూ, బంద్‌కు పిలుపునిచ్చింది. దీనికి భిన్నంగా లెఫ్ట్ ఫ్రంట్ భారీగా సమీకరణలు నిర్వహించి, నిరసనలకు అవసరమైన బలాన్ని చేకూర్చాయి. ఇలా చేయడం ద్వారా లెఫ్ట్ ఫ్రంట్ 'మహిళల ఏకైక రాజకీయేతర' విభాగాన్ని బద్దలు కొట్టడానికి సహాయపడింది. ఈ సందర్భంలో ఉద్యమ నాయకులు అంటే డాక్టర్ల నిర్ణయాలను గౌరవిస్తూ, ఒక బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీ ఉద్యమ డిమాండ్లను ఎలా సమర్థించిందో చూపించింది.

బెంగాల్‌లో, లెఫ్ట్ ఫ్రంట్ స్వతంత్ర సమీకరణల్ని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమీకరణల్ని అప్రతిష్టపాలు చెయ్యడానికి టీఎంసీ తన శాయశక్తులా కృషి చేసింది. అది సంఘీభావాన్ని కూడా అపరాధీకరణ చేసేందుకు ప్రయత్నించింది. సంఘీభావాన్ని అపరాధీకరణ చేయడం, సంఘీభావాలకు 'రాజకీయ' ఉద్దేశ్యాలను ఆపాదించడం కూడా న్యాయాన్ని కోరుకునే స్వరాలు వినపడకుండా చేయడంలో పాత్రను పోషిస్తాయి. ఇది బాధితురాలికి, ఆమె కుటుంబానికి సామాజిక మద్దతు లేకుండా ఒంటరిని చేస్తుంది, నేరస్తుడు మాత్రం లబ్ధి పొందుతాడు. ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చెయ్యడానికి టీఎంసీ ఉపయోగిస్తున్న సంఘీభావ అపరాధీకరణను మనం తిరస్కరించాలి.

కొత్త చట్టం నాటకం

లైంగిక నేరాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పోలీస్, సమాజంపై ఉంది. ఢిల్లీలో నిర్భయ కేసు తర్వాత ఏర్పాటైన వర్మ కమిషన్ చట్టంలో మార్పులతో పాటు వరుసగా కొన్ని సిఫార్సులు చేసింది. వాటిలో కొన్ని అమలులోకి వచ్చాయి. దీనిపై మనకు స్పష్టత ఉండాలి. చట్టంలో లోపం, లేక బలహీనత కారణంగా ఆర్.జీ.కార్ నేరం జరగలేదు. చట్టపరమైన బలహీనతలు, ఆర్.జీ.కార్ ఆసుపత్రిలో, బెంగాల్‌లోని ఇతర సంస్థల్లో ఇలాంటి నేరాలు జరగడానికి అవకాశం ఇచ్చే నిర్మాణాల కారణంగా ఆ నేరం జరగలేదు. అయినా బెంగాల్ ముఖ్యమంత్రి ఒక చట్టాన్ని తెస్తూ ఒక నాటకం ఆడింది. ఇది దృష్టిని మళ్లించేందుకు ఒక ప్రామాణికమైన మార్గం. ప్రతిపాదిత చట్టం లోపభూయిష్ట మైనది. వాస్తవానికి ఇది, వర్మ కమిషన్ సిఫార్సులను ఉల్లంఘిస్తుంది. ఇలాంటి చర్యలు లైంగికదాడికి, హత్యకు గురైన బాధితురాలికి న్యాయం జరగడానికి ఏ రకంగానూ సహాయపడవు. ప్రభుత్వం, పాలనా యంత్రాంగం తమ జవాబుదారీతనాన్ని అంగీకరించేలా ఒత్తిడి తేవాలి.

("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451


హర్యానా హెచ్చరిక, కాశ్మీర దీపకళిక

రెండు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలతో దేశంలో రాజకీయ చర్చను కొత్త మలుపు తిప్పినట్టు కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో హ్యాట్రిక్ హంగామా చేసి దెబ్బతిన్న బీజేపీ హర్యానాలో మాత్రం దాన్ని సాధించగలిగింది. ఎగ్జిట్ పోల్స్, సర్వేల ఫలితాలు, కాంగ్రెస్ అంచనాలు ఆశలు దారుణంగా విఫలమయ్యాయి. మీరు సక్రమంగా పనిచేసి వుంటే విజయం దక్కేదని మీ స్వప్రయోజనాలే పరమార్థంగా మన పార్టీని దెబ్బతీశారని రాహుల్‌గాంధీ ఆగ్రహించారంటే వారి పరిస్థితి అర్థమవుతుంది. జమ్మూ కాశ్మీర్ 370 అధికరణం రద్దు ద్వారా దేశమంతా విజయం సాధించాలనుకున్న బీజేపీ అక్కడే అనుకున్న లక్ష్యం సాధించలేకపోగా నేషనల్ కాన్ఫరెన్స్ చాలా కాలం తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తున్నది. ఒమర్ అబ్దుల్లా మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని ఆ పార్టీ సీనియర్ నేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. బీజేపీ జమ్మూలో పూర్తి ఫలితాలు సాధించిందనే ప్రచారం కూడా జోరుగానే నడుస్తున్నది. ఇంకోవైపు బీజేపీ ఎన్నికల విజయాలు సాధించే యంత్రంగా పనిచేస్తుందనీ దాని వ్యూహాలు అమోఘమనీ మీడియా మోడియాలో భజన కీర్తనలు వినిపిస్తున్నాయి. కేంద్ర ఎన్‌డీఏ కూటమి పాలనలోనే వున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్యానా గెలుపును కీర్తించడంతో పాటు జమిలి ఎన్నికలు కూడా మంచిదని ప్రకటించారు. తిరుపతి లడ్డూ వివాదం హర్యానా మహారాష్ట్ర ఎన్నికల కోణంలో ముందుకు తెచ్చారనే విమర్శ తన సంపాదకీయంలో ప్రస్తావించిన హిందూపత్రిక ఇప్పుడు దాన్ని మతతత్వ రాజకీయాలవైపు మరల్చవద్దని మరోసారి హితవు పలికింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వంటివారు బీజేపీని మించి సనాతన ధర్మం, హిందూత్వ వాదనలతో చెలరేగిపోవడానికి కారణాలేమిటని జాతీయ మీడియాలో ఎడతెగని చర్చ సాగుతున్నది. విజయదశమి ముంగిట్లో దేశ రాజకీయ ముఖచిత్రం ఇది. దేశానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలకు కాంగ్రెస్ సహకరిస్తున్నదని హర్యానా విజయోత్సవ సభలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్య బీజేపీ తదుపరి ప్రచారాలు ఎలా వుంటాయో చెబుతున్నది. దీంతోపాటు వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలపైన బీజేపీ హర్యానా ఫలితాల ప్రభావం వెనువెంటనే జరిగే మహారాష్ట్ర ఎన్నికలపై ఎలా పడుతుందనే రకరకాల అంచనాలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఇండియా కూటమి కీలకపార్టీ అయిన ఉద్ధవ్ ఠాక్రే శివసేన ఎంపీ సంజయ్ రౌత్ కాంగ్రెస్ అహంభావం గురించి అందరికన్నా తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం యాదృచ్ఛికం కాదు.



తెలకపల్లి రవి

హర్యానాలో కాంగ్రెస్ ఓటమి ప్రధానంగా స్వయంకృతాపరాధమన్నది రాహుల్‌గాంధీ మాటల్లోనే స్పష్టమవుతున్న విషయం. మిగిలిన నేతలను పక్కన పెట్టి కేవలం భూపేందర్ హుడా నే ఏకైక అధిపతిగా పోటీ పడాలనుకోవడం ఆ పార్టీ మొదటి తప్పిదం, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కర్ణాటకలో డి.కె. శివకుమార్ వంటి గట్టి నేతలపై ఆధారపడటం వల్లనే గెలిచామని కాంగ్రెస్ అధిష్టానం వ్యూహకర్తలు భావించడం ఇందుకు కారణమని చెబుతున్నారు. అధిష్టానం చుట్టూ తిరుగుతూ అంతర్గత కలహాలలో మునిగితేలడం అనే జాడ్యం ఆ పార్టీని ఇంకా వదిలిపెట్టలేదు. బీజేపీ మతతత్వ వ్యూహాలనూ కులాలవారీ ఎత్తుగడలను గట్టిగా ఢీకొనడంలోనూ కాంగ్రెస్ పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇందుకు తగినట్టే ప్రాంతీయ పార్టీలూ చీలిక వర్గాలు తమ మనుగడ కోసం కాంగ్రెస్ బీజేపీల మధ్య దాగుడుమూతలాడే లక్షణాన్ని కొనసాగిస్తున్నాయి. ఇవన్నీ హర్యానా ఫలితాలపై ప్రభావం చూపించాయి. మతాన్ని రెచ్చగొట్టడంతో పాటు సామదానభేద దండోపాయాలతో అధికారంలోకి రావాలనే బీజేపీ వ్యూహాలను సమర్థంగా ఎదుర్కొవడానికి ఇవే అవరోధాలుగా మారుతున్నాయి. జాట్ ఆధిపత్య వర్గాలకు ప్రతిబింబమైన హుడానే నమ్ముకోవడంతో ఇతర తరగతులు దూరమైనారని ఇప్పుడు ప్రతివారూ గుర్తిస్తున్నారు. అంతేగాక ఆయననే ఏక బిందువుగా చేసుకోవడంతో మిగిలిన కీలక నేతలు వర్గాలు దూరమైనాయి. లోక్‌సభ ఎన్నికల నాటికీ శాసనసభ ఎన్నికలకూ మధ్య కాంగ్రెస్ ఓట్లలో వచ్చిన తేడా ఆశ్చర్యం కలిగించేంత వుందంటే ఇవన్నీ కారణాలే.



హర్యానా ఫలితాల విశేషాలు

హర్యానా ఎన్నికల ఫలితాలపై అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి గానీ లోక్‌సభ ఎన్నికల నాటికీ ఇప్పటికి ఇంతలోనే వచ్చిన తేడా నిజంగా దిగ్భ్రాంతి కలిగిస్తుంది. కనీసం 36 అసెంబ్లీ విభాగాల్లో దాని ఓట్లు అప్పటికంటే ఒకోచోట పదివేలకు పైగా పడిపోయాయి. 18 స్థానాల్లోనైతే ఏకంగా 20 వేల చొప్పున తగ్గాయి. 28 నియోజకవర్గాల్లో అయిదో వంతు ఓట్లు తగ్గిపోయాయి. మరీ ముఖ్యంగా హుడా కుటుంబ నియోజకవర్గమైన రోహ్‌తక్ లోక్‌సభ స్థానంలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లలో అప్పుడు 7.83 లక్షల ఓట్లు వస్తే ఇప్పుడు కేవలం 5.93 లక్షలు వచ్చాయి, అంటే దాదాపు రెండు లక్షల ఓట్లు తగ్గిపోయాయి, నిజానికి హర్యానా వరకూ లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే శాసనసభలో కాంగ్రెస్ పుంజుకోవడమే గత రెండుసార్లు జరిగింది. ఇప్పుడు అది తారుమారైంది. పార్టీలో ముఠా తగవులవల్ల, టికెట్టు రాని వారు పోటీ అభ్యర్థులుగా వుండటం లేదా ఓట్లు మరోవైపు మరలించడం వల్ల ఇలా జరిగిందని భావించక తప్పదు. ఉదాహరణకు ఉచనాకలం అనే చోట ఆ పార్టీ అభ్యర్థి 32 వేల ఓట్లతో ఓడిపోగా రెబల్‌కు 38 వేల ఓట్లు వచ్చాయి. కల్కాలో బిజెపి 28 వేల ఓట్లతో గెలవగా కాంగ్రెస్ రెబల్‌కు 31వేల ఓట్లువచ్చాయి. బద్రాలో కాంగ్రెస్ 7వేల ఓట్లతేడాతో ఓడిపోగా రెబల్‌కు 27వేల ఓట్లు వచ్చాయి. అంటే తిరుగుబాటు అభ్యర్థికి పార్టీలోని ఇతర వర్గాలు కూడా సహకరించాయనేది స్పష్టం. అసలు అభ్యర్థుల కంటే రెబల్ అభ్యర్థులకే చాలా ఎక్కువ ఓట్లు వచ్చిన సీట్లు కూడా వున్నాయి. బీజేపీ ఓటింగు పెద్దగా పెరగలేదు. గానీ సీట్లు విపరీతంగా పెరిగాయి. కాంగ్రెస్ ఓటింగు వూహించలేనంతగా పడిపోయింది. 2014లో అత్యధికంగా వచ్చిన దాన్ని మించి బీజేపీకి 48 స్థానాలు రాగా కాంగ్రెస్‌కు 37 వచ్చాయి. ఐఎన్ఎల్‌డీకి రెండు, ముగ్గురు స్వతంత్రులు కూడా గెలిచారు. బీజేపీకి ఓట్లలో 39.9శాతం, సీట్లలో 53.3శాతం దక్కాయంటే ఐఎన్ఎల్‌డి బిఎస్‌పి హెచ్ఎల్‌పి కూటమితో లోపాయికారి అవగాహన కీలక పాత్ర వహించింది. సిర్సా స్థానంలో బీజేపీ నేరుగా తన అభ్యర్థిని ఉపసంహరించుకుని ఈ కూటమికి మద్దతు ప్రకటించింది. మిగిలిన చోట్ల అవగాహన ప్రకారం ఓట్ల బదలాయింపు జరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. సిర్సా లోక్‌సభ స్థానంలోనే తీసుకుంటే మూడు అసెంబ్లీ సీట్లలో బీజేపీ ఓట్లు దారుణంగా తగ్గిపోగా మరో మూడు చోట్ల గణనీయంగా పెరిగాయి. అంటే ఇక్కడ ఒక అవగాహన ప్రకారమే పరస్పరం గెలిపించుకున్నారనే సందేహాలు సహజం. 18 వేల ఓట్లు తగ్గిన కాంగ్రెస్ మూడు అసెంబ్లీలు కోల్పోగా వాటిలో రెండు ఐఎన్ఎల్‌డీకి, ఒకటి బీజేపీకి వచ్చాయి. మరికొన్ని చోట్ల ఈ కూటమికి వచ్చిన ఓట్లు బీజేపీ ఆధిక్యత కంటే ఎక్కువగా వున్నాయి. కనుక కావాలనే పోటీ పెట్టించారనే ఆరోపణలున్నాయి. ఇవన్నీ ఎన్నికలలో అసాధారణమేమీ కాదు గాని కాంగ్రెస్ అనైక్యత, ఆప్ వంటి పార్టీలను దూరం చేసుకోవడం ఘోరంగా దెబ్బతినడానికి కారణమైనాయి. ఐఎన్ఎల్‌డీ జాట్లు దళితుల ఓట్లకోసం కాంగ్రెస్‌తో పోటీ పడిందని గుర్తు పెట్టుకోవాలి. కుమారి సెల్జాను పూర్తిగా దూరం పెట్టి కేవలం హుడాల వైపే మొగ్గిన కారణంగా దళితులు కాంగ్రెస్‌కు సామూహికంగా దూరమైనారనేది ఒక అంచనా. ఇంత క్లిష్ట పరిస్థితిలోనూ మైనార్టీ వర్గాలు మాత్రం కాంగ్రెస్‌కే ఓటు వేశారు గానీ, బీజేపీ మతతత్వ దాడిని ఆ పార్టీ గట్టిగా ఎదుర్కోలేదనే అసంతృప్తి వారిలోనూ వచ్చింది. ఐక్యత కోసం ప్రయత్నించి విఫలమై 89 చోట్ల పోటీ చేసిన ఆప్ 1.8శాతం ఓట్లు తెచ్చుకుంది. కనీసం ఈ రెండు పార్టీలు కలిసివున్నా పరిస్థితి చాలా మారివుండేదని ఒక అంచనా, సమాజ్‌వాది పార్టీ కూడా ఈ విషయంలో తన అసంతృప్తిని వెలిబుచ్చింది.

ఈవీఎంలు, ఇతర పార్టీలు...

ఇక పదిస్థానాల్లో ఈవీఎంల అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. అసలు తాము ఈ ఫలితాలను ఆమోదించడం లేదని మొదట్లో జైరాం రమేష్ వంటివారు ప్రకటించారు. ఈసీకి ఫిర్యాదు కూడా చేశారు. అయితే ప్రజల తీర్పును ఆమోదించలేదని చెప్పడం అప్రజాస్వామికమని ఈసీ ఆ పార్టీ ఆరోపణలపై తీవ్రంగా విరుచుకుపడింది. ఏపిలో వైసీపీ కొన్నిచోట్ల ఆరోపించినట్టుగా ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్ ఎక్కువగా వుండటం బట్టి తప్పు జరిగిందని ఆరోపించడం సరికాదని సమర్థించుకుంది. మరింత లోతుగా అధ్యయనం చేశాకే ఈ అంశంపై ముందుకు పోవాలని ప్రస్తుతానికి కాంగ్రెస్ నిర్ణయించింది. ఏమైనా లౌకిక పార్టీలనూ ఇండియా భాగస్వాములను కలుపుకొని పోవడంలో వైఫల్యం, ఎన్నికల ఎత్తుగడలు నినాదాల లోపాల గురించి ఇంతవరకూ మాట్లాడింది లేదు. గతంలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన తప్పులే ఇక్కడా పునరావృతమైనాయని అన్ని వైపుల నుంచి వచ్చిన విమర్శను పరిశీలించుకున్నదీ లేదు. ఒక విధమైన ఆశాభంగం అసహనంలో, అనైక్యత మరింత పెరుగుతున్న స్థితిలో వుండిపోయింది. ఈ ఫలితం తర్వాత ఢిల్లీలో తాము వంటరిగానే పోటీచేస్తామని ఆప్ ప్రకటించింది. యూపీలో రానున్న ఉప ఎన్నికల్లోనూ ఎస్‌పీ కాంగ్రెస్‌ను దూరం పెడుతుందని మొదట కథనాలొచ్చినా అఖిలేశ్ యాదవ్ కలిసే పోరాడతామని స్పష్టం చేశారు. ఆ పార్టీ నాయకత్వం ఆత్మావలోకనం చేసుకోవాలని సీపీఐ(ఎం) కూడా సూచించింది. మహారాష్ట్రలోనూ ఇలాంటి విమర్శ ఇంతకు ముందే వుంది. హర్యానాలో బీజేపీ మంత్రులు ఎనిమిది మంది ఓడిపోయారంటే ప్రజల్లో వ్యతిరేకత తక్కువ లేదని తెలుస్తుంది. అయితే లోక్‌సభ పోటీలోనూ ఇరుపార్టీలకూ సరిసమానంగానే సీట్లు వచ్చాయని కూడా గుర్తు పెట్టుకోవాలి. అందువల్ల ఈ ఫలితాన్ని మరీ ఏకపక్షంగా చూపించి బీజేపీకి తిరుగులేదనో గొప్ప వ్యూహాలతో గెలిచిందనో టముకువేయడం అర్థరహితం. ఎటొచ్చి లౌకిక పార్టీలు కలసికట్టుగా గట్టిగా పోరాడవలసిన అవసరాన్ని హర్యానా ఫలితాలు హెచ్చరికగా నిలిచాయి.

కాశ్మీర్‌లో జరగాల్సిందేమిటి?

జమ్మూకాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, సీపీఐ(ఎం) కూటమి పూర్తి మెజార్టి సాధించాయి గానీ కాంగ్రెస్ సీట్లు తగ్గిపోయాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌కు 42, బీజేపీకి 29, కాంగ్రెస్‌కు 6, పీడీపీకి 3, సీపీఐ(ఎం)కు 1, ఆప్‌కు 1, జేపీసీకి 1, ఇండిపెండెంట్లకు ఏడు వచ్చాయి. బీజేపీతో జట్టుకట్టిన పీడీపీని ఓటర్లు తిరస్కరించి కాన్ఫరెన్సుకు పాలన అప్పగించారు. జమ్మూలో బీజేపీకి సీట్లు ఓట్లు కూడా బాగా వచ్చాయి. ఈ రెండు ప్రాంతాల ఆకాంక్షలను అవసరాలను అందుకోవడం ఇప్పుడు ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం ముందు సవాలుగా వుంటుంది. సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ తమ మొదటి కర్తవ్యమని ఒమర్ ప్రకటించారు. అదే సమయంలో వ్యక్తిగతంగా ప్రధాని మోడీ పట్ల సానుకూల ధోరణిలో మాట్లాడటం కాశ్మీర్ పరాధీనతకు ఒక నిదర్శనం, ఏమైనా బీజేపీ కాశ్మీర్‌లో ఓట్లను చీల్చడానికి అనేక వేర్పాటువాద పార్టీలను ఉపయోగించిందనే ఆరోపణలున్నాయి. పైగా లెఫ్టినెంట్ గవర్నర్‌కు ముందే విస్తారమైన అధికారాలు కట్టబెట్టడంతో పాటు అయిదుగురు ఎంఎల్ఎలను నామినేట్ చేసే పెత్తనం కూడా ఇచ్చారు. ఆ విధంగా కేంద్ర పెత్తనం బీజేపీ కుయుక్తులు కొనసాగుతూనే వుంటాయి. నలుగురు ఇండిపెండెంట్ల మద్దతు ప్రకటించడంతో కాన్ఫరెన్స్‌కు సర్కారు ఏర్పాటుచేసే ఆధిక్యత వచ్చింది. కాంగ్రెస్, సీపీఐ(ఎం), ఇండిపెండెంట్ సభ్యులను కలుపుకుంటే 53 సీట్లతో బలమైన మద్దతు వుంటుంది. ప్రజల తీర్పుకు అనుగుణంగా వేగంగా చర్యలు తీసుకోవడం అబ్దుల్లా కర్తవ్యం కాగా అందుకు పూర్తిగా సహకరించడం, తమ ఏకపక్ష నిరంకుశ పోకడలు మార్చుకోవడం కేంద్రంపై వున్న బాధ్యత.

నవతెలంగాణ 5
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శనివారం | అక్టోబర్ 12, 2024 | www.navatelangana.com



ఐద్వా రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

- 21న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి
- బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి

నవతెలంగాణ-ఖమ్మం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం సుందరయ్య భవన్లో రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా అక్టోబర్ 21న కొత్తగూడెంలో బహిరంగ సభ జరుగుతుందని, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో మహిళా సాధికారిత, మహిళా హక్కుల రక్షణకు, పోరాటాల రూప కల్పనకు ఈ సభలు జరుపుతున్నట్లు వారు తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటికీ భారతదేశంలో మహిళలకు రక్షణ లేదని, పసి వయసు నుంచి పండు ముసలి వరకు రోజూ ఏదో ఒక ప్రాంతంలో అత్యాచారాలు, హత్య, హింస, జరుగుతూనే ఉన్నాయని, వీటికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్, పబ్బులు, అశ్లీల సాహిత్యాలను ప్రోత్సహించడమే కారణమన్నారు. మహిళా సాధికారితకు చట్టసభల్లో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 33 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని, అనేక సంవత్సరాలుగా ఐద్వా పోరాటాలు నిర్వహిస్తున్నా పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. మహిళల రక్షణకు, ఉపాధికి, వైద్యానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, జిల్లా నాయకురాళ్ళు ఎస్.కే.మెహరున్నీసా బేగం, సుమతి, కత్తుల అమరావతి, గుడిమెట్ల రజిత, భాగం అజిత, బీబీ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ మట్టా దయానంద్

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని వెంకన్నపేట గ్రామంలో శ్రీ సీతారామ ఆలయంలో శుక్రవారం శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాప సుధాకర్, కల్లూరు మండల వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ భాగం నీరజా చౌదరి, రాయల రాము, తదితరులు పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- షేక్ పెంటు సాహెబ్‌పై కేసు నమోదు : ఎస్ఐ

నవతెలంగాణ-బోనకల్



అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కడగండ్ల మధుబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 11 గంటల సమయంలో బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో లోడుతో వస్తున్న ఏపీ 20 ఎక్స్ 8704 నెంబర్ గల వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అనుమానంతో పరిశీలించగా అవి రేషన్ బియ్యంగా తేలినట్లు తెలిపారు. వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. విచారణలో ఈ బియ్యం మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్‌కు చెందినవిగా నిర్ధారణ అయినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తలిపారు. ఇది ఇలా ఉండగా గత నెల 10న ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్న సంగతి విధితమే. నెల రోజుల వ్యవధిలోని షేక్ పెంటు సాహెబ్ 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తూ పోలీసులకు పట్టు పడటం విశేషం.

అర్హత సాధించిన ఉపాధ్యాయులకు టీఎస్ యుటిఎఫ్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయులుగా అర్హతసాధించిన వారికి టీఎస్ యుటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు బండారు నాగరాజు, కోశాధికారి లంక నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు రిపోర్టింగ్ ప్రక్రియ చేస్తున్న నూతన ఉపాధ్యాయులను కలిసి శుభాకాంక్షలు తెలిపి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగం సాధించిన వారికి పొంగులేటి అభినందనలు

నవతెలంగాణ -కూసుమంచి

డీఎస్సీలో ఉద్యోగం పొందిన జీళ్ళచెరువు గ్రామానికి చెందిన మండవ హరికృష్ణ కుమార్తె ప్రియాంక, అలాగే కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన రెండవ కుమార్తే ఉదయశ్రీలను రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘనంగా సన్మానించి, అభినందించారు. డీఎస్సీ లో 11వ ర్యాంక్ సాధించి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన మండవ ప్రియాంక గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ లో నియామక పత్రాన్ని అందించారు. కాగా శుక్రవారం కూసుమంచి క్యాంప్ కార్యాలయానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రియాంక, కొత్తగూడెంలో కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆమె సోదరి ఉదయశ్రీ కాంగ్రెస్ పార్టీ నాయకులతో మంత్రిని కలిసి మాట్లాడారు. అలాగే ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి, కూసుమంచి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ బీంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు పెండ్ర అంజయ్య, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, ఇంటూరి పుల్లయ్య, చిలకబత్తిని రామారావు, గోపి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి

నవతెలంగాణ-ఖమ్మం

దేశవ్యాప్తంగా నవరాత్రి సంబరాలు ఘనగా నిర్వహిస్తున్నారు. పురాణాల ప్రకారం.. మహిషాసురుడు అనే రాక్షసునిపై దుర్గా దేవి సాధించిన విజయాన్ని, రావణుడిపై శ్రీరామ చంద్రుడు సాధించిన విజయానికి ప్రతీకగా ఈ దసరా జరుపుకొంటారు. చీకటిపై వెలుగు సాధించిన విజయోత్సవమే ఈ దసరా. చీకటిని అంతం చేసే పండగ ఇది. చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని మాజీ కేంద్ర మంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. జగన్మాత ఆశీస్సులతో ఖమ్మం జిల్లా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉద్యమకారుల ఫోరం స్టేట్ స్టీరింగ్ కమిటీ చైర్మెన్‌గా రెండోసారి డాక్టర్ కే.వి కృష్ణారావు నియామకం

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మెన్‌గా డాక్టర్ కే.వి కృష్ణారావు ఎంపికయ్యారు. గత ఆరు సంవత్సరాల నుండి తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తూ గత సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టేట్ స్టీరింగ్ కమిటీ చైర్మెన్ బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలనే నినాదంతో తెలంగాణ ఉద్యమకారులను భాగస్వాములు చేసి ప్రభుత్వం ఏర్పాటులో సమర్థవంతంగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో డాక్టర్ కే.వి కృష్ణారావు చేసిన కృషిని గ్రహించి రెండోసారి కూడా చైర్మెన్ పదవిని ఏకగ్రీవంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మెన్ చీమ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.వి కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యమకారులందరిని కలుపుకొని పోయి వారి హక్కుల కోసం పోరాడి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. తమపై నమ్మకంతో మరోసారి ఈ బాధ్యత అప్పజెప్పినందుకు రాష్ట్ర చైర్మెన్ చీమ శ్రీనివాస్‌కు , రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను మేధావులుగా మార్చే
అద్భుతమైన ఆయుధం ఇంటిగ్రేటెడ్ స్కూల్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- విద్యారంగానికి రూ. 5 వేల కోట్లు కేటాయింపు
- రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు శంకుస్థాపనలు
- ప్రజల జీవితాలను మార్చే విద్యా రంగానికి అధిక నిధులు

నవతెలంగాణ - బోనకల్

విద్యార్థులను సమూలంగా మార్చే అద్భుతమైన ఆయుధం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల అని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల పరిధిలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య, బోధన, ఆటలు తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్తు తరాలకు ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యా బోధన అందిస్తామన్నారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాన్ని అమలు చేయటమే ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఉద్దేశం అన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విప్లవాత్మక మార్పులు తీసుకురావటమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచంతో పోటీ పడే విద్యార్థులను తయారు చేయటమే ఈ పాఠశాలల లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం కేవలం రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.73 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో తరగతుల ప్రారంభమవుతాయన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది రూ.1100 కోట్లు కేటాయించిందన్నారు. గత పది సంవత్సరాలలో విద్యారంగాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీరం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21, 400 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చామని, 34,706 మంది ఉపాధ్యాయులకు కోరుకున్న చోటకు బదిలీలు చేశామని తెలిపారు. విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5000 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలపై ప్రతిపక్షం అర్థం లేని ఆరోపణలు చేసిందని, ఇది సాధ్యం కాదని ప్రచారం చేసిందని, కానీ తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇది సాధ్యమేనని నిరూపించిందని తెలిపారు. బోనకల్ మండల ప్రాంతం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలతో నిండిపోయిందని, అటువంటి స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

దున్నేవానికే భూమి, విశాలాంధ్రలో ప్రజారాజ్యం పేరుతో ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటం చేశారని, వారి పోరాట స్ఫూర్తితోనే ఈ ప్రాంతంలో ఈ పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే కాక క్రీడాకారులను తయారు చేయటానికి క్రీడా ప్రాంగణాలను కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు దసరా పండుగను ఒకరోజు ముందుగానే 28 అసెంబ్లీ నియోజకవర్గాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు తాను, ఆ నియోజకవర్గాలలో మంత్రులు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. ఈ పాఠశాలకు వెళ్లేందుకు పాతర్లపాడు నుంచి గోవిందాపురం, రేపల్లెవాడ నుంచి లక్ష్మీపురం, లక్ష్మీపురం నుంచి పాతర్లపాడు వరకు రోడ్డు వేయనున్నట్లు తెలిపారు.

మధిర నియోజకవర్గ ప్రజలు ఎంతో అదృష్టవంతులని వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఈ పాఠశాలను రూపకల్పన చేశారని, దీంతో ఆయనకు ఈ ప్రాంత ప్రజలపై ఉన్న నిబద్ధతకు అద్దం పడుతుందన్నారు. ఈ పాఠశాలలో ప్రపంచస్థాయి స్థాయి మేధావులను తయారు చేయటం కోసమే ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల విధానం ఎక్కడా లేదని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి అన్నారు. ఒకే క్యాంపస్ లో అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులను కలిపి విద్యాబోధన చేయటం గర్వ కారణమన్నారు. రెండు నెలల క్రితం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల విషయంపై తనతో ఉపముఖ్యమంత్రి చర్చించినప్పుడు ఆశ్చర్యపోయానని తెలిపారు.





దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఇటువంటి పాఠశాలను ఏర్పాటు చేయటం ప్రథమమని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన పిల్లలకు ఈ పాఠశాలలో విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర హస్తకళల అభివద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు జిల్లా విద్యాశాఖ అధికారి ఏటూరి సోమశేఖర శర్మ, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు ఉమ్మనేని కోటయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ ఎన్‌బి హేమలత, ఈఈ జీ.తానేశ్వర్, డీఈ గొంగడి శంకర్రావు, మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో మిట్టపల్లి రవికుమార్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, డీసీసీబీ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు, కాంగ్రెస్ యువ నాయకుడు బిపి నాయక్, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ కిలారి వెంకటేశ్వరరావు, గోవిందపురం ఎల్ మాజీ సర్పంచ్ ఉమ్మనేని బాబు, టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు తదితరులు నియోజకవర్గంలోని రెసిడెన్షియల్ ఆర్‌సిఓలు, మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గజమాలతో భట్టికి సన్మానం:

ఈ సందర్భంగా వేదికపై మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. గోవిందపురం ఎల్ గ్రామ పొలిమేరలో ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండల పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు వివిధ సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు.



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా శాఖమూడి సుభాషిణి ఎంపిక

- అభినందనలు తెలిపిన తెలంగాణ రైతు సంఘం నాయకులు

నవతెలంగాణ-కొణిజర్ల

ప్రభుత్వం ప్రకటించిన ఉపాధ్యాయ నియామకం ఫలితాల్లో లాలాపురం గ్రామానికి చెందిన శాఖమూడి సుభాషిణి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. శుక్రవారం సుభాషిణిని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, సీఐటియు జిల్లా నాయకులు అనుమోలు రామారావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్యలు అభినందనలు తెలిపారు. సుభాషిణి భర్త వైరా లోని క్రాంతి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సంక్రాంతి పురుషోత్తం, మండవ బ్రహ్మేశ్వరావు, చింతనిప్పు సులోచన తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన సొసైటీ భూముల్లో...! గిరిజనేతరుడి పెత్తనమేంటి..!!

- పోలీసు హెచ్చరికను కాదని వేరే వాళ్లకు కౌలుకు...?
- జిల్లా సహకారశాఖ మౌనానికి అంతర్యం ఏమిటి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-సత్తుపల్లి

గిరిజన సొసైటీ భూముల్లో గిరిజనేతరుడి పెత్తనమేంటని ఆ సొసైటీకి చెందిన సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సుమారుగా నాలుగైదు ఎకరాలను దున్నించి చదును చేయించిన ఆ గిరిజనేతరుడు ఆ భూమిని వేరేవాళ్లకు కౌలుకిచ్చి కొత్తపంట వేయించేందుకు శ్రీకారం చుట్టారు. టూకీగా చెప్పాలంటే సత్తుపల్లి మండలం గంగారంలోని గిరిజన సొసైటీకి ప్రభుత్వం ఇచ్చిన భూమి 125 ఎకరాలు ఉంది. ఆ భూముల విషయంలో సొసైటీలోని సభ్యుల మధ్య వివాదాలు చోటుచేసుకొని రెండు వర్గాలుగా విడిపోయారు. గిరిజనుల మధ్య ఏర్పడిన గొడవలను అనుకూలంగా తమకు మలచుకొన్న అదే గ్రామానికి చెందిన గిరిజనేతరులు సొసైటీలోని గిరిజనులను కొంతమందిని తమ బుట్టలో వేసుకొని గత 2 రెండు దశాబ్దాలుగా నామమాత్రపు కౌలు చెల్లిస్తూ కోట్లు గడించారు. ఇటీవల సొసైటీలోని రెండు వర్గాల మధ్య భూవివాదం ముదిరి పాకాన పడింది. కొంతమంది సభ్యులను వారిసొంత భూముల్లోకి రాకుండా సొసైటీ సభ్యుల మధ్య అగ్నికి ఆజ్యం పోసి కొట్టుకు చచ్చేలా గిరిజనేతరులు చేస్తున్నారు. ఎందుకంటే గిరిజన సొసైటీ సభ్యులంతా ఐక్యంగా ఉంటే వాళ్ల భూముల్లో సేద్యం చేయడం సాధ్యం కాదని భావించిన ఆ గిరిజనసేతరులు ఎప్పటికప్పుడు సొసైటీ సభ్యుల మధ్య నక్కజిత్తులతో వివాదాలు సృష్టిస్తూ పబ్బం గడుపుకొనేందుకు వాళ్లు చేయని ప్రయత్నమంటూ లేదు. ఇటీవల భూముల విషయంలో రెండు వర్గాలు ఘర్షణకు దిగగా సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణను నివారించారు. సొసైటీ భూముల తగాదా వ్యవహారం తేలేవరకు ఆ భూముల్లోకి సభ్యులెవ్వరూ వెళ్లొద్దని హుకుం జారీ చేశారు. అయినా ఆ భూములతో ఎలాంటి సంబంధం లేని గిరిజనేతరుడు ఏకంగా పోలీసు హెచ్చరికను కాదని గుట్టుచప్పుడు కాకుండా ఓ నాలుగైదు ఎకరాలను దున్నించి చదును చేయించి ఎకరం రూ. 25వేల చొప్పున వేరేవాళ్లకు కౌలుకు ఇచ్చినట్లు గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు.



ప్రభుత్వముంది. అధికార యంత్రాంగ ముంది. నివారించడానికి పోలీసులున్నారు. ఇంత బరితెగించి ఫ్యాక్షనిస్ట్ మాదిరిగా ఆ గిరిజనేతరుడు గిరిజనుల భూముల్లో చొరబడి ఇతరులకు కౌలుకిస్తుంటే అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్టు ఉండటమేంటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గిరిజన సొసైటీ భూముల తగాదా వ్యవహారాన్ని తేల్చడానికి జిల్లా సహకార శాఖ అధికారులు రంగంలోకి దిగక పోవడానికి ఏ రాజకీయశక్తి అడ్డుపడుతుందనే సందేహాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

కమ్యూనిస్టు పార్టీలో ఎంతోమంది త్యాగాలు చేశారు

- సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్

నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పార్టీలో ఎంతోమంది త్యాగాలు చేసిన వారు ఉన్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ అన్నారు. ఖమ్మం త్రీ టౌన్‌లో 31వ డివిజన్ బోసు సెంటర్ ఆదిలక్ష్మి కోల్డ్ స్టోరేజ్‌లో 31వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి అధ్యక్షతన శాఖల మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభల సందర్భంగా మహాసభల ప్రారంభ ఉపన్యాసం ఎర్ర శ్రీకాంత్ చేశారు. సీపీఐ(ఎం)లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ప్రజల కోసం తన యావదాస్తిని సుమారు 300 ఎకరాలను పేద ప్రజలకు పంచిపెట్టారని ఆయన ప్రేమ వివాహం చేసుకొని పిల్లలు పుడితే ప్రజాసేవకు ఆటంకం కలుగుతుందని స్వార్థం పెరుగుతుందని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొని, జీవితం చివరి వరకు ప్రజాసేవలో నిమగ్నమైనారన్నారు. ప్రజాసేవ చేసుకుంటూనే పార్లమెంట్లో గొప్ప నాయకుడిగా ఉపన్యాసకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అలాగే మొన్న అమరుడైన కామ్రేడ్ సీతారాం మేసూరి ఒక పెద్ద కుటుంబం నుండి వచ్చారని, ఆయన కూడా విద్యార్థి దశ నుండి అఖిలభారత కార్యదర్శిగా పనిచేస్తూ అమరుడైనాడని అన్నారు. ఈ శాఖ మహాసభలలో నూతన కార్యదర్శులుగా ఆవుల శ్రీనివాసరావు, బొమ్మ కంటి పాపారావు, ఎర్ర మల్లికార్జున్, ఎడవల్లి నరసింహారావు, దేవి శెట్టి నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, రావుల శ్రీనివాసరావు, పద్మ లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు



ఎర్ర శ్రీనివాసరావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు షేక్ హిమామ్, కొట్టే అలివేలు, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు కొండబోలు సురేష్ ప్రోత్సాహం అభినందనీయం

- అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్

నవతెలంగాణ-వైరా

నిరుపేద మెరిట్ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ లక్షలాది రూపాయలు సహాయం చేస్తూ వారికి ఆసరాగా నిలువడం అభినందనీయమని ఖమ్మం అడిషనల్ పోలీస్ సూపరిండెంట్ ఎ .నరేష్ కుమార్ అన్నారు. వైరా గుట్ట బడి పాఠశాలలో ఉపాధ్యాయులు జీ.వి సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరేష్ కుమార్ మాట్లాడుతూ వైరా పరిసర గ్రామాల నుండి ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ లో సీటు సాధించి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తున్నారని, విద్య మానవునికి గొప్ప ఆయుధం అని, సామాన్యుడిని అసమాన్యుడుగా మార్చేది విద్య అన్నారు. ఆ విద్యను పొందడం పేదవారికి కష్టమవుతున్న సందర్భంలో అటువంటి వారిని గుర్తించి ఆసరాగా నిలుస్తున్న కొండబోలు సురేష్, వారి సోదరి కొండబోలు లలిత అందిస్తున్న ప్రోత్సాహం అద్వితీయం అని వారి సహాయంతో విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు బాబు బయ్యన మాట్లాడుతూ కొండబోలు సురేష్ మాతృదేశంలోనే కాక అమెరికాలో కూడా బీద విద్యార్థులకు సహాయం చేస్తున్నారని అన్నారు.



ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన దిద్దుపూడి గ్రామానికి చెందిన శ్రీహర్షితకు ఈ సంవత్సరం 5వేలు, ప్రతి సంవత్సరానికి అయ్యే ఖర్చులకు 90వేల రూపాయలు, సత్తుపల్లికి చెందిన ఎస్టీ విద్యార్థిని శివభార్గవి మెడిసిన్ చదువు కోసం కొండబోలు లలిత రూ.35000 బాసరలో చదువుతున్న కేజీ సిరిపురానికి చెందిన కొండూరి శివసాయికి 15 వేలు, గొల్లపూడికి చెందిన షేక్ చాందినికి పది వేలు, ఇంజనీరింగ్ చదువుతున్న యం. ప్రణయకు 5 వేలు, నాగలక్ష్మికి 5 వేలు సురేష్ అందించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్మెన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మెన్ సీతారాములు, మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్ రావు, లయన్స్ క్లబ్ గవర్నర్ కాపా మురళీ కృష్ణ, లయన్స్ క్లబ్ వైరా బాధ్యులు వెంకటేశ్వరరావు, గ్రేట్ విజన్ బాధ్యులు తోటకూర శ్రీకాంత్, ఉపాధ్యాయ సంఘనేతలు దొడ్డా వరప్రసాద్, పెనుగొండ ఉపేంద్రరావు, పాలపర్తి భాస్కరరావు, పాటి రామచంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసాచారి, విశ్రాంత ఉపాధ్యాయులు నాగబత్తిని భాస్కరరావు,పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకి సీపీఐ(ఎం) బోనకల్ గ్రామ శాఖ వినతి

నవతెలంగాణ - బోనకల్



భట్టికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

బోనకల్ గ్రామంలోని వివిధ సమస్యలపై సీపీఐ(ఎం) గ్రామ శాఖ నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన అనంతరం సభా వేదికపై ఆయనను కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. బోనకల్ థియేటర్ సెంటర్లో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండుటవల్ల తరచూ ప్రయాణికులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుటమే కాకుండా ఇటీవల ఇద్దరు వ్యక్తులు మరణించారని వినతి పేర్కొన్నారు. ఆ ప్రదేశంలో రింగు ఏర్పాటు చేయాలని, అలాగే బోనకల్ మండల కేంద్రంలో గల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పార్టీ మండల కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాస రావు, గ్రామ కార్యదర్శి ఉప్పర శ్రీను, శాఖ సభ్యులు నారపోగు జాన్ సైమన్, చేబ్రోలు రవి తదితరులు ఉన్నారు.

కృష్ణాపురంలో ప్రజా దర్బార్

- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-మధిర

కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు నివాసంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొని దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు, నిడమానూరి వంశీ, అద్దంకి రవి, పులిబండ్ల చిట్టిబాబు, వేల్పుల సెంచయ్య, యన్నం కోటేశ్వరరావు, చక్రి, బుల్లెద్దు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామం నుండి పదిమంది ఉపాధ్యాయులుగా అర్హత

నవతెలంగాణ-ఎర్రుపాలెం



2024 డిఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఒకే గ్రామం నుండి పదిమంది అర్హత సాధించారు. మండల పరిధిలోని రాజుదేవరపాడు గ్రామానికి పది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. వెన్నపూస శ్రీనివాసరెడ్డి, వెన్నపూస అప్పిరెడ్డి, వెన్నపూస మధుసూదన్ రెడ్డి, లక్కీరెడ్డి తిరుపతిరెడ్డి, వేమిరెడ్డి రాధారుక్మిణి, దుద్ధుకూరు గోపీక్రిష్ణ, దుద్ధుకూరు కృష్ణవేణి, పోద్దిల సాంబయ్య, పోద్దిల వెంకటనారాయణ, కోమిటి కోటీశ్వరరావు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

కుల, మత భావనను పోగొట్టేందుకే సమీకృత గురుకులాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గత పాలకులు కులాలు, మతాల వారీగా విద్యార్థులకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారు. విద్యార్థులలో కుల, మత భావనను పోగొట్టి అందరూ సమానమే అనే భావనను నెలకొల్పేందుకు, విద్యార్థుల్లో సమానత్వం కోసం తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులో శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఒకే రోజు 28 గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు జరుగుతున్నాయని, అందులో రాష్ట్రంలో మొదటిగా పాలేరులో శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలను మంజూరు చేసి భవనాలు లేక కోళ్లఫారాలలో, శిథిల భవనాలలో, కూలడానికి సిద్ధంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాల భవనాలలో ఎక్కువ అద్దెలు చెల్లిస్తూ గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆయా భవనాల్లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. రూ. 657 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించామన్నారు. 25 ఎకరాల్లో రూ.125 నుంచి రూ.150కోట్ల వ్యయంతో భవనాలు నిర్మించి అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని హంగులతో కార్పొరేటికి దీటుగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే విధంగా సమీకృత గురుకుల పాఠశాలలు ఉంటాయన్నారు.ఎంపీ రఘురామిరెడ్డి మాట్లాడుతూ..యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రపంచంలోనే ఎక్కడా లేవని వీటివల్ల రూరల్ ప్రాంతాల్లోనే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జాతీయ విద్యా కమిషన్ నూతన పాలసీకి అనుగుణంగా తరగతి గదులు,ల్యాబ్ భవన నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇక మీదట నాణ్యమైన విద్యకోసం విద్యార్థులు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి వాటికి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ..ఖమ్మం జిల్లాకు ఈ రోజు చారిత్రాత్మక రోజు అవుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యా ఒకే చోట అందుతుందని వివరించారు. సభలో ముందుగా ముగ్గురు విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రేనాల్ శ్రేష్ఠ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, డీఆర్డీఓ సన్యాసయ్య డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాథబాబు, నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, బండి జగదీశ్, గరికపాటి వెంకట్రావు, మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, కేతినేని వేణు అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





విద్య ప్రాథమిక అంశంగా ప్రజా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం :

విద్య ప్రాధాన్యత అంశంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుందని, పేద ప్రజలకు ప్రపంచంతో పోటీపడే విద్య అందే దిశగా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం జింకలతండాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనులకు, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి కావలసిన అత్యంత ప్రాధాన్యత అంశం విద్య అని, ముఖ్యమంత్రి పదవిలో వచ్చిన దగ్గర నుంచి గత 20, 30 సంవత్సరాలుగా ప్రభుత్వాలు విద్యపై ఆశించిన స్థాయిలో శ్రద్ధ పెట్టకపోవడం వల్ల మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడలేకపోతున్నారని ఆలోచించి, ప్రపంచంతో పోటీ పడే విధంగా నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాకు, రాష్ట్రానికి ఈ రోజు చారిత్రాత్మక రోజు అవుతుందని, అనేక ప్రాంతాలలో ప్రజలకు అనేక ఆకాంక్షలు ఉంటాయని, కానీ ప్రతి ఒక్కరికి తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందాలని ఆశిస్తారని, అది అందించేందుకు ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలు దోహద పడతాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాలకు కలిపి నాణ్యమైన విద్య అందించేందుకు అద్భుతమైన మౌళిక వసతులు, క్రీడా వసతులు, మంచి పౌష్టికాహారం అందించే దిశగా కృషి చేస్తామన్నారు. మంత్రి ఆదేశాల మేరకు సంవత్సర కాలంలో సివిల్ పనులు నాణ్యతతో పూర్తిచేసి విద్యార్థులకు వేగవంతంగా అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల ద్వారా అన్ని కులాలు, మతాల వారు కలిసి ఒకేచోట చదువుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. దీని వల్ల అందరూ సామరస్యంగా బాగా చదివే అవకాశం ఉందని, దీని వల్ల ప్రతి వర్గానికి లాభం చేకూరుతుందని, సమీకృత రెసిడెన్షియల్ విద్యాసంస్థలు నిర్మిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఆర్ అండ్ బి ఎస్ఈ హేమలత, కార్పొరేటర్ కమర్తపు మురళి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిలవకుండా రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణ పనులు ఉండాలి

వర్షపు నీరు నిలవకుండా సాఫీగా వెళ్లే విధంగా రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణ పనులు ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి, ఎంజీఎస్ఆర్ఈజీఎస్ నిధులు అంచనా విలువ రూ. 27 లక్షలతో పుటాని తండలో చేపట్టిన అంతర్గత (5) సిసి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.కోటి 36 లక్షల 50 వేలతో బూడిదంపాడులో చేపట్టిన (27) సిసి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు, రూ.10 లక్షలతో సూర్యతండలో చేపట్టిన ఒక సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో చేపట్టిన రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని, పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్(75) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, మాజీ విడిసి చైర్మెన్ మారశ్శ మల్లికార్జునరావు, సొసైటీ డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎల్లంకి వెంకటయ్య, గుమ్మ వలరాజు, షేక్ జమాల్, నాగుల్ మేరా, రాకేష్ తదితరులు నివాళు లర్పించారు.



పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో గోకినేపల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య శుక్రవారం పత్తి, మిర్చి, వరి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడి పంటలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈఏడాది అతివృష్టి వలన పంటలకు తెగుళ్ల ప్రమాదం ఉందన్నారు. సాగు పంటలపై రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎస్.సరిత, ఏఈఓ ఆర్. మౌనిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

సత్యవతికి నివాళి

నవతెలంగాణ-కల్లూరు

పట్టణానికి చెందిన ఇజ్జగాని సత్యవతి శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసి చైర్మెన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కాంగ్రెస్ కల్లూరు మండలం నాయుకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, పెద్దబోయిన శ్రీనివాసరావు, కాంగ్రెస్ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మహనీయుల ఆలోచనలను పాటిద్దాం'

- అంబేద్కర్, జగజ్జీవన్‌రావ్ విగ్రహాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-కొణిజర్ల

మహనీయుల ఆలోచనలను అందరూ పాటించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని సీంగరాయపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామ సెంటర్‌లో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్‌రావు విగ్రహాలను ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త కుంచపు రాంబాబు, టిఎస్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, మధిరకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట రాంబాబు, సురక్ష హస్పిటల్ చైర్మెన్ డాక్టర్ బాల భాస్కర్‌రెడ్డి, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్‌లు అవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏలూరి శ్రీనివాస్ రావు, కుంచపు రాంబాబు, కోట రాంబాబు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే మనందరికీ చదువు తోపాటు ఉపాధి ఆవకశాలు అందుతున్నాయన్నారు. లక్షలు ఖర్చు పెట్టి విగ్రహాలు ఏర్పాటు చేస్తే సరిపోదాని మహనీయుల ఆశయాల సాధన కోసం కృషిచేయాలన్నారు. అనంతరం స్పర్శసామాజిక అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని లేకుండా చేసి మనుధర్మశాస్త్రాన్ని తెచ్చి మనపై రుద్దాలని బిజెపి దాని అనుబంధ సంఘాలైన ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ లాంటి సంస్థలు కలిసి కుట్రపన్నుతున్నాయని అంబేద్కరిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి మనుధర్మశాస్త్రం సనాతన ధర్మం లాంటి వాటిపై పోరాడాల్సిన పరిస్థితి ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దొడ్డపనేని క్రిష్ణార్జున్‌రావు, అనుమోలు ప్రసాద్, అనుమోలు క్రిష్ణార్జున్ రావు, పాసంగులపాటి శ్రీనివాస్ రావు, షేక్ ఖాసిం, వడ్లమూడి శివ, రావుల వెంకయ్య, మట్టా వెంకటేశ్వర్లు, బాబు విగ్రహాల ఏర్పాటు కమిటీ సభ్యులు కంకణాల శ్రీనివాస్‌రావు, తుడుం వెంకట్, లక్ష్మణ్‌రావు, అలవాల గోపి, వెంకటేష్, బోయల గోపి, శ్రీనివాస్‌రావు, లక్ష్మీ నారాయణ, అనపనుచు మేడి రామారావు, కిరణ్, తిరుమలరావు, పాల్గొన్నారు.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT KHAMMAM
DISPUTE NO. 200 OF 2020

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Akula Suresh, & 8 Others
To
Opponent No.4. Vankdoth Anusha, D/o. Immamuddin, Age: 26 Years Occ: Attenderr, MPDO Office, Sathupally, R/o. H.No. 7-3-78, Dwaraka Nagar, Khammam Town and District. 507001. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 4,90,953=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 189 OF 2020

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Bhanuchandra Murthi Panda, & 8 Others
To,
Opponent No.1. Mr.Panda Bhanuchandra Murty, S/o. Babu Rao, Age: 68 Years, Occ: Police Constable, PS Aswaraopeta, Emp.Id.No.2966, R/o.H.No.4-36, Gorregutta, Lingalapaly (Post), Dhammapeta Mandal, Bhadradri Kothagudem District.507306.
Opponent No.2. Vagaboina Kiran Kumar S/o. Krishna Murty, Age: 30 Years, Occ: Police Constable, DSP Sathupally, Emp.Id.No.2630, R/o.H.No.9-259/50/1, Virat Nagr, Ayyagaripeta, Sathupally Town and Mandal, Khammam District .507303 ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 16,000=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 201 OF 2020

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Ravuri Vijaya Rao, & 3 Others
To,
Opponent No.1. Mr.Ravuri Vijaya Rao, S/o. Gaddaiah, Age: 41 Years, Occ: Driver, TSRTC Sathu pally, Depot, R/o. H.No. 1-217, Beerapalli Village, Vemsoor Man dal, KhammamDistrict. 507164.
Opponent No.2. Ramisetti Raja Rao, S/o, Krishnaiah, Age: 49 years, Occ: Driver, TSRTC, Sathupally Depot, R/o. H.No. 6-18, Yedlabanjara, Gouraram, Pedu balli Mandal, Khammam District. 507302 .
Opponent No.3. Sadu Ravi, S/o. Laxmaiah, Age: 39 Years Occ: Driver, TSRTC, Sathupally Depot, R/o. H.No. 5-9, SC-Colony, Marlapadu, Vemsoor Mandal, Khammam District. 507164.
Opponent No.4. Karri Ram pulla rao, s/o. bheeraiah Age: 31 Years Occ: Driver, TSRTC, Sathupally Depot, R/o. H.No. 4-33, Kuramgu dem, Marlapadu Vemsoor Mandal , Khammam District.507164. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 73,970=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 367 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited,H.NO.1-7, R.V.Complex 1st Floor,Madhira,Khammam District, Represented by its Branch Foreman, CH.Narasimha Rao, S/o, Gurulingam, Age:32 Years, Occ. Foreman Of above. ....DISPUTANT

VERSUS

Mr. Allu Naveen Kumar, & 02 Others
To,
Opponent No.1. Allu Naveen Kumar, S/o Pushpa Raj, Age: 37 years, Occ: Private Electrician, R/o H.No. 5-45, Parshibandam, Khammam Urban & District.
Opponent No.2. Kondra Sanjeeva Kumar, S/o Deva Danam, Age: 47 Years, Occ: Police Constable, R/O. H,No. 5-1-373, Kaviraj Nagar, Khammam Town & District. ....OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 17,322/- against you and others and where as the above Arbitration/Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS. AT : KHAMMAM
DISPUTE NO. 193 OF 2020

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 15-169, 1st Floor, NVR Complex, Near Bus Stand, Sathupally, Khammam District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Akula Suresh, & 5 Others
To
Opponent No.1. Akula Suresh, S/o. Venkateswar Rao, Age: 36 years, Occ: Madhuri Tea Stall at RTC Complex, Sathupally, R/o. H.No. 6-28/2, Lalitha Kumari Hospital Road, Sathupally Mandal, Khammam District. 507303.
Opponent No.2. Vankdoth Anusha, SD/o. MD. Imamuddin, Age: 26 years, Occ: Office Sub Ordinate, MPDO Sathupally, Emp Id: 1645111, R/o. H.No. 11-10-383, NSP Camp, Khammam, Khammam District. 507002. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 1,76,496=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 215 OF 2020

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 2-1-101, 1st Floor, Masjid Center, Ashok Nagar, Main Road, Manuguru, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Gangi Reddy Konda Reddy, & 4 Others.
To
Opponent No.3. Vangala Srinivas Reddy, S/o. Lakshma Reddy, Age: 46 Years, Occ: P.A.CHP/KTPS, Palvancha, R/o. H.No. 18-1-202, Bolloriguden, Palvancha Town, PalvanchaMandal, Bhadradri Kothagudem District. 507115.
Opponent No.5. Kurri Muthaiah, S/o. Guravaiah, Age: 52 Years, Occ: Mazdoor, KTPS Hospital, Palvancha, R/o. H.No. 3-1-84, Vengal Rao Colony, Palvancha Town, Palvancha Mandal, Bhadradri Kothagudem District. 507115. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 3,586=00 against you and others and where as the above Arbitration/Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 64 OF 2022

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 11-2-108, Main Road, Opp. AshramaHigh School, Gandhinagar, Palvancha, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Manchala Thirupathi Rao, & 6 Others
To
Opponent No.4. Dharmarajula Srinivas Rao, S/o. Chandraiah, Age: 53 Years, Occ: P.A.,KTPS, Palvancha, R/o. H.No.1-3-92, Chakali Bazar, Old Palvancha, Bhadradri KothagudemDistrict. 507115
Opponent No.5. Mohammad Ibrahim Siddiqui Khaja, S/o. Ahmed, Age: 46 Years, Occ: P.A., B-Station, Palvanch, R/o. H.No. 20-6-182, Babuji Nagar, Palva ncha, Bhadradri Kotha gudem District.507155 ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 81,926=00 against you and others and where as the above Arbitration/Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 94 OF 2022

M/s. Kapil Chits (Kosta) Private Limited, H.NO.9-4-2, Ist Floor, Sri Sai Complex, Station Road, Khammam Town & District, Represented by its Foreman, V.Madhukar S/oKasiviswanadam, Age: 38 Years, Occ: Foreman Of above, ...DISPUTANT

VERSUS

Mrs. Guguloth Jamuna & 3 Others
To
Opponent No.2. Azmeera Devsingh, S/O. Harisingh, Age: 51 years, OCC: S.G.T.,G.T.W.A.H.S, Relakayalapalli, R/O. H.No.3-65/1, Relakayalapally, Karepally Village & Mandal, Khammam District.
Opponent No.3. Banoth Padma, W/O. Venugopal, Age: 41 years, OCC: S.A(M)..Govt.T.W.A.H.S, Rompaid, R/O. H.No.4-16/1, Govindrala Village, Kamepalli Mandal,Khammam District. ....OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs.15,736=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrarof Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT: KHAMMAM
DISPUTE NO. 220 OF 2019

M/s.Kapil Chits (Telangana) Private Limited, H.No. 13-3-212/6, Cherla Road,Bhadrachalam, Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Podila Madhu, & 4 others
To,
Opponent No.2. Mallala Harinadha Babu, S/o. Nagaiah, Age: 45 Years, Occ:Foremen-I, KTPS., Palvancha, R/o. Q.No. BF-307, B-Colony, KTPS., PalvanchaMandal, Bhadradri Kothagudem District.
Opponent No.3. Namireddy, Narsimha Reddy, S/o Venkat Reddy, Age: 42 Years,Occ: Jr. Plant Attendent, KTPS., Palvancha, R/o. Q.No. 39, A-colony, KTPS.Palvancha Mandal, Bhadradri Kothagudem District ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs.1,31,473=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT : KHAMMAM
DISPUTE NO. 86 OF 2022

M/s.Kapil Chits (Kosta) Private Limited,H.NO.1-7, R.V.Complex 1st Floor, Madhira,Khammam District, Represented by its Branch Foreman, CH.Narasimha Rao, S/o,Gurulingam, Age:32 Years, Occ. Foreman Of above. ....DISPUTANT

VERSUS

Mr. Kota Nagaraju, & 11 Others
To,
Opponent No.2. Mutteboina Satheesh, S/O. Muthesham, Age: 34 years, R/O.H.No.10-118, Azad Road, Madhira Town & Mandal, Khammam District.
Opponent No.4. Darisetti Satthi Babu, S/O. Bathakaiah, Age: 35 years, C/O. M/S. Kapil Chits (Kosta) Pvt Ltd., R/O.H.No.1-7, R.V. Complex, Madhira Town & Mandal, Khammam District.
Opponent No.6. Kore Krishna Rao, S/O. Ramaiah, Age: 42 years, Occ:Police Constable-877, R/O.H.No.1-122, Gannava ram Village, Wyra Mandal, Khammam District.
Opponent No.7. Baluguri Appaiah, S/O. Appaiah, Age: 42 years, OCC:TRAKMNTR-IV, R/O.H.No.1-107/1, Rajeev Nagar, Madhira Town & Mandal, Khammam District.
Opponent No.8. Vennepusa Venkata Narsi Reddy, S/O. Pedda Pulla Reddy, Age: 42 years,OCC: Prop of Sathya Sri Motors, R/O.H.No.2-242, Sathyalapadu Village, Gampalgudem Mandal, Krishna Dist.
Opponent No.9. Gaddala Nagaraju, S/O. Venkatesh, Age: 33 years, R/O.H.No.1-33, Chintha lanarva Village & Post, Gampala gudem Mandal, Krishna District.
Opponent No.10. Kota Moshe, S/O. Ramaiah, Age: 71 years, R/O.H.No.1-85, Nakkala Garuvu Village & Post, Madhira Mandal, Khammam District.
Opponent No.11. Polimera Jeevan , S/O. Yohan, Age: 40 years, R/O.H.No.13-53, Kummari Bazar, Penuganchiprolu Town & Mandal, Krishna District. ....OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 2,64,071/- against you and others and where as the above Arbitration/Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS. AT : KHAMMAM
DISPUTE NO. 265 OF 2015

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 4-1-8/A, Beside Pattabhiramayya Hospital, Ram nagar, Chunchupally, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Katari Ramesh Kumar, & 3 Others
To,
Opponent No.1. Katari Ramesh Kumar,S/o.Veera Swamy,Age 40 yrs,Occ: Sr Tech SSE/T,Bhadra chalam Road, Kothagudem. R/o H.No.2-1-279, SC/BC Colony, Dornakal, Khammam Dist.
Opponent No.2. Mahapatra Saroj Kumar,S/o.Bhikani Charan, Age 36 yrs,Occ: KH/Helper,SSE/TELE Bhadrachalam Road. R/O AT Bininda Post, Via Naranpur, Keonjhar District, Orissa State.
Opponent No.3. Nimma Thota Venkateswarlu, S/o.Papaiah, Age 56 yrs,Occ: Points Men,'A' Station Master, Kothagudem. R/o Railway Quarters,No.31/4,Writer Basthi, Khammam Town & District.
Opponent No.4.Marapaka Mukesh, S/o.Mallaiah, Age 26 years,Occ:KH/Helper,SSE/TELE, Bhadhrachalam Road. R/O Railway Q No.120/2, Writer Basthi, Kothagudem, Khammam District. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 49,400=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS.AT:KHAMMAM
DISPUTE NO. 82 OF 2016

M/s. Kapil Chits (Kosta) Private Limited, H.NO.9-4-2, Ist Floor, Sri Sai Complex, Station Road, Khammam Town & District, Represented by its Foreman, V.Madhukar S/oKasiviswanadam, .Age: 38 Years, Occ: Foreman Of above, ...DISPUTANT

VERSUS

Mr. Manda Sudhakar, & 7 Others
To
Opponent No.1. Manda Sudhakar, S/o Babu Rao, Age:42 Years, Occ:Prop: Software Skills Solutions, Hyderabad, R/o H.No:C-379,N.G.O.S Colony, Vanstali Puram, Near Christgousful, Hyderabad.
Opponent No.3. Gangimala Sundana Rao, S/o Suseela Rao Age:47 Years, Occ:Sr.Assistant, E.E. PR-Division, Bhadrachalam, R/o H.No:5-1-26, N.K.Nagar, Kothagudem, Khammam District.
Opponent No.5. Pilaka Mohan Reddy, S/o Satyanarayana Reddy, Age:42 Years, Occ:Typist,, Dy.E.E. PRI.SD.Manugur, R/o H.No;13-2-133,Ashok Nagar, Badhrachalam, Khammam District.
Opponent No.6. Metpally Madhu, S/o Guravaiah, Age:37 Years, Occ: Branch Manager, Kapil Chits (Kosta) Pvt.Ltd, R/o H.No;9-4-2, Sri Sai Complex, Station Road, Khammam Town & District.
Opponent No.7. Vaka Nireesha, W/o Sudhakar Reddy, Age:37 Years, Occ: Acconts Officer, Kapil Chits (Kosta) Pvt.Ltd,R/o H.No;9-4-2, Sri Sai Complex, Station Road, Khammam Town & Dist. ....OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs.1,00,844=00 against you and others and where as the above Arbitration/Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrarof Chits/ Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

BEFORE THE CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS. AT : KHAMMAM
DISPUTE NO. 375 OF 2016

M/s.Kapil Chits (Kosta) Private Limited, H.No. 11-2-108, Main Road, Opp. Ashrama High School, Gandhinagar, Palvancha, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman, ...DISPUTANT

VERSUS

Mr. Banothu Ramanadham & 3 Others
To,
Opponent No.1. Banothu Ramanadham, S/o. Manthirya, Age: 35 years, Occ: Contactor Works, Temporary, R/o. Narsimha Sagar, Kothagudem, Khammam District.
Opponent No.2. Gugulothu Erna, S/o. Ramji, Age: 35years, Occ: Police Constable-1313, III Town, Kothagudem, R/o. Narsimha Sagar, Kothagudem, Khammam District.
Opponent No.3. Banothu Rammurthy, S/o. Mangya, Age: 39 years, Occ: Chowkidar, C/o. The Director Mines & Geology, Kothagudem, R/o. H.No. 4-2-48, Ramnagar, Kothagudem, Khammam District.
Opponent No.4. Maloth Pool Singh, S/o. Manganna, Age: 38years, Occ: General Mazdoor, SCCL, Kothagudem, R/o. Housing Board Colony, Uppra Gudem Thanda, Sarvaram, Kothagudem, Khammam District. ......OPPONENTS

Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of Rs. 25,107=00 against you and others and where as the above Arbitration/ Dispute is posted to **12-11-2024** for your appearance. Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/ Arbitrator, Khammam on the above said date at 11:00 AM the matter will be determined setting you exparte.

Chit Arbitrator,
Deputy Registrar of Chits, Khammam.

ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



నవతెలంగాణ-దమ్మపేట

చెడు మీద మంచి సారించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగను పురస్కరించుకొని తెలుగు ప్రజల అందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. శక్తి ఆరాధనకు ప్రాముఖ్యత ఇచ్చే ఈ పండుగను ప్రజలందరూ ఘనంగా జరుపుకోవాలని మంత్రి తన ఆకాంక్షను తెలిపారు. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసుడిని తొమ్మిది రోజులపాటు యుద్ధం చేసి పదవ రోజున అతన్ని వధించిన సందర్భంగా ప్రజలంతా ఆనంద ఉత్సవాలతో జరుపుకునే ఈ పండుగను తెలంగాణతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని రాష్ట్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ విజయదశమి సందర్భంగా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని తుమ్మల ఆకాంక్షించారు.

అక్రమార్కులపై చర్యలకు సహకరిస్తా

- తహసీల్దార్‌తో ఎమ్మెల్యే పాయం




నవతెలంగాణ-పినపాక

పినపాక నూతన తహసీల్దార్ అద్దంకి నరేష్ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును మణుగూరు ప్రజాభవన్ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని తహసీల్దార్ అందజేశారు. చట్టబద్ధంగా పరిపాలనను కొనసాగించాలని, అక్రమాలకు పాల్పడే వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నా నేను అందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

తాటాకు తెగులుకు నివారణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ ఏడాది వరి పంటకు ఏర్పడిన తాటాకు తెగులు నివారణకు రక్షణ చర్యలు తీసుకోవాలని దుమ్ముగూడెం వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన తాటాకు తెగులు ఉన్న వరి పంటలను మండల వ్యాప్తంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటకు యూరియా వాడకం తగ్గించాలన్నారు. తాటాకు తెగులు నివారణ కోసం కాపర్ ఆక్సికాలరైడ్ 500 గ్రాములు ఎకరాకు స్ట్రెప్టోమైసిన్ 100 గ్రాములు ఎకరాకు 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని సూచించారు. ఈ మందులు పిచికారి చేసేందుకు కాపర్‌కు సంబంధించిన ఫాంగి సైడ్స్‌ని, స్ట్రెప్టోసిక్లిన్ 250 పిపిఎంతో కలిపి పిచికారి చేయడం వలన మంచి ఫలితం ఉంటుందని సూచించారు.

ఊరు బడిలో చదివి.. పేదరికం అధిగమించి ఎస్‌జీటీగా సౌజన్య



నవతెలంగాణ-అశ్వారావుపేట

పల్లెటూరు, పేదకుటుంబం, అయినా ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్న ఊరిలో ప్రభుత్వ బడిలో పట్టుదలతో చదివి కన్నవారి కల నెరవేర్చిన సాధారణ వివాహిత సౌజన్య. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలం అచ్యుతాపురంకు చెందిన మారగాని రాము-మంగతాయిలకు ముగ్గురు ఆడ సంతానంలో మూడో కూతురు సౌజన్య. అచ్యుతాపురం లోనే 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకుంది. 2010లో జిల్లాపరిషత్ పరిషత్ పాఠశాల మొదటి బ్యాచ్‌లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్, మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 2010 నుండి 2012 వరకు అశ్వారావుపేట వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదవి కాలేజీ ఫస్ట్‌గా నిలిచింది. 2012-2014 వరకు ఖమ్మం జిల్లా టేకులపల్లి ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈడీ చవింది. అనంతరం వివాహం చేసుకుని ఒక బాబుకు తల్లి అయింది. ఉద్యోగం ఎదురుచూసిన సౌజన్యకు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా కార్యదర్శిగా జోసెఫ్



నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా కార్యదర్శిగా కొత్తగూడెం పట్టణానికి చెందిన కొచ్చర్ల జోసెఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో శుక్రవారం జరిగిన సమితి జిల్లా సమితి సమావేశంలో జోసెఫ్‌ను ఎన్నుకున్నారు. నియామకపత్రాన్ని క్రైస్తవ హక్కుల రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ డాక్టర్ జున్ను జెర్మియా చేతులమీదుగా జోసెఫ్ అందుకున్నారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ క్రైస్తవ కుటుంబాలు, పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తానని, సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేద క్రైస్తవ కుటుంబాలు అందించాలని కోరారు. క్రైస్తవులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సమితి జాతీయ ఉపాధ్యక్షులు ఎం.లివింగ్ వాటర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పాస్టర్ తాటిపర్తి ఇమ్మానుయేలు తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

దసరా పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని కలెక్టర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఊరూ, వాడా, చిన్నా, పెద్ద తేడా లేకుండా తొమ్మిది రోజుల పాటు ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి బతుకమ్మ పాటలకు కోలాటాలు, నృత్యాలతో ఎంతో సందడి చేశారని అన్నారు. విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఈ దసరా పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో చేపట్టిన అన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలని, అభివృద్ధిలో మన జిల్లా ఆదర్శంగా నిలవాలని, అమ్మవారిని ప్రత్యేకంగా వేడుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించిన ఆయిల్ ఫాం సాగు...

- ఫ్యాక్టరీకి రూ.10 కోట్లు ఆర్థిక సాయం
- మరో 5 కొత్త ఫ్యాక్టరీలు మంజూరు
- సిద్దిపేటలో 50 శాతం పనులు పూర్తి
- బయో మాస్ పథకంలో ఏటా రూ.4.78 కోట్లు సబ్సిడి
- నేడే అశ్వారావుపేట విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం
- హాజరుకానున్న నలుగురు రాష్ట్ర మంత్రులు



నవతెలంగాణ-అశ్వారావుపేట

దీర్ఘకాలిక నికర ఆదాయంతో పాటు ఆయిల్ సాగులో అంతర పంటలతో అదనపు ఆదాయం ఉండటంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990వ దశకంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా, దమ్మపేట మండలం మల్కారంలో ప్రారంభమైన ఆయిల్ ఫాం సాగు నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల కే పరిమితమైన ఈ సాగు నేడు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించింది. 2011వ సంవత్సరానికి ముందు 35 వేల ఎకరాల్లో సాగవుతున్న ఆయిల్ ఫాం 2023 డిసెంబర్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో 2.20 లక్షల ఎకరాలకు విస్తరించింది. 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అశ్వారావుపేటలో ఒక పరిశ్రమను నిర్మించి నిర్వహిస్తూ, 2016లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో దమ్మపేట మండలం అప్పారావు పేటలో మరో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణం కాగా మరో 5 ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరయ్యాయి. ప్రయివేట్ కంపెనీలు కూడా ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నాయి. ముందు నిర్మించిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం నుండి ఏటా రూ.4.78 కోట్లు పర్యావరణ పరిరక్షణ కింద ఆయిల్ఫెడ్‌కు అదనపు ఆదాయం లభిస్తుంది. అశ్వారావుపేట పరిశ్రమలో తరుచుగా తలెత్తే విద్యుత్ అంతరాయాన్ని అధిగమించడానికి రూ.33 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల బయోమాస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం నలుగురు మంత్రులు లాంచనంగా ప్రారంభించనున్నారు.

ఆయిల్ ఫాం సాగు ప్రస్థానం ఇలా...

ఉమ్మడి(సమైక్య) ఆంధ్రప్రదేశ్ సాగు అవుతున్న ఆయిల్ ఫాం 1988లో తెలంగాణ ప్రాంతంలో ప్రారంభమైంది. నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా, దమ్మపేట మండలం గుత్తా వారిగూడెం చెందిన గుత్తా రాజా 10 ఎకరాలలో సాగును మొదలుపెట్టారు. 1995లో ఆయిల్ ఫాం మొక్కలు పెంపకానికి అశ్వారావుపేట మండలం వారివారి గూడెంలో నర్సరీ ప్రారంభించింది. 2000 సంవత్సరంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రభుత్వం 42 ఎకరాలు భూమిని కేటాయించింది. 2004లో అప్పటి సత్తుపల్లి ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అశ్వారావుపేటకు ఒక ఫ్యాక్టరీ 5 టన్నుల సామర్థ్యంతో మంజూరు చేయించారు. 2007లో పరిశ్రమ అందుబాటులోకి వచ్చింది. పెరిగిన సాగు విస్తీర్ణానికి అనుగుణంగా 5 టన్నుల సామర్థ్యాన్ని ఆయిల్ ఫెడ్ 2010లో 10 టన్నులుకు పెంచింది. 2012లో 10 నుండి 15 టన్నులు, 2016లో 15 నుండి 30 టన్నుల సామర్థ్యానికి విస్తరించింది.

2014 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తరణ

పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు దీర్ఘకాలంగా నికర ఆదాయం అందిస్తున్న ఆయిల్ ఫాం సాగు విస్తరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాదించింది. రానున్న పదేళ్లలో 10 లక్షల ఎకరాల్లో సాగు విస్తరణకు ప్రణాళిక ప్రకటించింది. ఇందుకు గాను హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల మినహా మిగతా 31 జిల్లాలను ఆయిల్ ఫెడ్ ప్రభుత్వ రంగ సంస్థతో పాటు మరో 14 ప్రయివేట్ కంపెనీలకు కేటాయించింది. వీటిలో ఆయిల్ ఫెడ్‌కు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్ధిపేట, జనగాం, మహబూబాబాద్, యాదాద్రి, నారాయణపేట, గద్వాల్ జిల్లాలను కేటాయించి మిగతా 21 జిల్లాలను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించింది. అంచెలంచెలుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ బాట పట్టింది. తాజా లెక్కల ప్రకారం 2 లక్షల 20 వేల ఎకరాల్లో సాగు అవుతోంది. ఆయిల్ ఫెడ్ పరిధిలో 1 లక్ష, 37 వేల 750 ఎకరాల్లోనే తోటలు సాగవుతుండగా మిగతా సుమారు 80 వేల ఎకరాల్లో ప్రైవేట్ కంపెనీల అధ్వర్యంలో సాగుతున్నాయి.


ఆరు ఫ్యాక్టరీలు మంజూరు...

వేగంగా విస్తరిస్తున్న సాగుకు అనుగుణంగా ఆయిల్ ఫెడ్ కొత్త పరిశ్రమలను నిర్మిస్తుంది. ఇందులో భాగంగానే 2016లో దమ్మపేట మండలం అప్పారావుపేటలో ఆధునిక సాంకేతిక హంగులతో ఒక పరిశ్రమను నిర్మించింది. ఇందుకు గాను రూ.100 కోట్లలో నాటి సర్కార్ రూ.10 కోట్ల గ్రాంట్‌గా సాయం అందించి ప్రోత్సహించింది. ఈ పరిశ్రమ 2017లో అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్న సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 5 పరిశ్రమలను నిర్మించాలని ఆయిల్ ఫెడ్ నిర్ణయించింది. రూ.255 కోట్లతో సిద్దిపేటలో, రూ.150 కోట్లులో గద్వాల్, రూ.200 కోట్లుతో మహబూబాబాద్, రూ.200 కోట్లుతో ఖమ్మం జిల్లా, వేంసూరు మండలం కల్లూరు గూడెం, రూ.190 కోట్లులో అదనంగా మరొకటి అశ్వారావుపేటలో నిర్మించడానికి రూపకల్పన చేసారు. సిద్దిపేట ఫ్యాక్టరీలో సుమారు 80 శాతం పూర్తి అయ్యాయి. అలాగే ప్రయివేట్ కంపెనీలు వనపర్తి, నిర్మల్, పెద్దపల్లి, ఖమ్మం జిల్లా, కొణిజర్లలో నాలుగు ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నాయి

రూ.36 కోట్లతో 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఫ్యాక్టరీలో రూ.33 కోట్లతో నిర్మించిన మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభానికి సిద్దమైంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు శనివారం లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు విద్యుత్ సమస్యతో ఫ్యాక్టరీ క్రషింగ్‌లో ఇబ్బందులు తలెత్తాయి. దీనిని అధిగమించడానికి ఆయిల్ఫెడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసింది. దీనిని గత ఏడాది జులై 13న అప్పటి ఆయిల్ఫెడ్ చైర్మెన్ కంచర్ల రామకృష్ణా రెడ్డితో కలిసి అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భూమి పూజ చేసారు. నేడు మంత్రులు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

రైతులు ఆయిల్ ఫాం వైపు దృష్టి సారించాలి




దీర్ఘకాలిక ఆదాయం, అంతర పంటలతో అదనపు రాబడి అందించే ఆయిల్ ఫాం సాగు వైపు ఇతర పంటలు సాగు చేసే రైతులు దృష్టి సారించాలి. కనీస గిట్టుబాటు ధర టన్నుకు రూ.18 వేలకు పైగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చేసి కృషి చేస్తుంది. దళారీ వ్యవస్థ లేకుండా పండించిన పంటను నేరుగా రైతుల నుండి సేకరించటంతో పాటు రవాణా చార్జీలను కూడా ఆయిల్ఫెడ్ చెల్లిస్తుంది. ఆయిల్ ఫాం రైతులకు ప్రభుత్వ ఉద్యోగికి ఉండే ఆర్థిక భరోసా ఉంటుంది. ఆయిల్ ఫాం సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మొక్క మొదలు, తోటల నిర్వాహణకు ప్రభుత్వం రాయితీ పథకాలు అమలు చేస్తుంది.

తూర్పు సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్, హైద్రాబాద్

ఏజెన్సీ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

హిందువుల ముఖ్యమైన పండుగ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు, పదవరోజు విజయదశమి దసరాను భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ అని ఏజెన్సీ ఏరియాలో గిరిజనులకు, గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు సేవలందిస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఐటీడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి అందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ సాంప్రదాయ ప్రకారం భక్తిశ్రద్ధలతో నియమ నిష్టలతో ఇంటిల్లిపాది జరుపుకునే పండుగ దసర అని తొమ్మిది రోజులపాటు దుర్గాదేవిని వివిధ రకాల శక్తి రూపాలతో అలంకరణ చేసి పూజలు చేస్తారని పదవరోజు కుటుంబం అంతా కలిసి ఆనందంగా దసరా పండుగ జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ పల్లెల్లోని పెద్దలు చెప్పిన చరిత్ర ప్రకారం రాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టు పై తమ ఆయుధాలను తిరిగి తీసుకున్న రోజు అని ఈ సందర్భంగా రావణ వద జమ్మి ఆకుల పూజ చేయడం రివాజు అని జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భంగా పదో రోజు ప్రజలంతా సంతోషంతో దసరా పండుగ జరుపుకుంటారని ఆయన అన్నారు. ఆదివాసీ మారుమూల గిరిజన ప్రాంతాలలో ఉండే గిరిజన కుటుంబాలు చాలా ఘనంగా సంతోషంగా పండుగ జరుపుకోవాలని అలాగే గిరిజనులందరూ అందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుతూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు.

కార్మికుల సంక్షేమమే సంస్థకు భవిష్యత్తు

- సింగరేణిలో "ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర" పై అవగాహన కార్యక్రమం
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి



నవతెలంగాణ-కొత్తగూడెం


కార్మికుల సంక్షేమమే సంస్థకు భవిష్యత్తు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యలయంలో సింగరేణిలో "ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర" పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ సింగరేణి సంస్థ స్థితి గతులు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణ అంశాలు భవిష్యత్ ప్రణాళికలు వంటివి ప్రతి ఒక్క ఉద్యోగికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క, సింగరేణి సంస్థ సిఅండ్ ఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల ప్రకారం సింగరేణి అన్నీ ఏరియాలలో ఉద్యోగులకు "ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర" పై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ మరిన్ని లాభాలు సాధించాలని కోరారు.

కార్మిక సంక్షేమం విస్మరిస్తే మనుగడ కష్టం : ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి మనుగడ సాగించాలంటే కార్మిక సంక్షేమాన్ని విస్మరించ వద్దని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. దక్షిణ భారత దేశంకి వెలుగులు కురిపించిన సంస్థగా సింగరేణికి 135 సంవత్సరాలకు పైగా మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని తెలిపారు. అలాంటి సింగరేణి సంస్థ భవిష్యత్తులో కూడా అదే విధంగా ఎక్కువ మంది కార్మికులు ఉండేలా సంస్థని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ఉపరితల గనుల లాభాలే కాదు, భూగర్భ గనులను కూడా లాభాలలోకి తీసుకురావటానికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని, సింగరేణి సంస్థ పురోభివృద్ధి, ఉజ్వల భవిషతుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమిష్టిగా శ్రమించాలని కోరారు. భూ గర్భ గనులలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకొని రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని తద్వారా ఉపరితల గనుల వలె భూ గర్భ గనులను కూడా లాభాల బాటలోకి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రంలో సింగరేణి డైరక్టర్ ఈఅండ్ఎం, అండ్ ఆపరేషన్స్ డి.సత్యనారాయణ రావు, డైరక్టర్ (పిఅండ్‌పి) అండ్ పా జి.వేంకటేశ్వర రెడ్డి, జిఎం(ఎంఎస్) టి.సురేష్ బాబు, ఏఐటీయూసీ భద్రాద్రి జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, గుర్తింపు సంఘం ఏఐటియూసి జనరల్ సెక్రటరీ కె.రాజ్ కుమార్, అడ్వైసర్ డి.శేషయ్య, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, కార్పోరేట్‌లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై మంత్రులు దృష్టి సారించాలి

- సీతారామ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య, కెచ్చల రంగారెడ్డిలు డిమాండ్




నవతెలంగాణ-జూలూరుపాడు

జిల్లా అభివృద్ధి పైన మంత్రులు దృష్టి సారించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య కెచ్చల రంగారెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడులో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులను చేపట్టడంలో మాటలు తప్ప చేతల్లో లేవని వారు విమర్శించారు. గొప్పగా ప్రారంభించిన సీతారాం ప్రాజెక్టు నీళ్ళు నేటికీ జిల్లా రైతులకు అందలేదని వారు ఎద్దేవా చేశారు. జిల్లాలో ప్రతి ఎకరాకు నీరందించేందుకు జిల్లా మంత్రులు దృష్టి సారించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. పేదల కలైన సొంత ఇంటి నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేసి విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మండలంలో రైతాంగం పత్తి పంటను ప్రధానంగా పండిస్తున్నారని, పంట విక్రయించేందుకు ఉప మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ సౌకర్యాలు లేక రైతులు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉప మార్కెట్ స్థానంలో శాశ్వత వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని వారి సందర్భంగా డిమాండ్ చేశారు. శాశ్వత మార్కెట్ ఏర్పాటుతో పాటు నిధులు కేటాయించి కార్మికులకు రైతులకు షెడ్లను మరుగుదొడ్లను విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. రైతు పండించిన పంటలు చేతికొస్తున్న తరుణంలో తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందని వారు విమర్శించారు. నష్టపరిహారం తక్షణమే రైతుల ఖాతాల్లో వేయాలని వారు కోరారు. రైతుబంధు నేటికీ రైతు ఖాతాల్లో జమ కాకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. తక్షణమే రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేయాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండిస్తున్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను అందించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, సహాయ కార్యదర్శి నాయిని రాజు, జిల్లా నాయకులు కేచ్చల కల్పన, ఎదుల పురం గోపాల్ రావు, బానోత్ ధర్మ, మాచర్ల సత్యం అమరలపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్ నోపా భాస్కర్, ఈ సంశంకర్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలు వినియోగించుకోవాలి

- కొత్తగూడెం సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెంట్ రంజిత్ కుమార్ చౌదరి




నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజలు పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని కొత్తగూడెం సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెంట్ రంజిత్ కుమార్ చౌదరి కోరారు. తపాలా శాఖ వారోత్సవాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో గల సాటి వారిగూడెం, లోతువాగు, చేతకొండ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌ల పరిధిలో గల గ్రామ ప్రజలకు సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌లలో ఎన్నో పథకాలతో పాటుగా, బీమాకు సంబంధించిన ఎన్నో పాలసీస్ ఉన్నాయని తెలిపారు. ప్రజానీకం వాటి గురించి పూర్తిగా అవగాహనా చేసుకొని, మీ సొమ్ముకు పోస్ట్ ఆఫీస్ నందు పొదుపు చేసుకోవటం ద్వారా, భద్రతతో పాటుగా ఆకర్షణీయ వడ్డీ రేటు పొందవచ్చునని తెలిపారు. పోస్ట్ ఆఫీస్ నందు ఆర్‌డి, ఎస్‌బి, ఎస్ఎస్ఏ, పిపిఎఫ్, కెవిపి, టిడి, ఎస్సీ ఎస్ఎస్, ఎన్ఎస్‌సీ వంటి ఎన్నో పొదుపు పథకాలతో పాటు, పిపిఎల్ఐ, పీఎల్ఐ వంటి బీమా పథకాలు ఉన్నాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్ సీర్ జె.సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకన్న, రామవరం సబ్ ఆఫీస్ పరిధిలో పని చేసే జిడిఎస్ స్టాఫ్ పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ ఆర్థిక స్థితి గతులపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర కార్యక్రమం నిర్వహణ



నవతెలంగాణ -టేకులపల్లి

సింగరేణి సంస్థ ఆర్థిక స్థితి గతులపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కోయగూడెం ఉపరితల గని ఆవరణలో ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్ అధ్యక్షతన ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య హాజరై మాట్లాడారు. లాభాల వాటా పంపిణీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించినట్లు, సింగరేణి వ్యాప్తంగా ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అన్న అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, సింగరేణి ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగు పరుచుకోకపోతే కంపెనీ మనుగడ చాలా కష్టమని, పని సంస్కృతిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి కార్మికులతో పాటు కార్మిక సంఘాలు కూడా సహకరించాలని కోరారు. సింగరేణి కార్మికులు యంత్రాలను పూర్తి సమయం వినియోగించాల్సిన అవసరం ఉందని, లేదంటే సింగరేణి సంస్థ మనుగడ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కలిసి సింగరేణి సంస్థ భవిష్యత్తులో నిర్వహించబోయే నూతన విధానాలపై ఉద్యోగులందరికీ అవగాహనా కలిగించుట కొరకు, బొగ్గు గనులపై ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అనే కార్యక్రమాన్ని నిర్వహించి, ఉద్యోగులకు, ఒప్పంద కార్మికులందరికి సంపక్తి భోజనాలు నిర్వహించాలని, కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు, కార్మికులకు సంస్థ అందించే సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కార్యచరణ (ప్రణాళిక) రూపొందించడం, నూతన గనులు, థర్మల్, సోలార్ విద్యుత్, పంప్ స్టోర్ పవర్ ప్లాంట్, ఇతర వ్యాపార విస్తరణ అంశాలపై ఉద్యోగులకు, పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివ ప్రసాద్, ఏజీఎం(ఐడీ) యం.గిరిధరరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస రావు, మేనేజర్ సౌరబ్ సుమన్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్ రావు, డిజియం సర్వే బాలాజీ నాయుడు, సుధాకర్, మధు బాబు, మహేష్, అంజి రెడ్డి, గుర్తింపు సంఘం డిప్యూటి జనరల్ సెక్రటరీ సారయ్య, ప్రతినిధ్య సంఘం బ్రాంచ్ కార్యదర్శి నాగేశ్వరరావు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వికలాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం

నవతెలంగాణ-పాల్వంచ

కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల ప్రకారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో అర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో జిల్లా నందు నాలుగు రోజులు వికలాంగులకు సహాయ ఉపకరణాలు ఎంపిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎంపిక శిబిరం నిర్వహించారు. ఐడీఓసీ- పాల్వంచ నందు జరిగిన ఎంపిక శిబిరంలో 178 మంది, గుండాల, అశ్వారావుపేట, భద్రాచలం, పాల్వంచ నందు జరిగిన శిబిరాల్లో మొత్తం 447 మంది వికలాంగులను బ్యాటరీ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు, కృత్రిమ అవయవాలు, చంకకర్రలు కోసం ఎంపిక చేశారు. ఈ సహాయ ఉపకరణాలు ఆలింకో నుండి అందిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలింకో సిబ్బంది రష్మి రంజాన్ శెట్టి, అభిషేక్ ద్వివేది, వర ప్రసాద్, నాగేశ్వర రావు, నరేష్, ప్రవీణ్, రూప, అంగన్వాడీ టీచర్లు, వికలాంగులు పాల్గొన్నారు.

పాయంకు కాంట్రాక్ట్ కార్మికులు ఆత్మీయ సత్కారం

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వార్షిక లాభాలలో భాగస్వాములు చేస్తూ వారికి కూడా రూ.5 వేలు ప్రత్యేక ప్రోత్సాహక బోనస్ చెల్లించడం పట్ల పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కి కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. పీకే ఓసీ సెక్షన్ 2లో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి, అనునిత్యం తమకోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తున్న కార్మిక సంఘాలకు, తమకు ఎంతగానో ప్రోత్సహిస్తున్న సింగరేణి కార్మికులకు, కేంద్ర కార్మిక శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి ఎస్ రమేష్, ఏఐటీయూసీ నాయకులు వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య, కాంట్రాక్ట్ కార్మికులు ఉప్పల శివ రామకృష్ణ, రావులపల్లి ముత్తమ్మ, సీత, కళావతి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన రైతు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

వరి పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతు తాచుపాము కాటుకు గురైన ఘటన ఆళ్ళపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అనంతోగు గ్రామానికి చెందిన పొంబోయిన పెద్ద వీరాస్వామి గురువారం రాత్రి పూట తన సొంత వరి పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. పొలానికి నీళ్లు పడుతుండగా తాచు పాము తన ఎడమ కాలుకు కాటేసింది. చుట్టుపక్కల రైతుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆళ్ళపల్లి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రయివేట్ వాహనంలో కుటుంబ సభ్యులు పెద్ద వీరాస్వామిని తీసుకెళ్లారు.

హిందీ ఉపాధ్యాయుడిగా ఆదివాసీ బిడ్డ

నవతెలంగాణ-చంద్రుగొండ



బెండల పాడు గ్రామానికి చెందిన పోడియం భద్రయ్య కుమారుడు పోడియం గణేష్ టీఎస్ డీఎస్సీ 2024లో హైదరాబాదులో లాంగ్వేజ్ పండిత్ హిందీ ఉపాధ్యాయుడిగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. గణేష్ మాట్లాడుతూ మా తండ్రి పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎంతో ఇబ్బంది పడుతూ నన్ను చదివించినందుకు ఈ రోజున మా తండ్రి కళ్ళల్లో ఆనందాన్ని చూశానని, ఎన్నో ఏళ్లగా ఉద్యోగం కోసం నిరంతరం కష్టపడుతూనే ఉన్నా అయినా ఫలితం లేకపోయింది. ఈరోజు నా జీవితానికి ఒక మలుపు నా కుటుంబానికి ఒక భరోసా నా తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందాన్ని చూశాను అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మహిషాసుర మర్ధిని

అన్నపురెడ్డిపల్లి : దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని మండల పరిధిలోని రాజపురం గ్రామంలో మెదర్ బజార్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిదవ రోజు కావడంతో మహిషాసురుడు బొమ్మను తయారు చేసి బాణంతో వధించారు. మహిషాసుర మర్ధిని అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకు అలంకరించిన చీరలను పలువురికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోమయ్య, చెన్నారావు, వెంకటేశ్వర్లు, నందిని, సోని, సంధ్య, నరేష్, సతీష్, కృష్ణప్రసాద్, రవి, పుల్లారావు, రేణుక, త్రివేణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఆళ్ళపల్లి : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు స్థానిక ఎస్సై ఈ.రతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కారుకొండ రామవరం గ్రామానికి చెందిన ముంజ సాయిబాబు, భవాని దంపతులు బతుకుతెరువు కోసం గత నెల 10వ తేదీన మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీన పని ఉంది అని భార్యకు చెప్పి సాయిబాబు సొంతూరికి వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఒకసారి భార్య భావానికి చరవాణిలో తాను జూలూరుపాడులో ఉన్నట్టు సాయిబాబు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత తన సమాచారం గాని, ఆచూకీ గాని బంధువులను సైతం అడిగినా తెలియరాలేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ఆళ్ళపల్లి : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన ఆళ్ళపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చెలగట్టు గ్రామంలో కొమరం సతీష్ అనే వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన గొగ్గెల సంపత్ అనే వ్యక్తి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై మర్కోడు వైపు వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం సతీష్‌ను ఢీకొనడంతో రోడ్డు పక్కన గోతిలో పడి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల సమాచారంతో 108 వాహన సిబ్బంది క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

మావోయిస్టు కమిటీ సభ్యుడు అరెస్ట్

నవతెలంగాణ-చర్ల



నిషేధిత మావోయిస్టు పార్టీకి భద్రాద్రి కొత్తగూడెం సీతారామరాజు డివిజన్ల ఏరియా కమిటీ సభ్యుడును శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ రోహిత్ రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల సమయంలో చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పూసుగుప్ప-చర్ల మార్గమధ్యమంలో సాధారణ తనిఖీలలో భాగంగా చర్ల పోలీసులు విధులు నిర్వహిస్తుండగా పోలీసు వారిని చూసి ఒక వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా అతనిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనిని విచారించగా నిషేధిత మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్లో ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేస్తున్న మడకం కోసయ్య (24) అలియాస్ సుక్రామ్ తండ్రి ఆదయ్య ఇతను కొండవాయి గ్రామం, చర్ల మండలంకు చెందిన వాడని పోలీసులు ధ్రువీకరించారు. ఇతని వద్ద 05 కేజీల బరువు గల ఒక మైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చర్ల పోలీసులతో పాటు 81 బెటాలియన్, 141 బెటాలియన్ సీ కంపెనీ వారు కలిసి ఇతనిని అరెస్ట్ చేయడమైనదని సీఐ రాజు వర్మ వివరించారు.

ఇటీవల జరిగిన పరిణామాల దష్ట్యా దామోదర్, ఆజాద్, చంద్రన్నల ఆదేశాల మేరకు భద్రతా బలగాలపై ప్రతీకారం తీర్చుకోవాలనే దురుద్దేశ్యంతో చర్ల-పూసుగుప్ప మార్గమధ్యంలోని లెనిన్ కాలనీ శివారులో ఉన్న కల్వర్టుకు ల్యాండ్ మైన్‌ను అమర్చుదామని వస్తుండగా పోలీసులు వెంబడించి ఇతనిని అరెస్టు చేయడం జరిగింది. మరొక ఇద్దరు నిందితులు పారిపోయినారని తెలిపారు. పట్టుబడిన నిందితుడు దాదాపు 50కు పైగా హింసాత్మక సంఘటనలో పాల్గొన్నాడని, ఇతనిపై రూ.4 లక్షల రూపాయల రివార్డ్ ఉందని తెలిపారు. నిషేధిత సీపీఐ మావోయిస్ట్ పార్టీకి ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని సహకరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ రాజు వర్మ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర ప్రజలకు, కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖ:సంతోషాలతో ఉండాలని, పండుగను ఐకమత్యంతో జరుపుకొని మతసామరస్యాన్ని చాటాలన్నారు. దసరా సందర్భంగా జమ్మి పూజలు జరిగే ప్రాంతాల్లో మున్సిపల్, గ్రామ పంచాయతీ శాఖలు ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా గాట్లు, బస్తీ, గ్రామ సెంటర్లలో ఏర్పాట్ల పట్ల మున్సిపల్, గ్రామ పంచాయతీ శాఖల అధికారులను, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీలను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో దసర ఉత్సవాలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా

నవతెలంగాణ-దుమ్ముగూడెం



లౌకిక వాదానికి భిన్నంగా కొన్ని రాజకీయ పార్టీలు మతోన్మాదాన్ని ప్రోత్సహించడం వలన దేశానికి ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కె.వీరభద్రాపురం శాఖ మహాసభ పూసం వెంకన్న బాబు అధ్యక్షతన సీతారాం ఏచూరి నగర్‌లో తుర్రం ఊరయ్య ప్రాంగణంలో ఘనంగా జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా మచ్చా పతావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తుండగా కమ్యూనిస్టు చైనా ప్రభుత్వం శాంతి స్థాపనకు కృషి చేస్తుందన్నారు. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాలను అమెరికా ప్రోత్సహిస్తుందని విమర్శించారు. లౌకిక రాజ్యంగా ఉన్న మన దేశానికి బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అంటగడుతుందని, దీనివల్ల భారత పౌరులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. యూపీఏ వన్ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు మద్దతు పలికారని, ఆ సమయంలో దేశంలోని పేద ప్రజలకు ఉపయోగపడే అనేక చట్టాలు వచ్చాయని అన్నారు. అందులో ఉపాధి హామీ పథకం చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, కార్మికుల చట్టాలు వచ్చాయని అన్నారు. ఆ సమయంలో ఏ ఒక్క మంత్రిపై అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. యూపీఏ 2 ప్రభుత్వంలో కమ్యూనిస్టుల ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఫలితంగా అనేకమంది మంత్రులు అవినీతితో జైలుకు వెళ్లారన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సీతారాం ఏచూరి జాతీయ స్థాయిలోకి లౌకిక పార్టీలను జాతీయ స్థాయిలో ఐక్యం చేసి తిప్పి కొట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చుతుందని, ఈ చర్యలను సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిందని కానీ ప్రస్తుతం కేసీఆర్ చేసిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా పి.అచ్చిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, పి.వెంకన్న బాబు, కాక బుచ్చిరాజు, ఆల రమేష్, పి.శివరామకృష్ణ, ఇస్తారయ్య, కనితి రాజమ్మ, పూసం రంగమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కేంద్రం ప్రారంభం

- ముమ్మర ఏర్పాట్లులో అధికారులు
- పర్యవేక్షించిన ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో పరిశ్రమ విద్యుత్ అవసరాలు నిమిత్తం రూ.36 కోట్లు వ్యయంతో నిర్మించిన 2.5 మెగా వాట్‌లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం లాంచనంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లుతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు హాజరుకానున్నారు. ఈ క్రమంలో భారీగా రైతులను సమీకరించి ఆయిల్ ఫాం సాగు పై అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం గత వారం రోజులుగా భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఏర్పాట్లను ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి గత రెండు రోజులుగా ఇక్కడే మకాం వేసి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులను శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ కరుణాకర్, ఎస్‌హెచ్ఓ యయాతి రాజులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డీవో బాలక్రిష్ణ, మేనేజర్‌లు నాగబాబు, కళ్యాణ్ గౌడ్‌లు పాల్గొన్నారు.

సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు సమిష్టిగా శ్రమించాలి

- తెలంగాణకు తలమానికమైన సంస్థను అభివృద్ధివైపు నడిపిద్దాం
- కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టి సారించాలి
- "ఉజ్వల సింగరేణి-కార్మికుల పాత్ర" కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ పురోభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమిష్టిగా శ్రమించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేట్ హెడ్డాఫీస్, భూగర్భ గనులు, ఉపరితల గనులు, అనుబంధ విభాగాల్లో శుక్రవారం నిర్వహించిన 'ఉజ్వల సింగరేణి కార్మికుల పాత్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు మాత్రమే పరిమితమై తెలంగాణ రాష్ట్రానికి తలమానికమైన సింగరేణి సంస్థను మరింత అభివృద్ధివైపు నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని, కార్మికుల కష్టార్జితాన్ని అప్పనంగా దోచుకొని తమ ఖజానాను నింపుకుందని, సీఎస్ఆర్ నిధులు కోల్ బెల్ట్ ప్రాంతాల అభివృద్ధి కోసం కాకుండా మంత్రుల నియోజకవర్గాలకు మళ్ళించుకొని అన్యాయం చేశారని, మితిమీరిన రాజకీయ జోక్యంతో సంస్థను భ్రష్టుపట్టించారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ఒకపూట భోజనం, ఒక స్వీట్ బాక్సుతో కార్మికులు, ఉద్యోగులు సంతృప్తి చెందరని, వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతపైనే దృష్టిపెడితే సరిపోదని కార్మికులు, కార్మిక కుటుంబాలకు, కార్మిక వాడలకు కావాల్సిన సదుపాయాలు, చట్టపరమైన హక్కులు కల్పించి ఆరోగ్యవంతమైన అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్మికుల సంక్షేమంపై యాజ మాన్యం, ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్మికులకు, కార్మిక కుటుంబాలని, ఉద్యోగు లకు, అధికారులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ భద్రాద్రి జిల్లా గౌరవ అధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, గుర్తింపు సంఘం నాయకులు కె.రాజ్ కుమార్, దమ్మాలపాటి శేషయ్య వంగ వెంకట్, జి.వీరాస్వామి, మల్లి ఖార్జునరావు, ఎస్ వి.రమణమూర్తి, సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు, ఏరియా జీఎం, పాల్గొన్నారు.

గీతకార్మికుల రక్షణ కోసమే 'కాటమయ్య రక్షణ కిట్లు'

- రద్దు చేసిన సొసైటీలను పునరుద్ధరించాలి
- వనాల పెంపకానికి ప్రత్యామ్నాయం స్థలాలు కెటాయించాలి
- శాసనసభ సభ్యులు కూనంనేని
- రూ.3.50లక్షల విలువచేసే కిట్లను గీతకార్మికులకు అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కొత్తగూడెం



విధి నిర్వహణలో గీత కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేస్తోందని, ప్రతి కార్మికుడు కిట్ల పంపిణీని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 25 మంది శిక్షణ పూర్తిచేసుకున్న లబ్దిదారులకు మంజూరైన రూ.3.50 లక్షల విలువచేసే కాటమయ్య కిట్లను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కల్లుగీత సోసియేటీలను అప్పటి ప్రభుత్వం రద్దు చేసిందని, దీంతో కార్మికులకు ఎక్సయిజ్ శాఖా నుంచి గుర్తింపు కార్డు జారీ అయ్యే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల బీమా, పరిహారం, ఇతర సంక్షేమ పథకాలను కార్మికులు అందుకోలేక అర్హత కోల్పోతున్నారన్నారు. తక్షణమే రద్దు చేసిన సొసైటీలను పునరుద్దరించాలని, సొసైటీలతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు. సింగరేణి ప్రాజెక్టులు, నీటి ప్రాజెక్టులతో చెట్లను కోల్పోతున్న కుటుంబాలకు, సొసైటీలకు వనాల పెంపకానికి జీవో 560 ప్రకారం ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాటమయ్య రక్షణ కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఇ.ఇందిర, ఎక్సైజ్ సీఐ జయశ్రీ, గీతకార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, సాంబయ్య, నర్సింహారావు, లగడపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రావణ దహన కార్యక్రమం

- ఏజెన్సీలో మొట్టమొదటిసారి

నవతెలంగాణ-చర్ల





నేడు దసరా సందర్భంగా చర్ల చరిత్రలో కని విని ఎరుగని అద్భుతం కార్యక్రమాన్ని ఉమా రామలింగేశ్వర ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. దసరా పండుగ రోజు రావణ దహనం కార్యక్రమం, ఆత్రేయపురం దగ్గర ఇచ్చిలి గ్రామం వారిచే బాణాసంచా విన్యాసాలు నిర్వహించనున్నారు. చర్ల శివాలయం చరిత్రలో మహా శివరాత్రి రోజు మొట్టమొదటిసారిగా ఈ సంవత్సరం ప్రభను ఊరేగించారు. భక్తులందరి సహకారంతో విజయవంతం కాగా దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఇప్పుడు ఈ సంవత్సరం దసరా పండగ రోజు రావణ దహనం కార్యక్రమం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సహకరించినందుకు శివాలయం కమిటీ తరపున మీకు మండల ప్రజలందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరినీ ఆహ్వానించి ఈ రావణ దహనం, బాణాసంచా విన్యాసాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వీరలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనం

- నేడు మహాలక్ష్మి అలంకారంతో ముగియనున్న అవతారాలు
- దసరా మండపం వద్ద రామ్ లీలా మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- నేడే భద్రాద్రి రామయ్యకు మహా పట్టాభిషేకం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయ ఆవరణలో కొలువుతీరి ఉన్న లక్ష్మీ తాయారు అమ్మవారు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు అయిన శుక్రవారం వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని దర్శించుకుంటే సకల కలలు సాకారం అవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం కాగా అమ్మవారి కోవెల ముందు మహిళా భక్తులు ప్రత్యేక సామూహిక కుంకుమ పూజను ఆచరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రోజక అలంకారంలో దర్శనమిస్తున్న లక్ష్మీ తయార్ అమ్మవారి కోవెలను పుష్పాలతో విద్యుత్ దీపాలంతో ప్రత్యేకంగా ఆలయ అధికారులు అలంకరించారు.

నేటితో ముగియనున్న అమ్మవారి అవతారాలు

శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు నేడు మహాలక్ష్మి అలంకారంతో ముగియనున్నాయి. ఈనెల నాలుగో తారీఖున ఆదిలక్ష్మి అలంకారంతో ప్రారంభమైన శరణ నవరాత్రి అమ్మవారి అవతారాలు నేడు మహాలక్ష్మి అలంకారంతో ముగియనుండగా తొమ్మిది రోజులపాటు పారాయణం ప్రత్యేక కుంకుమ పూజలతో పాటు లక్ష్మీ అమ్మవారికి అభిషేకం విశేష దర్బార్ సేవ రామాయణ ప్రవచనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైద్యక సిబ్బంది నిర్వహించిన విషయం తెలిసిందే. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కావడంతో రాష్ట్ర నలుమూల నుండి భక్తులు తరలివచ్చి భద్రాద్రి రామయ్య దర్శనంతో పాటు లక్ష్మీ తాయారు అమ్మవారి అవతారాలను దర్శించుకున్నారు. గురువారం సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆలయ మహిళా ఉద్యోగులచే నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలలో ఆలయ ఈవో ఎల్.రమాదేవి స్వయంగా పాల్గొని తోటి ఉద్యోగులతో కలిసి ఆడి పాడి ఉత్సాహపరిచారు. బతుకమ్మ ప్రత్యేకతను ఆలయ ఈవో రమాదేవి తెలియజేయడంతో పాటు కోలాటాలతో ఊరేగింపుగా బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని కూడా వైభవంగా నిర్వహించారు.

నేడు శ్రీరామ లీల మహోత్సవం

ఆలయ ఈవో ఎల్.రమాదేవి

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విజయదశమి నాడు పట్టణంలోని భక్త రామదాసు నిర్మించిన దసరా మండపం వద్ద శమీ పూజ శ్రీ రామ్ లీలా మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఉదయం 11 గంటల 30 నిమిషాలకు చిత్రకోట మండపంలోని శ్రీ రామాయణ పారాయణా సమాప్తిని పురస్కరించుకొని శ్రీ రామ మహా పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారని ఆమె తెలిపారు. అనంతరం రామానుడిపై రాముడు సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ విజయదశమి నాడు శ్రీరాం లీలా మహోత్సవాన్ని శమీ పూజను సైతం దసరా మండపం వద్ద ఆలయ సంప్రదాయపద్ధంగా నెరవేస్తున్నామని ఈవో రమాదేవి స్పష్టం చేశారు.

బాబా వారి స్వర్ణ సింహాసనంనకు రూ.లక్ష విరాళం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరంనకు సాయిబాబా భక్తులు రూ.లక్ష విరాళంను ఆలయ అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తికి శుక్రవారం అందజేశారు. శ్రీ సాయిబాబా వారికి చేయించ తలపెట్టిన బంగారు పూతతో స్వర్ణ సింహాసనంనకు పోకూరి పావని తన మాతృమూర్తితో కలిసి లక్ష విరాళం అందించారు. విరాళం అందించిన దాతను శాలువాతో సత్కరించి బాబా వారి రసీదు అందజేశారు. వారికి అర్చకులు గోత్రనామాలతో అర్చన జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుంచాల రమేష్, సభ్యులు మందరపు నాగరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయం అయిన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవములలో భాగంగా 8వ రోజు శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీరంగమ్ వెంకటాచార్యులు, ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజలు, పోలీసులకు విజయదశమి శుభాకాంక్షలు : ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఎస్పీ రోహిత్ రాజు జిల్లా ప్రజలకు పోలీసు అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ చివరికి మంచితనమే గెలుస్తుందని అన్నారు. ఈ దసరా పండుగను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నాగేంద్రబాబుని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండలం, కాకర్ల గ్రామంలో అన్నపురెడ్డి నాగేంద్రబాబుని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు), ముత్తినేని గోపి, కిరణ్ కుమార్, రామకృష్ణ తదితరులు పరామర్శించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | అక్టోబర్ 12, 2024 | www.navatelangana.com



వైభవోపేతంగా శ్రీ చక్ర, రాజగోపుర కలశ ప్రతిష్ఠ

- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,

రాష్ట్ర ఇరిగేషన్ ఛైర్మెన్ మువ్వా విజయ్‌బాబు,

ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని నాచారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ జగదాంబ సమేత జయలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తజనసందోహం మధ్య వేద మంత్రాల నడుమ ఎంతో వైభవోపేతంగా శ్రీ చక్ర ప్రతిష్ఠ, రాజగోపుర కలశ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. అదే విధంగా శ్రీ జగదాంబ శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని అమ్మవారు భక్తులకు మహిషాసురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చారు. కాగా ఆలయంలో గణపతి పూజ, గణపతిపూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి చతుష్షోపచార పూజ, సామూహిక కుంకుమార్చన, గణపతిహోమం, చండీహోమం, రుద్రహోమం, సహస్రనామ స్తోత్ర పారాయణం, చండీరాయణ, నీరాజన మంత్రపుష్పములు తదితర కార్యక్రమాలు జరిగాయి. ఇదిలా ఉండగా జగదాంబ సన్నిధిలో ఉదయం గం.8.09 నిమిషాలకు ఆలయంలో శ్రీ చక్ర ప్రతిష్ఠ, రాజగోపుర కలశ ప్రతిష్ఠ వేడుకలు ఎంతో వైభవోపేతంగా జరిగాయి.

ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల

నాచారం శ్రీ జగదాంబ సమేత జయ లింగేశ్వర స్వామి దేవాలయలో జరుగుతున్న శ్రీ చక్ర రాజగోపుర కలశ ప్రతిష్ఠ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ, కోఆపరేటివ్ టెక్స్‌టైల్స్ అండ్ హాండ్లూమ్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రాష్ట్ర ఇరిగేషన్ సంస్థ ఛైర్మెన్ మువ్వా విజయ్‌బాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణలు పాల్గొన్నారు. కాగా ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు కలిసి వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో తుమ్మల నాగేశ్వరావు, విజయ్‌బాబు, రాగమయి, జారెలు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేషవస్త్రాలతో ప్రజా ప్రతినిధులను సత్కరించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే జారె గోపురం మీద శ్రీ చక్ర రాజగోపుర కలశ ప్రతిష్ఠ వేడుకల్లో స్వయంగా పాల్గొని ఆయన చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. ఈ క్రమంలో వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మంత్రి తుమ్మలకు పున:ప్రతిష్ఠ శంకుస్థాపన ఆహ్వానం

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆంజనేయస్వామి గుడి పున:ప్రతిష్ఠ శంకుస్థాపన ఆహ్వాన పత్రికను నిర్వాహకులు అందజేశారు. ఈనెల 13న సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పున:ప్రతిష్ఠ శంకుస్థాపన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని గండుగులపల్లిలో తుమ్మలను దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాలు నేటి ఆధునిక దేవాలయాలు

- నిరుద్యోగులకు సువర్ణ అవకాశం

- సెల్ ఫోన్ కన్నా పుస్తక పఠనం మిన్న

- పినపాక శాసనసభ్యులు పాయ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మణుగూరు



గ్రంథాలయాలు నేటి సమాజానికి ఆధునిక దేవాలయాలుగా ఉపయోగ పడాలని, నిరుద్యోగులు ఉద్యోగులు సంపాదించుకోవడం కోసం సువర్ణ అవకాశంగా ఉపయోగించుకోవాలని పినపాక శాసన సభ్యులు పాయ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మణుగూరు తహసీల్దార్ చొరవతో గ్రంథాలయ శాఖను వెంటనే ప్రారంభించామని ఆయన అన్నారు కలెక్టర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో శాఖ నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, ఇక్కడ ఉన్న చారిత్రాత్మక పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులు యువకులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి మండల వైద్యాధికారిగా సంఘమిత్ర నియామకం

- సన్మానించిన 108 వాహన సిబ్బంది

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న కె.వి. సంఘమిత్రను మండల వైద్యాధికారిగా నియమిస్తూ.. డీఎంహెచ్ఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మండల వైద్యాధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక 108 వాహన సిబ్బంది ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 108 వాహనం పైలట్ లు పరమ సునీల్ కుమార్, శ్రీహర్ష ఇఎంటి ప్రేమలత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష

నవతెలంగాణ-కారేపల్లి



మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కేంద్రాల ఇంచార్జీలు, వ్యవసాయాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల స్పెషల్ ఆఫీసర్ కే.నవీన్‌బాబు మాట్లాడుతూ కారేపల్లి మండలంలో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో విశ్వనాధపల్లి, సీతారాంపురం, ఐకేపీ ఆధ్వర్యంలో కారేపల్లి, మాధారం, మాణిక్యారం లలో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రాల ఏర్పాటుకు ఇప్పటికే స్థలాల గుర్తింపు జరిగిందన్నారు. కేంద్రాల వద్ద మౌళిక వసతులు కల్పించాలని ఇంచార్జీలను ఆదేశించారు. కేంద్రాల నిర్వాహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల మోనిటరింగ్ టీమ్ పర్యవేక్షిస్తుందన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఏవో బీ.అశోక్‌కుమార్, ఎంపీవో రవిప్రసాద్. సొసైటీ సీఈవో బొల్లు హనుమంతరావు, ఏఈవో, సీసీలు, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు నిక్షేపాలు తగ్గినా... ఆదాయ మార్గాలపై దృష్టి

- సింగరేణి సంస్థకు ఉజ్వల భవిషత్తు
- రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది
- సింగరేణి ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్

నవతెలంగాణ-సత్తుపల్లి



భవిష్యత్తులో బొగ్గు నిక్షేపాలు తగ్గినా ఇతర ఆదాయ మార్గాలపై సింగరేణి సంస్థ దృష్టి సారించనుందని ఆ సంస్థ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అంశంపై జరిగిన సభలో బలరాం నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చాలా దేశాల్లో బొగ్గు వెలికితీత కార్యక్రమాలను నిలిపి వేస్తున్నారన్నారు. మనప్రాంతం బొగ్గు రవాణాకు అనుకూలంగా ఉన్న క్రమంలో మన బొగ్గుకు చుట్టపక్కల ప్రాంతాల నుంచి డిమాండ్ ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికుల కృషితో బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామన్నారు. సింగరేణికి ఉన్న గనుల్లో సత్తుపల్లి గనులకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులు కిందస్థాయి నుంచి ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. సంస్థ ఎదుగుదలతోనే కార్మికుల మనుగడ ఆధారపడి ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు వెళ్లినవారు సైతం మళ్లీ వచ్చి సింగరేణిలో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. సింగరేణి 100యేండ్లకు సరిపడా ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తుందన్నారు. సత్తుపల్లిలో బొగ్గు లోడింగ్‌లకు సరిపడా రవాణాను అందించడం జరుగుతుందని సీఎండీ తెలిపారు. దుమ్మూధూళి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం జరుగుతుందన్నారు. సత్తుపల్లిలో ప్రత్యేకంగా జీఎం కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి మూడు నెలల్లో భవన నిర్మాణ పనులను పూర్తిచేసి సెపరేట్‌గా జీఎంను నియమించడం జరుగుతుందన్నారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి కోసం సహకారం అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఓ 40వేల మొక్కలను అందించడంతో పాటు ఇక్కడి గనుల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలను కల్పించాలన్నారు. బొగ్గు లోడింగ్‌ను పెంచాలన్నారు. ఈ సభలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలేంరాజు, జేవీఆర్, కిష్టారం ఓసీల పీవోలు ప్రహ్లాద్, మునగంటి వేదాద్రి నరసింహారావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు రజాక్, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి పాల్గొన్నారు.

సన్న రకాల ధాన్యానికి రూ.500 బోనస్‌పై అవగాహన



నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తుందని, రైతులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని అధికారులు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు పై కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జీలు, సొసైటీ సీఈఓలకు, ఏఈఓలకు, అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అధికారి ఎం.రూప మాట్లాడుతూ మండలంలో సుమారు 29 కొనుగోలు కేంద్రంలో ఉన్నాయని ఆ కొనుగోలు కేంద్రాల్లో ఇన్చార్జిలుగా పని చేసేవారు రైతులకు ధాన్యం అమ్ముకునే విషయంలో అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతులకు సివిల్ సప్లై నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మితే వారికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ గా ఇస్తుందన్నారు. వరి కోతలు నవంబర్ నెల చివరి నుండి డిసెంబర్ మొదట్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని ముందస్తుగానే రైతులకు కొనుగోలు కేంద్రాలు వివరాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ నిఘా ఉంటుందన్నారు. డి చంద్రశేఖర్, ఎంపీఇవో ఏనుగు సురేష్, ఏపీఎం మాదాసు వెంకట రామారావు, పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, సొసైటీ సీఈఓలు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభించిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-కల్లూరు



పట్టణ పరిధిలోని పుల్లయ్య బంజర రోడ్‌లో అమ్మవారి నవరాత్రులు సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. కమిటీ వారి ఆహ్వానం మేరకు దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయకుమార్, ఏఎంసీ ఛైర్మెన్ భాగం నీరజదేవి, సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావులను ఈ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సముద్రాల పుల్లారావు, చిత్తలూరు నరేష్, వేముల శ్రీనివాస్, గంగవరపు పుల్లారావు, చిరుమామిళ్ల కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, ఫోట్రూ సత్యం, దిరిశాల నరసింహారావు, బొప్పన శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన దేవి విగ్రహాలు వద్ద మహిళలకు కొర్లగూడెం సొసైటీ ఛైర్మెన్ కీసర వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి చీరలు పంపిణీ చేశారు. సుద్దులు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా రాధాకృష్ణమూర్తి రోడ్లో ఏర్పాటు చేసిన కోలాట దళానికి కాంగ్రెస్ నాయకులు లక్కినేని రమేష్ చీరలు అందించగా మాజీ వార్డు సభ్యుడు అప్రోచ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు నిర్వహించ బడుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం అమ్మ వారిని మహి షాసుర మర్ధిని అవతారంలో అంగరంగ వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శ నం కల్పించారు.వేకువ జాము నుండి నిత్య పూజ కా ర్యక్రమములు నిర్వహించారు. అనంతరం సామూహి క చండీ హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకులు విజయకుమారి, ప్రధాన అర్చ కులు ఉప్పల శ్రీనివాస శర్మ, ముఖ్య అర్చకులు మురళీ మోహన్ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు గౌసుద్దీన్ కానుక

నవతెలంగాణ-కారేపల్లి



నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్ శుక్రవారం చీరలను దసరా కానుకగా అందించారు. కారేపల్లిలో 50 కుటుంబాలకు చెందిన మహిళలకు గౌసుద్దీన్ చీరలను పంపిణి చేశారు. ఈసందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ పేదలు పండుగను సంబురంగా జరుపుకోవాలనే ఆకాంక్షతో చీరలను అందజేస్తున్నట్లు తెలిపారు. కానుకలు అందించిన గౌసుద్దీన్‌కు గ్రామస్తులు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగరబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి బెల్గావి రైలు పునరుద్ధరణ

నవతెలంగాణ-కారేపల్లి

బెల్గావి-మణుగూర్ రైలును ఈనెల 16 పునరుద్ధిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. పండుగలను దృష్టిలో ఉంచుకోని స్పెషల్ ట్రైన్‌గా బెల్గావి ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 16వ తేది నుండి 2025 మార్చి 30వ తేది వరకు వారానికి నాల్గు రోజులు రైలు నడపటం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు. సోమ, గురు, ఆది, బుధ వారాల్లో మణుగూరు నుండి బెల్గావికి, ఆది, బుధ, శని, మంగళ వారాలల్లో బెల్గావీ నుండి మణుగూరు నడవనుంది. బెల్గావీ ఎక్స్‌ప్రెస్‌ఖమ్మం జిల్లాలో కేవలం గాంధీపురం స్టేజీలో మాత్రమే హాల్ట్ ఉంది.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ-మధిర

మధిర లడక్ బజార్ దేశభక్త యువజన సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దిని దేవి అవతారంలో ఉదయం కాల పూజలు అందుకున్నారు. తదనంతరం అమ్మవారి సన్నిధిలో మహా చండీ హోమం నిర్వహించారు. ఈ హోమ కార్యక్రమాన్ని గుంటూరు రమణారావు సుమలత దంపతులు, కాకాని శ్రీనివాసరావు రజిని దంపతులు, కిడాంబి ఋషికేశ్ శ్రీలక్ష్మి దంపతులు ఈ హోమ క్రతువు నిర్వహించారు.

జాతీయ ఫుట్‌బాల్‌కి ఎంపికైన యువవర్షినికి సన్మానం

నవతెలంగాణ-ముదిగొండ



మెదక్ జిల్లా స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్బాల్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభా కనబరిచి జాతీయ స్థాయి ఫుట్బాల్ ఛాంపియన్ షిప్‌కు మేడేపల్లి హైస్కూల్ విద్యార్థిని యువవర్షిని ఎంపికయ్యారు. మేడేపల్లి ప్రజల ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా జరుపుకుంటున్న సద్దుల బతుకమ్మ వేడుకలో క్రీడాకారిని యువవర్షిణి, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచ్ సామినేని రమేష్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ యువవర్షిణికి రూ.3,116 అందజేయగా, మడుపల్లి రాఘవ రూ.1000 వితరణ చేశారు. పేదరికంలో నుండి ఈగ్రామ ప్రతిష్ఠను జాతీయస్థాయికి తీసుకెళ్లడంలో విద్యార్థిని పట్టుదల ఆసక్తిని పట్టి పిడి కృష్ణయ్య విద్యార్థులను క్రీడల్లో మంచి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారని ఎంపీపీ తెలిపారు. జాతీయస్థాయి క్రీడల్లో ముందుకెళుతున్న ప్రతి ఒక్కరికి,గ్రామం తరపున ఆర్థిక సహకారం, ప్రోత్సాహం ఉంటుందని ఆయన తెలిపారు. యువవర్షిని మాట్లాడుతూ నాఆశ, నాసంకల్పం జాతీయ క్రీడల్లో రాణించాలని, ఆరీతిగా నన్ను ప్రోత్సహించి శిక్షణ ఇచ్చి, నేను జాతీయస్థాయికి ఎంపిక కావడం వెనక కోచ్ ఆదర్శ్, పిడి కృష్ణయ్య ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు జూలకంటి సంజీవరెడ్డి, పోటు ప్రసాద్, సామినేని రాము గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం

నవతెలంగాణ-కూసుమంచి

మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీదేవి శరన్న నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గౌడ్ సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంద రాంబాబు గౌడ్, మంద శేఖర్‌గౌడ్, మంద ప్రసాద్‌గౌడ్, మంద నాగులు గౌడ్, మంద నాగేశ్వరరావు గౌడ్, మంద పెద్ద వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో ఏర్పాట్లకు కార్యదర్శుల నియామకం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మ తల్లి జాతరలో ఏర్పాట్లకు 5 కార్యదర్శులను నియమిస్తూ ఎంపీడీవో రమేష్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుట్టకిందిగుంపు, పోలంపల్లి, భజ్యాతండా, రావోజీతండా, పేరుపల్లి పంచాయతీ కార్యదర్శులైన డీ.నారాయణరావు, వీ.రవికుమార్, ఎం. వెంకటేష్, టీ.పవన్‌కుమార్‌ల, వై.సురేష్‌లు జాతరలో వసతుల కల్పనకు ప్రత్యేక అధికారులుగా ఎంపీడీవో నియమించారు. జాతరలో భక్తులకు త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం ఇతర వసతుల కల్పనకు కార్యదర్శులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. జాతరలో 5 పంచాయతీలకు చెందిన ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు, డ్రైవర్లు, మల్టిపర్పస్ వర్కర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఇంచార్జీలుగా నియమితులైన కార్యదర్శులకు సూచించారు.

యువత అంటే సినిమాలు, షికారులు, సరదాలు, జలసాలు మాత్రమే కాదు.. కుటుంబంలో బాధ్యతగా వ్యవహరిస్తూనే సామాజిక సేవలో ముందుంటూ రాజకీయాలలో సైతం తన మార్కు చూపిస్తూ యూత్ ఐకాన్ గా నిలుస్తున్న కలిగినేడి వినోద్ పై నవతెలంగాణ ప్రత్యేక కథనం..

యూత్ ఐకాన్ కలిగినేడి వినోద్

చిన్న వయసు నుండే సామాజిక సేవతోపాటు.. రాజకీయాలలో రాణింపు





- 150 మంది యువకులతో "పొంగులేటి" సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన "పొదెం" వీర అభిమాని

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

చిన్న వయసు నుండే తన ముందుతరం చూపిన బాటలో పయనిస్తూ ఇటు వ్యాపారంలో రాణిస్తూ సంపాదించిన దాంట్లో ఎంతో కొంత తోటి వారికి ఉపయోగపడాలని లక్ష్యంతో అనేక రూపాలలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కలిగినేడి వినోద్ నేటి యువతకి ఐకాన్‌గా నిలుస్తున్నారు. పట్టణంలోని పాత మార్కెట్లో కూరగాయల వ్యాపార బాధ్యతలు నిర్వహిస్తూనే అవకాశం ఉన్న మేరకు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారు. పట్టణంలో వినాయక చవితి, శ్రీదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఏ మూలన అన్నదాన కార్యక్రమం జరిగిన అందులో కచ్చితంగా వినోద్ సహకారం ఎంతోకొంత ఉంటుంది. ప్రత్యేకమైన రోజులలో తాను రక్తదానం వంటి కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా, తన తోటి స్నేహితులతో కూడా రక్త దానాలు చేపించి బాధ్యతగల యువకుడిగా గుర్తింపు పొందుతున్నాడు. కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలలో కీలక బాధ్యతలలో వ్యవహరిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయడంతో పాటు అట్టహాసంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఒక ప్రత్యేక స్థానంలో నిలబడటంలో వినోద్ పాత్ర మరువ లేనిది. అంతేకాకుండా భద్రాచలం నియోజవర్గ ఆదివాసీ గ్రామాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆ బాధితులకు అండగా నిలుస్తున్నారు. వరదల సమయంలో కూడా బాధితులకు నిత్యావసర వస్తువులు తోపాటు పునరావాస కేంద్రాలలోని బాధితులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

అవకాశం ఉన్న మేరకు సేవా కార్యక్రమాలు : వినోద్

మా తాతయ్య మా తండ్రి వ్యాపారాలలో రాణిస్తూనే తన చుట్టూ ఉన్న వారికి కూడా ఎంతో కొంత సహాయం చేయాలన లక్ష్యంతో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. వారి ఆలోచనలు భాగంగానే గత పది సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. ఏజెన్సీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలలో ఇల్లు కూలిపోయిన పేదలకు నిత్యావసర వస్తువులు అందించడంతోపాటు ఎంతో కొంత ఆర్థిక సహాయం అందించాను. అంతేకాకుండా పట్టణంలో జూలై, ఆగస్టు నెలలో వచ్చే వరదల సందర్భంగా ఆ బాధితులకు కూడా ఏదో ఒక రూపాన సహాయ సహకారాలను అందిస్తూనే ఉన్నాం. అటవీ శాఖ కార్పొరేషన్ డెవలప్మెంట్ ఛైర్మెన్ వీరయ్య ఆశీస్సులతో ఉమ్మడి జిల్లా మంత్రులైన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసేందుకు నాకు సాధ్యమైనంత వరకు కృషి చేస్తాను.

రాజకీయాలలో ప్రత్యేకతను చాటుకుంటూ..

సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుంటున్న వినోద్‌ను ఎంతోమంది రాజకీయ నాయకులు ప్రత్యక్షంగా పరోక్షంగా రాజకీయాలలోకి ఆహ్వానించారు. అయినప్పటికీ స్వార్ధ రాజకీయాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తాను మొదటి నుండి అభిమానించే పొదెం వీరయ్య సూచనలతో 150 మంది యువకులతో కలిసి భారీ కాన్వాయితో ఖమ్మం తరలివెళ్లి రాష్ట్ర మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేర్చి తన ప్రత్యేకతను చాటారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూనే యువజన విభాగాన్ని అభివృద్ధి చేస్తూ పార్టీ బలోపేతం కోసం చాప కింద నీరులా పనిచేస్తున్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్ నిలువుదోపిడీ

పండుగ వేళ సొంతూర్లకు వెళ్లేవారి నడ్డివిరుస్తున్న వైనం

- ఇష్టానుసారం ధరలు పెంచి వసూళ్లు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆపరేటర్ల పై ఆర్టీఏ ఫోకస్
- ఐదు బస్సులపై కేసులు నమోదు.. రూ.పదివేల జరిమానా
- ఈనెల 16 వరకు కొనసాగనున్న ఆర్టీఏ దాడులు





నవతెలంగాణ-సిటీబ్యూరో

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటు న్నాయి. రెండు మూడింతలు చార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను అడ్డగోలుగా దోచుకుంటున్నాయి. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు సొంతూర్లకు వెళ్లాలని ప్రజల కోరిక.. కానీ సరిపడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయివేటు దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పండుగకు నాలుగైదు రోజులకు ముందు నుంచే టికెట్ల ధరలను ఎడాపెడా పెంచేసి సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇలాంటి వాళ్లకు చెక్‌పెట్టేందుకు రవాణాశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దింపింది. నగరంలోని వివిధ రూట్లతో పాటు ప్రధాన హైవేలో ఈ బృందాలతో ప్రత్యేక తనిఖీలు చేపడుతోంది. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ట్రావెల్స్ బస్సులపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు.

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ ఆదేశాల మేరకు ఆర్టీఏ అధికారులు రెండు రోజులుగా నగరంలోని వివిధ రూట్లలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్‌పై కేసులు నమోదు చేయాలనీ, అవసరమైతే సీజ్ చేయడం, కంపౌండింగ్ ఫీజు వసూలు చేయడం వంటి చర్యలు చేపట్టాలని జేటీసీ ఆదేశించారు.

కాగా దసరాకు హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలు, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు 900కుపైగా ప్రయివేటు బస్సులు నడుస్తుంటాయి. ఇందులో ప్రధానంగా పర్మిట్ ఉల్లంఘనలు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక యంత్రాల్లేని బస్సులు, కమర్షియల్ గూడ్స్ మోసుకెళ్లే బస్సులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. వీటితోపాటు పండుగ సమయాల్లో అధిక టికెట్ చార్జీల వడ్డెన లేకుండా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేలా రవాణాశాఖ చర్యలు తీసుకుంటుంది.

ఐదు బస్సులు సీజ్.. రూ. 10వేల జరిమానా

రెండు రోజులుగా ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా దసరా సందర్భంగా ఇష్టానుసారంగా చార్జీలు వసూలు చేయడంపై దృష్టిసారిస్తున్నారు. అలాగే బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉందా? లేదా చెక్ చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ గూడ్స్ క్యారీ చేస్తున్న ట్రావెల్స్‌పై పెనాల్టీలు వేస్తున్నారు. నగరంలోని ప్రధాన రూట్లతో పాటు జాతీయ రహదారులపై ఆర్టీఏ అధికారులు దాడులు చేపడు తున్నారు. తిరుమలగిరి, మలక్‌పేట్, బండ్లగూడ, ఉప్పల్, మన్నేగూడ ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్స్, హెూంగార్డులతో కలిసి తనిఖీలు చేపట్టి దాదాపు ఐదు సీసీ బస్సులపై కేసులు నమోదు చేసి.. రూ.పదివేల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. పండుగ వేళ టీఎస్ఆర్టీసీ వసూలు చేస్తున్నట్టుగానే చార్జీలు తీసుకోవాలని, వ్యాలిడ్ పర్మిట్లు, ఫిట్‌నెస్, పరిమితికి మించకుండా ప్రయాణికులను తీసుకువెళ్లాలని, ఫస్ట్ ఏయిడ్ బాక్స్, అగ్నిమాపక సిలిండర్ వంటివి ఏర్పాటు చేయకుండా బస్సులు తిప్పితే కఠిన చర్యలు తప్పవని జేటీసీ సి.రమేష్ ప్రయివేటు ట్రావెల్స్ నిర్వాహకులను హెచ్చరించారు. మరో వారం రోజుల పాటు ఈ దాడులు కొనసాగుతాయని జేటీసీ తెలిపారు.

అధిక చార్జీలతో ప్రయాణికుల బెంబేలు

దసరా వేళ ప్రయివేటు బస్సుల నిర్వాహకులు అధిక చార్జీలతో ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నారు. తెలంగాణతో పాటు ఏపీలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణ చార్జీలను ఇష్టారాజ్యం గా పెంచేశారు. ఆర్టీసీతో పోలిస్తే.. రెండు నుంచి మూడింతలు చార్జీలు వసూలు చేస్తూ దోపీడీకి పాల్పడుతున్నారు. ముఖ్యంగా పండుగ రోజుల్లో తెలంగాణ నుంచి ఏపీలోని విజయవాడ, అమరావతి, విశాఖపట్నం, తిరుపతితో పాటు బెంగళూరు మార్గాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. చార్జీల విషయంలో ఎలాంటి ఆంక్షలు లేకపోవడం ప్రయివేట్ ఆపరేటర్లకు కలిసివస్తోంది. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆర్టీసీ బస్సులు ఏసీతో రూ.500-600పైనే ఉండగా.. ప్రయివేటులో రూ.2వేలు ఏసీ, నాన్ ఏసీ 1600 వరకు ఉంది. విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరు ప్రాంతాల్లో ఆర్టీసీల్లో 1150 లోపు ఉండగా.. ప్రయివేటులో రూ.3,400 నుంచి 4వేల వరకు ఉంది.



కులాల అంతరాలు తొలగాలి

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అక్కడ విద్యార్థులతో కలిసి ఆయన ముచ్చటించారు. వారికి ఎలాంటి వసతులతో కూడిన పాఠశాల కావాలని విద్యార్థులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో సీఎం మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేర్వేరుగా పాఠశాలలు ఉంటే వారి మనసుల్లో విషం నిండుతుందన్నారు. అందుకే కుల మతాలకతీతంగా కలిసి ఉండాలనే ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద పిల్లలకు విద్యను దూరం చేసే ప్రయత్నం చేసిందన్నారు. రాష్ట్రంలో 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసిందని తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం విద్యాశాఖను సమూలంగా ప్రక్షాళన చేయాలని భావించిందన్నారు. అందుకే టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిన గత ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.10వేల కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని విమర్శించారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోలేదని.. తాము మంచి చేస్తుంటే తప్పు పడుతున్నారన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే తమకు గౌరవం ఉందని, ఆయన ఏ రాజకీయ పార్టీలో ఉన్నా తనకు అభ్యంతరం లేదని, కానీ మంచి పని చేస్తుంటే ఎందుకు తప్పు పడుతున్నారని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుంటే.. దీనిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఏ దొరలు పేదలకు విద్య, వైద్యం దూరం చేశారో.. ఆ దొరల పక్కన చేరి బలహీన వర్గాలకు మంచి చేస్తే విమర్శిస్తారా అని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించామన్నారు. 11వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించామని తెలిపారు. 33 జిల్లాల్లో ప్రభుత్వ స్థలాల్ని దిగమింగిన కేసీఆర్.. పార్టీ భవనాలు కట్టుకుండు తప్పా బడులకు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించలేదన్నారు. పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమి, పైసలు ఉన్నయ్ కానీ.. బడుల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఆలోచన ఆయనకు రాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన ఈ స్కూళ్లను నిర్మించి పేదలకు మెరుగైన విద్యనందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి
- కేసీఆర్, కిషన్‌రెడ్డి, సీతక్క, మహేశ్‌కుమార్ గౌడ్, ఏలేటి తదితరులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. విజయానికి చిహ్నంగా విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా పండుగను జరుపుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట చేరి సామూహికంగా సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని దుర్గామాతను ప్రార్థించారు.

చెడు మీద మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను వైభవోపేతంగా నిర్వహించుకోవడం హిందువుల సాంప్రదాయమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. చెడు ఆలోచనలను దహించివేస్తూ సత్ప్రవర్తనతో ముందుకెళ్లాలని దసరా సందర్భంగా చేసే రావణ దహనం వెనకున్న నిగూఢార్థమని తెలిపారు. రామాయణ మూలసూత్రాలను, విలువను చెప్పేదే దసరా అని పేర్కొన్నారు. మహిళలు దుర్గా అవతారమనీ, వారిని గౌరవించుకోవడంతోపాటు సమాజంలో వారికి సమాన అవకాశాలు ఇవ్వాల్సిన స్ఫూర్తిని చాటేదే దసరా పండుగ అని పేర్కొన్నారు.

మనిషి తనలోని చెడు మీద నిత్యపోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తున్నదని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానమున్నదని పేర్కొన్నారు. అలాయ్ బలాయి తీసుకోవడం, పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ప్రజల నడుమ సామాజిక సామరస్యం ఫరిడ విల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా ప్రకటించింది తమ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ఎంచుకున్న సమున్నత లక్ష్యాలను చేరుకుని విజయం సాధించాలనీ, ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ప్రార్థించారు.

రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క), టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్, బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరామ్, తదితరులున్నారు.

కొండా సురేఖను తప్పించం

- ఆమె ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదు
- మూసీ ప్రక్షాళన ఆగదు...హైడ్రా వెనక్కి తగ్గదు
- బీఆర్ఎస్ పదేండ్లలో వందేండ్ల దోపిడీకి పాల్పడింది
- తాత్కాలికంగా చేరికలకు బ్రేక్
- పార్టీతోనే బీసీలకు న్యాయం...అపోహలొద్దు : ఇష్టాగోష్టిలో మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మన మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఆ వివాదం అప్పుడే సద్దుమణిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రేవంత్ క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తప్పిస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అది ప్రచారం మాత్రమేనని చెప్పారు. ఆ కుటుంబంపై ఆమె ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ వైఖరి వల్లే కొండా సురేఖ అలాంటి వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదనీ, ఆ ప్రక్రియ ఆగబోదని స్పష్టం చేశారు. పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇష్టాగోష్టి గా ఆయన మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ విషయంలో అధిష్టానం సైతం ఎటువంటి వివరణ తమను కోరలేదని చెప్పారు. మూసీ ప్రక్షాళనకు బాధితుల్లో 50శాతం మంది ఒప్పుకున్నారని తెలిపారు. మూసీ అభివద్ధికి రూ.లక్షా యాభై వేల కోట్లు కేటాయించినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని చెప్పారు. అలా అని తమ ప్రభుత్వం ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. అయితే భావితరాల భవిష్యత్తు కోసమే హైడ్రా ఏర్పాటు చేశామనీ, హైడ్రా ఎక్కడా వెనక్కి తగ్గబోదని అన్నారు. చెరువులు, కుంటలను రక్షించడమే హైడ్రా లక్ష్యమని పునరుద్ఘాటించారు. లిక్కర్ కేసులో కవితకు బెయిల్ రావడం, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు మాత్రం బెయిల్ రాకపోవడం విషయంలో ...బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనన్నారు. బీజేపీ బీద ప్రజల పొట్ట కొడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ... పేద ప్రజలను ఇబ్బంది పెడుతోందని, వారి గురించి మాట్లాడే నైతిక హక్కులేదని అన్నారు. బీద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూసీ ప్రక్షాళన చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల లోపాయికారీ ఒప్పందంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కొంత మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారనీ, తాత్కాలికంగా చేరికలకు పార్టీ బ్రేక్ వేసిందన్నారు. బీఆర్ఎస్ అనైతికంగా డబ్బులు వెదజల్లి సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం చేయిస్తోందని విమర్శించారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క బలమైన నాయకులు కావడం వల్లే సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌పై ప్రేమతోనే బీఆర్ఎస్ పార్టీ నుంచి తమ పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. బీసీలపై మాట్లాడితే అప్పుడే ఎమ్మెల్సీ మల్లన్న పార్టీ లైన్ తప్పారనడానికి లేదన్నారు. నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్‌పై ఎంఐఎం దాడి పట్ల ఆయన సీరియస్ అయ్యారు. చట్టం ప్రకారం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేయడం సంతోషకరమన్నారు. దసరాలోపు నామినేటెడ్ పోస్టులను ప్రకటించాలని నిర్ణయించినప్పటికీ హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికలతో అది సాధ్యం కాలేదన్నారు..

విద్యార్థులను మేధావులుగా మార్చేందుకే..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-బోనకల్

విద్యార్థులను సమూలంగా మార్చే అద్భుతమైన ఆయుధం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో భట్టి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య, బోధన, ఆటలు తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. భవిష్యత్తు తరాలకు ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యా బోధన అందిస్తామన్నారు. విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రపంచంతో పోటీ పడే విద్యార్థులను తయారు చేయటమే ఈ పాఠశాలల ఉద్దేశమని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.73 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది రూ.1100 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21,400 మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చామని, 34,706 మంది ఉపాధ్యాయులకు కోరుకున్న చోటకు బదిలీలు చేశామని తెలిపారు. విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5000 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలపై ప్రతిపక్షం అర్థం లేని ఆరోపణలు చేసిందని, ఇది సాధ్యం కాదని ప్రచారం చేసిందని, కానీ తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇది సాధ్యమేనని నిరూపించిందని తెలిపారు. బోనకల్ మండల ప్రాంతం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలతో నిండిపోయిందని, అటువంటి స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

పద్మశ్రీ 'కిన్నెర మొగులయ్య'కి ప్రభుత్వం కేటాయించిన ప్లాట్..

ప్రహరీని కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు



నవతెలంగాణ-హయత్ నగర్

'కిన్నెర మొగులయ్య'గా పేరుగాంచిన ప్రముఖ జానపద కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్యకు తెలంగాణ ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఆ స్థలంలో మొగులయ్య నిర్మించుకున్న కాంపౌండ్ వాల్‌ను గుర్తు తెలియని దుండగులు కూల్చివేశారు. వివరాల్లోకెళ్తే.. మొగులయ్య తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి చేసిన సేవలకు గుర్తింపుగాను మొగులయ్యకు రాష్ట్ర ప్రభుత్వం హయత్‌నగర్‌లో 600 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించింది. ఈ ఇంటి స్థలం ధ్రువపత్రాలను మొగులయ్యకు సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే అందజేశారు. దాంతో ఆ స్థలంలో ఆయన కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కానీ కొందరు దుండగులు గురువారం రాత్రి ఆ కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయంపై మొగులయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై మొగులయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్లాట్‌కు సంబంధించిన భూమి వివాదం లేదని, ప్రహరీ కూల్చివేతపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

అధికారంలోకి వస్తే ఏడాదిలోగా విద్యుత్ ధరలు సగానికి

- ట్రంప్ హామీ



వాషింగ్టన్ : తాను గనక అధికారంలోకి తిరిగి వస్తే మొదటి ఏడాదిలోనే ఇంధన, విద్యుత్ ధరలు సగానికి సగం తగ్గిస్తానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రజలకు హామీ ఇచ్చారు. మిచిగాన్‌లో ఒక సభలో ప్రసంగిస్తూ ఆయన, తమ ప్రభుత్వం పర్యావరణ అనుమతులను వేగిరపరుస్తుందని, విద్యుత్ సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుందని, ఇంధన వ్యయాలు తగ్గేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనివల్ల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్నారు. అమెరికాను తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా తయారుచేస్తామన్నారు. ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీల పెట్టడానికి అత్యంత ఉత్తమమైన ప్రదేశంగా అమెరికాను తయారుచేస్తామన్నారు.

ట్రంప్ పోస్ట్ రీట్వీట్ చేసిన కేజ్రీవాల్

ఎక్స్‌ల ట్రంప్ పోస్ట్‌ను ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రీట్వీట్ చేశారు. దీనిపై స్పందిస్తూ 'విద్యుత్ బిల్లులు సగానికి తగ్గిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయి' అని పేర్కొన్నారు.

'ప్రవాసీ ప్రజావాణి'

మార్గదర్శకాలు జారీ

- ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ
- బలోపేతానికి సర్కారు చర్యలు : చిన్నారెడ్డి





నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజావాణి ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గల్ఫ్, ఇతర దేశాల్లో ఉన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సెప్టెంబర్ 16న జారీ చేసిన జీవో నెం.205కు కొనసాగింపుగా, సాధారణ పరిపాలనా శాఖలోని ప్రవాస భారతీయుల (జీఏడి - ఎన్నారై) విభాగం పక్షాన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 9న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రవాసీ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంస్థాగతంగా గట్టి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రవాసీ ప్రజావాణి నిర్వహణ మార్గదర్శకాల ఉత్తర్వుల ప్రతులను శుక్రవారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి విడుదల చేశారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, దుబాయిలోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు గుండెల్లి నర్సింలు, స్వచ్ఛంద సేవకులు శాంతిప్రియ యాదవ్ (మలేషియా), బషీర్ అహ్మద్ (ఓమాన్ రిటర్న్) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేసిన నోడల్ అధికారి దివ్యా దేవరాజన్‌ను చిన్నారెడ్డి అభినందించారు.

మార్గదర్శకాలు

గల్ఫ్, ఇతర గమ్యస్థాన దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ కేంద్రంలో విదేశాల్లో ఉన్న బాధితుల పక్షాన వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చు. తదుపరి చర్యల కోసం ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తారు.

జీఏడి-ఎన్నారై విభాగం పరిధిలో..

గల్ఫ్ తదితర దేశాల నుంచి మతదేహాలను ఇండియాకు తెప్పించడం, విదేశాల నుంచి వచ్చిన శవపేటికలను హైదరాబాద్ విమానాశ్రయం దగ్గర నుంచి స్వగ్రామం తీసుకెళ్లేందుకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం (దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికి), పేషెంట్లను స్వదేశానికి రవాణా చేయడం, విదేశీ జైళ్లలో ఉన్నవారికి న్యాయ సహాయం చేసి విడుదలకు కృషి చేయడం, వీసా గడువును మించి (ఓవర్ స్టే) అక్కడే నివసించడం, అత్యవసర పరిస్థితులు, క్షమాభిక్ష (ఆమ్నెస్టీ), జీతం బకాయిలు ఇప్పించడం, విదేశాల్లో మన వారికి అవసరమైన అన్ని సేవలను జీఏడి - ఎన్నారై విభాగం నేరుగా పర్యవేక్షిస్తుంది. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో అనుసంధానం చేస్తుంది. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ, అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విదేశాల్లోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలతో పాటు మొబైల్ నెంబర్లు ఇవ్వాలి.

ఎన్నారై మహిళా పోలీస్ విభాగం పరిధిలో

విదేశాల్లోని ఎన్నారై కుటుంబ వివాదాల పరిష్కారం గురించి వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని పోలీస్ కార్యాలయంలోని ఎన్నారై మహిళా విభాగానికి పంపిస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ, అడ్రస్ పేజీ, ఆధార్‌కార్డు, మ్యారేజీ సర్టిఫికెట్, పోలీస్ ఎఫ్ఐఆర్, విదేశంలోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలు, మొబైల్ నెంబర్లు అందించాల్సి ఉంటుంది.

ఏజెంట్ల మోసాలు - పోలీస్ శాఖ పరిధిలో

నకిలీ ఏజెంట్లు, చీటింగ్ కేసులు, విదేశాలకు సంబంధించిన ఇతర సారూప్య సమస్యలపై తదుపరి చర్యల కోసం సంబంధిత పోలీస్ కమీషనర్(సీపీ), పోలీస్ సూపరింటెండెంట్(ఎస్పీ)కు బదిలీ చేస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ తదితర వివరాలు అందజేయాలి.

గల్ఫ్ మతులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా (మతధన సహాయం) కోసం గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వ్యక్తి జీవిత భాగస్వామి (భార్య లేదా భర్త), పిల్లలు, తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విజ్ఞప్తిని సంబంధిత జిల్లా కలెక్టర్లకు బదిలీ చేస్తారు. బాధితులు నేరుగా జిల్లా కలెక్టర్లకూ దరఖాస్తు చేసుకోవచ్చు. తెల్లకాగితంపై అభ్యర్థన లేఖ, పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, భారత రాయబార కార్యాలయాలు జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి.

గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు

గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ల కొరకు వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం విద్యాశాఖకు బదిలీ చేస్తారు. తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్‌పేజీ, ఆధార్‌కార్డు, విద్యార్థి సర్టిఫికెట్లు అందజేయాలి.

ఈ రోజు దసరా. అందరికీ ఎంతో ఇష్టమైన పండుగ. ఆడబిడ్డలతో, పిల్లలతో, బంధువులతో అందరి లోగిళ్లు సందడిగా వుంటాయి. ముఖ్యంగా ఆడపిల్లలు గత పదిరోజులుగా బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రకరకాల పూలతో బతుకమ్మను చేసి ఆడి, పాడి సరదాగా గడుపుతారు. కొత్త బట్టలు వేసుకుని సందడి చేస్తారు.

శక్తి స్వరూపిణి స్త్రీ



ఒక్క తెలంగాణాలోనే కాదు, మన దేశంలో చాలా రాష్ట్రాలలో ఈ పండుగను రకరకాల పేర్లతో, రకరకాల పద్ధతుల్లో జరుపుకుంటారు. స్త్రీని ఎంతో శక్తిమంతురాలిగా, దుష్టశిక్షణ చేసిన ఆదిపరాశక్తిగా కొలుస్తారు. నవరాత్రుల్లో దుర్గాదేవిని ఒక్కో రోజు ఒక్కో అవతారం పేరుతో శైలపుత్రి (పర్వతరాజు పుత్రి), బ్రహ్మచారిణి (బాలాత్రిపుర సుందరి), గాయత్రి, లలితాదేవి, సరస్వతిదేవి, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మి, దుర్గాదేవి, మహిషాసురమర్థినీదేవి, చివరిగా పదో రోజు రాజరాజేశ్వరీదేవిగా పూజిస్తారు. ప్రాంతాలను బట్టి అవతారాల పేర్లు కూడా మారుతుంటాయి. ఏదేమైనా దుర్గాదేవిని శక్తిస్వరూపిణిగా అందరూ ఆరాధిస్తారు. ఆడపిల్లను బతుకమ్మగా నిండునూరేళ్లు బతకమని దీవిస్తారు.

బతుకమ్మ అంటే ఆడపిల్లల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, పూల పండుగ.. ప్రకృతి అంటేనే స్త్రీ. స్త్రీలను పూలతో పోలుస్తారు. పూలలాగే మహిళలు కూడా సుకుమారులు అంటారు. మరి వారిని అంతే సుకుమారంగా, అపురూపంగా చూసుకోవాలి కదా! కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపిస్తుందా? ఓ పక్క ఆదిశక్తి పార్వతి, చదువుల తల్లి సరస్వతి, సిరులను కురిపించే లక్ష్మీదేవి, గ్రామాలను కాపాడే ఎల్లమ్మ పోచమ్మ... ఇలా స్త్రీ రూపంలో ఉన్న ఎందరో దేవతామూర్తులను పూజిస్తున్నారు. మరోపక్క ఆడవారి మీద రకరకాల దాడులు, హింసలు, నిందలు కొనసాగిస్తున్నారు. పుష్కర కాలం కిందట నిర్భయ, ఖతువా ఘటన, ఆ తర్వాత 2019లో దిశ, మణిపూర్ ఘటనలు, ఇటీవల కోల్‌కతా జూనియర్ డాక్టర్ పై లైంగిక దాడి, హత్య... ఇవేకాదు, ఇలాంటి ఇంకెన్నో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న ఘటనలు నేటికీ చూస్తున్నాం, వింటున్నాం. ఈ రకమైన దాడులు ఏడాదికేడాది పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. ఇంటి పని నుండి అంతరిక్షంలో పరిశోధన చేసేవరకు ఎదిగినా ఆడపిల్ల మీద ఇంకా వివక్ష, దాడులు కొనసాగుతూనే వున్నాయి.



గంభీర రూపంతో దుష్టులకు సింహస్వప్నంగా, నమ్మిన వారికి వరాలిచ్చే కరుణామయిగా కనిపించని దేవతలను పూజిస్తారు. ప్రేమ స్వరూపిణిగా, కనిపించే దైవంగా స్త్రీని పొగుడుతారు. ప్రాణికి జన్మనివ్వడమే కాక ఆ ప్రాణి మనుగడకు కావలసిన సర్వశక్తులూ ప్రసాదించగల శక్తి, ఔదార్యం స్త్రీ సొంతమని చెప్పుకుంటారు. ఆచరణలో మాత్రం స్త్రీని కేవలం చరాస్తిగా భావిస్తారు.

సంతతినిచ్చే స్త్రీని పంటలనిచ్చే భూమితో పోల్చి ప్రాచీనులు పూజించేవారు. ఈ విశ్వాసం ఆర్యులు భారతదేశానికి రాకముందు ఉండేది. ఏరువాక సమయంలో స్త్రీలు నాగలికి పూజలు చేయడం కూడా పంటలకు, మహిళలకు ఉన్న సంబంధాన్ని సూచించేదే. సింధు నాగరికత ప్రకారం స్త్రీలకు, చెట్లకు సంబంధం వుందనటానికి ఆధారాలున్నాయంటారు చరిత్రకారులు.

మాతృస్వామిక వ్యవస్థలో తన సంతతిని వృద్ధి చేయడం దగ్గర నుండి వారిని రక్షించి పోషించడం వరకు అంతా తానై చూసుకున్న స్త్రీ, నేడు తనను తాను రక్షించుకోలేని పరిస్థితిలోకి ఎందుకు నెట్టివేయబడింది. ఈ పరిస్థితులకు కారణాలేమిటి? ఇలా అనేక ప్రశ్నలు ఇప్పుడు ఉద్భవిస్తున్నాయి.

ప్రకృతిలో చెట్లు, పూలు, కాయలు, నీరు, గాలి, ఎండ... ఎంత సహజమో ఆడ, మగ పుట్టుక కూడా అంతే సహజం. ఈ ప్రపంచంలో పునరుత్పత్తి చేయగల శక్తి ఒక్క స్త్రీ జాతికే ఉంది. అది మనిషైనా, మరో ప్రాణి అయినా!

పురాణాల్లోనే కాదు, నేటికీ పర్వదినాల్లో స్త్రీ మూర్తిని (విగ్రహాన్ని) దేవతగా పూజిస్తున్నారు కానీ, నిజ జీవితంలో ఆమె పట్ల వివక్షత కొనసాగుతోంది. సవాలక్ష సమస్యలు ఆమెను పట్టి పీడిస్తున్నాయి. ఆమెకు రక్షణ కరువవడమే కాదు, ఉనికే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఎదురవుతున్నాయి. భ్రూణ హత్యల మొదలు నిరక్షరాస్యత, వరకట్న చావుల వరకు అన్నిటికీ స్త్రీనే బలవుతోంది.

ఉద్యోగాల్లో నేటి అవసరాలకు తగ్గట్టు రాత్రిపూట పనిచేయాలన్నా రక్షణ లేక ఆమెకు నిరాదరణే ఎదురవుతోంది. కొన్ని సంస్థల్లో, అసంఘటిత రంగాల్లో, వ్యవసాయరంగంలో మగవారికంటే ఎక్కువగానే పనిచేస్తున్నా మహిళలకు తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. శాసన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చినా కానీ, ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. చివరికి తమ రాజకీయాల్లోకి కూడా సంబంధం లేని స్త్రీల ప్రసక్తి తెచ్చి వారి గౌరవానికి భంగం కలిగించడం నేడు చూస్తున్నాం.

తమ జీవనోపాధికి ఆటంకమైన మహిషాన్ని చంపిన ఆనందంతో ఆనాటివారు ఈ పండుగను జరుపుకున్నారు. మరి ఈనాడు మహిళల ఉనికికి అనేకమంది మహిషాసురులు ఆటకంగా తయారౌతున్నారు. ఇలాంటి మహిషాసురుల్ని కూడా మట్టుబెట్టిన నాడు, సమాజంలో సగ భాగమైన స్త్రీలను సమాన స్థాయిలో చూసిన నాడే స్త్రీల జీవితంలో నిజమైన దసరా. దీనికోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. స్త్రీలు కూడా శక్తి స్వరూపిణులుగా మారి ఐక్యతతో సమానత్వం కోసం పోరాటం చేయాలి.

- బి. మల్లేశ్వరి

టేస్టీ పొంగలి.. బాదం పాయసం

దసరా రోజు చేసుకునే వాటిల్లో స్వీట్ రెసిపీలు అధికంగా ఉంటాయి. ఎప్పుడూ చేసుకునే పూర్ణాలు, భక్షాలే కాకుండా కొత్తగా చేసుకునే ఈ వంటలు సులువే కాదు, తక్కువ సమయంలోనూ అయిపోతాయి. అవేంటో చూద్దాం.

పెసరపప్పు పొంగలి

కావాల్సిన పదార్థాలు : బియ్యం – ఒక కప్పు, పెసరపప్పు – ఒక కప్పు, బెల్లం – రెండు కప్పులు, జీడిప్పులు – పది, కిస్ మిస్‌లు – పది, కొబ్బరి ముక్కలు – అరకప్పు, నీళ్లు – తగినన్ని, బాదం పప్పులు – పది, నెయ్యి – అర కప్పు, యాలకుల పొడి – అర స్పూను



తయారీ విధానం : స్టవ్ మీద కళాయి పెట్టి అర కప్పు నెయ్యి వేయాలి. అందులో కొబ్బరి ముక్కలు వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్, బాదం పప్పులు వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బియ్యం, పెసపప్పు బాగా కడిగి మెత్తగా కుక్కర్లో ఉడికించుకోవాలి. కుక్కర్ ఓపెన్ చేసి అందులో బెల్లం తురుము వేసి కరిగించాలి. బెల్లం మొత్తం కరిగాక అవసరమైతే కాస్త నీరు పోసుకోవచ్చు. గరిటెతో మెత్తగా అయ్యేలా కలుపుకోవాలి. మిశ్రమం పాయసంలా రెడీ అవుతుంది. అప్పుడు ముందుగా వేయించుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పులు, కిస్ మిస్‌లు వేసి బాగా కలపాలి. అంతే ఎంతో రుచికరమైన పెసరపప్పు పొంగలి రెడీ అయినట్టే.

బాదం పాయసం

కావలసిన పదార్థాలు : బాదం పప్పులు: ఒక కప్పు, పాలు – ఆరు కప్పులు, పంచదార – ఒక కప్పు, నీళ్లు – ఒక గ్లాసు, కుంకుమ రేకలు: అయిదారు.

తయారీ విధానం : ముందుగా బాదం పప్పులను నానబెట్టుకోవాలి. ఇలా నానబెట్టడం వల్ల పొట్టు సులువుగా వచ్చేస్తుంది. తరువాత వాటిని మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి పాలు పోయాలి. పాలు మరిగాక బాదం పేస్టు వేసి బాగా కలపాలి.



పదినిమిషాల పాటూ ఉడికించాలి. తరువాత అందులో చక్కెర వేయాలి. మిశ్రమం చిక్కగా అయ్యేదాకా ఉడికించుకోవాలి. కుంకుమపూల రేకలు వేసి దించేయాలి.టేస్టీ బాదం పప్పు పాయసం సిద్ధమైనట్టే. ■

తెర వెనుక..!

(మొదటిపేజీ తరువాయి)

కూర్చోవాల్సి వస్తుంది. ఎందుకంటే ప్రకటనలకు సంబంధించి కాంట్రాక్ట్ కుదుర్చుకోవడానికి చాలా సమయం పడుతుంది. అప్పుడు వారికేమీ పని ఉండదు. కాంట్రాక్ట్ కుదిరిందంటే ఇక అంతే....దానిని వేగంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో నిబంధనలంటూ చెప్పినా ప్రయోజనం ఏమీ ఉండదు. ఉదాహరణకు పనిలో క్రియేటివిటీ చూపే వారు 12 గంటలకు మించి ఎక్కువ సమయం పని చేయకూడదు. ఒకవేళ చేస్తే ఓవర్‌టైమ్ అలవెన్సులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ దీనిని ఎవరూ పట్టించుకోరు.

వీరి గోడు వినేదెవరు?

వ్యాపార ప్రకటనల పరిశ్రమలో ఉండేది ఒకే నిబంధన...నిర్ణీత బడ్జెట్‌లో పని పూర్తి చేయాలి. అంతే. కోవిడ్ తర్వాత పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అది ఇప్పటికీ కుదుటపడలేదు. తాను ఇటీవల ఓ సెట్‌లో పనిచేశానని, ఏడు యాడ్ ఫిల్మ్‌లను రూపొందించడానికి సిబ్బంది 27 గంటల పాటు అలుపెరుగకుండా పని చేశారని నటీమణి, దర్శకురాలు దివ్య ఉన్నీ చెప్పారు. 'ఈ పరిశ్రమలో పోటీ ఎక్కువ. బడ్జెట్‌ను బట్టి పని పూర్తి కావాలి. తప్పదు. అలాంటప్పుడు భౌతిక, మానసిక ఆరోగ్యంతో రాజీ పడాల్సిందే. ఆరోగ్యం దెబ్బతింటే ఎవరూ పట్టించుకోరు. పరిహారం ఇవ్వరు' అని తెలిపారు. దివ్య ఇటీవల ఓ తేయాకు కంపెనీ కోసం 22 గంటల పాటు ఏకధాటిగా పనిచేశారు. భోజనం చేయడానికి కేవలం 40 నిమిషాల విరామం మాత్రమే దొరికింది. సీనియర్ అయిన తన పరిస్థితే ఇలా ఉంటే జూనియర్ ఆర్టిస్టుల సంగతేమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆ ప్రకటనకు 20 మంది జూనియర్ ఆర్టిస్టులు అవసరమయ్యారు. వారు ఆరు గంటల పాటు వర్షంలో నిలబడాల్సి వచ్చింది. వారికి మధ్యలో వేడి వేడిగా తినడానికి ఏమైనా ఇచ్చారా అంటే లేదు. తడిసిన బట్టలు మార్చుకునేందుకు పొడి బట్టలు కూడా ఇవ్వలేదు. వారి అవసరం కూడా లేదన్న విధంగా ప్రవర్తించారు. చివరికి బాగా ఇబ్బంది పడేది జూనియర్ ఆర్టిస్టులే. ఎందుకంటే వారు పేరున్న వారు కాదు. వారిని ఎవరూ పెద్దగా గుర్తించరు' అని వివరించారు. షూటింగ్ సమయంలో ప్రమాదం జరిగి చనిపోయినా దిక్కు లేదని ముంబయికి చెందిన ఓ కెమేరామన్ వాపోయారు. కార్మిక సంఘాలు కూడా వీరిని గురించి పెద్దగా పట్టించుకోవు. పని దొరికే అవకాశాలు పరిమితంగా ఉండడంతో ఎన్ని బాధలైనా పడేందుకు ఆర్టిస్టులు, సిబ్బంది సిద్ధపడుతున్నారు. కుటుంబాన్ని పోషించుకోవాలంటే డబ్బు కావాలి. అందుకోసం రోజుకు 22 గంటలైనా పని చేసేందుకు ముందుకు వస్తారు. పోనీ గౌరవం అయినా ఉంటుందా అంటే అది ఎండమావే. ఛీత్కారాలు, అవమానాలు, లైంగిక వేధింపులు తప్పవు. దక్షిణాదిన పరిస్థితులు మెరుగ్గా ఉంటాయని, కానీ బాలీవుడ్‌లో కాలాన్ని డబ్బుగా భావిస్తారని అంటూ ఓ ఆర్టిస్ట్ నిట్టూర్పు విడిచారు. రోజుకు 18 గంటలు పనిచేసే సిబ్బందికి ఇచ్చేది రూ.1,200 నుండి రూ.1,600 మాత్రమే.

వివక్ష ఎక్కువే

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తుంటారు. లైట్‌మెన్, స్పాట్ బాయ్స్ పరిస్థితి అయితే మరీ ఘోరం. సెట్స్‌లో కాసింత జాగా చూసుకొని తినాల్సి వస్తుంది. 'ఇంటికి ఎప్పుడు తిరిగొస్తామో తెలీదు. సెట్‌లో ఎప్పుడు ఉండాలో మాత్రమే మాకు తెలుస్తుంది. అంతా నిర్మాతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. షిఫ్ట్‌ని పొడిగిస్తే దానికి అంగీకరించి పని చేయాల్సిందే' అని ఓ జూనియర్ ఆర్టిస్ట్ వాపోయారు.

జపాన్ సంస్థ నిహాన్ హిడాంక్యోకు నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. జపాన్ నగరాల్లో అణ్వాయుధాల బారిన పడిన బాధితుల ఉద్యమాన్ని హిబాకుషా గా పేర్కొంటారు. దీనిలో జపాన్‌కు చెందిన 47 రాష్ట్రాల్లో పోరాడుతున్న సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

మరోవైపు, వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాలతోపాటు సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ఇప్పటికే వెల్లడించగా.. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ని ప్రకటించారు. అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు.

సీఏఏ లబ్దిదారుల వివరాల్లేవ్

న్యూఢిల్లీ : 2019వ సంవత్సరపు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద భారతీయ పౌరులుగా మారిన దరఖాస్తుదారుల సమాచారం ప్రభుత్వం వద్ద సిద్ధంగా లేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద 'ది హిందూ' పత్రిక అందించిన దరఖాస్తుకు హోం శాఖ స్పందిస్తూ తమ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం మాత్రమే ఇస్తామని చెప్పింది. ఆర్‌టీఐ చట్టం ప్రకారం దరఖాస్తుదారుడికి సమాచారం అందించే పని సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి (సీపీఐఓ)ది కాదని వివరించింది.

పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని? సీఏఏ కింద ఎంతమందికి పౌరసత్వం లభించింది? ఎన్ని దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి? అనే సమాచారాన్ని 'ది హిందూ' పత్రిక కోరింది. కాగా మరో ఆర్‌టీఐ దరఖాస్తుకు ఏప్రిల్ 15వ తేదీన హోం శాఖ స్పందిస్తూ సీఏఏ కింద వచ్చిన దరఖాస్తుల రికార్డును నిర్వహించాల్సిన అవసరమేమీ లేదని స్పష్టం చేసింది. సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు మార్చి 11న కేంద్ర హోం శాఖ సీఏఏ నిబంధనలను నోటిఫై చేసింది.

సీఏఏను 2019 డిసెంబర్ 11న పార్లమెంట్ ఆమోదించిన విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుండి ఎలాంటి పత్రాలు లేకుండా 2014 డిసెంబర్ 31వ తేదీకి ముందు మన దేశంలో ప్రవేశించిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వం కల్పించేందుకు సీఏఏను ఉద్దేశించారు. ఈ చట్టం ప్రకారం పౌరసత్వం పొందేందుకు అర్హతగా నిర్ణయించిన 11 సంవత్సరాలను ఐదు సంవత్సరాలకు కుదించారు.

సీఏఏ కింద ఎంతమంది లబ్దిదారులు ఉన్నారో స్పష్టంగా తెలియడం లేదు. ఈ చట్టం ద్వారా లక్షలు, కోట్ల మంది ప్రయోజనం పొందుతారని బిల్లుపై చర్చ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా రాజ్యసభకు తెలిపారు. అయితే తక్షణం 31 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ ఓ పార్లమెంటరీ కమిటీకి చెప్పారు. 25,447 మంది హిందువులు, 5,807 మంది సిక్కులు, 55 మంది క్రైస్తవులు, ఇద్దరు బౌద్ధులు, ఇద్దరు పార్శీలు...మొత్తం 31,313 మంది మైనారిటీలకు దీర్ఘకాలిక వీసాలు మంజూరు చేయడం జరిగిందని, కాబట్టి వారు తక్షణమే ప్రయోజనం పొందుతారని ఐబీ అధికారిని ఉటంకిస్తూ పార్లమెంటరీ సంయుక్త కమిటీ తన నివేదికలో వివరించింది.

వర్గీకరణ కమిషన్ చైర్మెన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. కమిషన్‌కు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చేందుకు షెడ్యూల్ కులాల శాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలావుండగా ఎస్సీ వర్గీకరణ విషయమై సుప్రీంకోర్టు తీర్పు అధ్యయనం, అమలు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మెన్‌గా మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి సభ్యులుగా వ్యవహరించారు. ఈ ఉపసంఘం పలుమార్లు సమావేశమై సమగ్రంగా చర్చించిన అనంతరం విచారణ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో రిటైర్డ్ జడ్జి షమీమ్ అక్తర్ చైర్మెన్‌గా సర్కారు ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. ప్రభుత్వం నియమించిన కమిషన్ శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ జరపాలనీ, విస్తృత సంప్రదింపులు చేయాలని సూచించింది. ఎస్సీ ఉపకులాలకు రిజర్వేషన్ల విధానాల ద్వారా ప్రయోజనాలు ఎలా అందించాలో కమిషన్ నివేదికలో తెలియజేయాలని కోరింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఏకసభ్య కమిషన్, రెండు నెలల్లో విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



సమగ్ర కులగణనపై ఉత్తర్వులు

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి 4న నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా కులగణన తర్వాతే నిర్వహించాలని బీసీ సంఘాల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో 60 రోజుల్లో కులగణన చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

కులగణన చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్వులు రావడం బీసీల పోరాట విజయంగా అభివర్ణించారు. మాటకు కట్టుబడి కులగణనకు నిర్ణయించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. జీవో 18 బీసీలకు దసరా కానుక అని పేర్కొన్నారు.

వరుస దాడులతో విరుచుకుపడిన ఇజ్రాయిల్

లెబనాన్‌పై దాడుల్లో హిజ్బుల్లా నేత హత్య

వెస్ట్ బ్యాంక్ దాడుల్లో ఇస్లామిక్ జిహాద్ కమాండర్ మృతి

గాజా దాడుల్లో 61మంది, బీరుట్ దాడుల్లో 22మంది మృతి, 117మందికి గాయాలు

గాజా/ బీరుట్ : గాజా, వెస్ట్ బ్యాంక్‌లతో పాటు లెబనాన్‌పై ఇజ్రాయిల్ ఆర్మీ విరుచుకుపడుతోంది. అది సాగిస్తున్న వరుస బాంబు దాడుల్లో గత 24గంటల్లో 61మంది మరణించారు.మరో 231మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. జాబాలియా, డేర్ అల్ బాలాహ్, నుస్రత్, మఘాజి, శిబిరాల్లో దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నబ్లస్‌కు దక్షిణంగా బీటా ప్రాంతంపై దాడి జరిగింది. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ బలగాలు బాష్ప వాయు గోళాలను ప్రయోగించాయి. దీంతో అనేకమంది ఆ గాలిని పీల్చలేక చాలా ఇబ్బందులు పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పాలస్తీనా మెడికల్ రిలీఫ్ సొసైటీకి చెందిన అంబులెన్స్‌ను లక్ష్యంగా చేసుకుని బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ దాడుల్లో ఇస్లామిక్ జిహాద్ కమాండర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. తుల్కరెమ్‌లో శిబిరంపై గురువారం జరిగిన వైమానిక దాడుల్లో మహ్మద్ అబ్దుల్లా హతుడయ్యాడని మిలటరీ తెలిపింది. అయితే ఆ భవనాల్లో హిజ్బుల్లా నేత వఫీక్ సఫా మృతదేహం జాడ ఎక్కడా కనిపించలేదని మీడియా పేర్కొంది.

మరోవైపు సెంట్రల్ బీరుట్‌లోని సిటీ సెంటర్‌పై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో రెండు నివాస భవంతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

శాంతి పరిరక్షకులపై కాల్పులను ఖండించిన ఐరాస

ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షకులు ఉపయోగించే వాచ్ టవర్‌పై ఇజ్రాయిల్ బలగాలు కాల్పులు జరపడంతో ఇద్దరు గాయపడ్డారు. ఐరాస శాంతి పరిరక్షక బలగాల చీఫ్ గురువారం భద్రతా మండలి సమావేశంలో మాట్లాడుతూ, లెబనాన్‌లో శాంతి పరిరక్షకుల భద్రత, రక్షణ అనేది రాన్రాను ప్రమాదకరంగా తయారైందన్నారు.

371 పోస్టులకు అనుబంధ నోటిఫికేషన్లు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

బీమా వైద్య సేవల సంచాలకుల పరిధిలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టులకు అనుబంధ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. శుక్రవారం వైద్యారోగ్య సేవల నియామక మండలి వీటిని విడుదల చేసింది. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) డైరెక్టర్ పరిధిలో 272 నర్సింగ్ ఆఫీసర్లు, 99 ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టులను వీటి ద్వారా భర్తీ చేయనున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ పరిధిలో 2050 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా, తాజా అనుబంధ నోటిఫికేషన్‌తో పోస్టుల సంఖ్య 2,322కు చేరింది. 633 ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా తాజా అనుబంధ నోటిఫికేషన్‌లో 99 కలుపుకుని 732కు చేరాయి. నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ మొదలు కాగా ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులకు చివరి గడువుగా ఉంది. నవంబర్ 17వ తేదీన ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రాత పరీక్షను నిర్వహించనున్నారు. ఫార్మసిస్ట్ గ్రేడ్–2 పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువుంది. దీనికి నవంబర్ 30న ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహిం చనున్నారు. జోన్లు, కేటగిరీల వారీగా ఖాళీల సంఖ్యను బోర్డు వెబ్‌సైట్‌లో (https:// mhsrb. telangana. gov.in /MHSRB /home.htm) అందుబాటులో ఉంచారు.

టాటా ట్రస్ట్స్ చైర్మెన్‌గా నోయల్ టాటా..

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు. ఆయన ఇప్పటికే టాటా గ్రూపులోని పలు కంపెనీల్లో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ట్రెంట్, వోల్టాస్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా ఇంటర్నేషనల్ కంపెనీలకు చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టాటా స్టీల్, టైటాన్‌కు వైస్ చైర్మెన్‌గానూ ఉన్నారు. రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోనూ నోయల్ సభ్యుడిగా ఉన్నారు.టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కే అత్యధికంగా 66 శాతం వాటా ఉంది. అందువల్ల టాటా టస్ట్స్‌కు చైర్మెన్ హోదాలో ఉన్న వ్యక్తి.. గ్రూపు కంపెనీల కార్యకలాపాలు, సంస్థ వృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఇప్పటివరకు టాటా ట్రస్ట్స్ చైర్మెన్‌గా రతన్ టాటా ఉన్నారు. ఈ పదవి విషయంలో తొలుత వేర్వేరు పేర్లు వినిపించినప్పటికీ.. నోయల్ టాటాకే పగ్గాలు అప్పగించడం విశేషం.

నేటి నుంచి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమించుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో స్థలం ఉండి, ఇండ్ల నిర్మాణం చేసుకోవడం కోసం అర్హులైన పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ విధంగా తొలివిడతలో రాష్ట్రంలో 4.50 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

గ్రామాల్లో...

లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో సర్పంచ్ లేదా స్పెషల్ ఆఫీసర్ కమిటీ చైర్మెన్‌గా ఉంటారు. స్థానిక స్వయం సహాయక మహిళా గ్రూపుల నుంచి ఇద్దరు మహిళా సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ తరగతులకు చెందిన మరో ముగ్గురు సభ్యులుగా ఉంటారు. పంచాయతీ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

పట్టణాల్లో...

పట్టణాల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మెన్‌గా వ్యవహరిస్తారు స్వయం సహాయక మహిళా సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు చెందిన మరో ముగ్గురు సభ్యులుగా ఉంటారు. కన్వీనర్‌గా వార్డ్ ఆఫీసర్ వ్యవహరిస్తారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అవగాహన, సోషల్ ఆడిట్, అధికారులతో సంప్రదింపులు వంటి కార్యక్రమాల్ని ఇందిరమ్మ కమిటీలు నిర్వహిస్తాయి. ఈ కమిటీల్లో సభ్యుల పేర్లను ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు నామినేట్ చేసి, కలెక్టర్‌కు సిఫార్సు చేస్తారు. విజయదశమి సందర్భంగా ఈనెల 12 నుంచే కమిటీల నియాకమాలు చేపడుతూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం పేర్కొంది.

మహిళా హక్కులపై చైనా తీర్మానం

- మానవ హక్కుల మండలిలో ఆమోద ముద్ర



జెనీవా : మహిళా హక్కులపై చైనా మరికొన్ని దేశాలు కలిసి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) సమావేశం ఏకాభిప్రాయంతో ఆమోదించింది. బీజింగ్ డిక్లరేషన్ అండ్ ప్లాట్‌ఫారమ్ ఫర్ యాక్షన్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చైనా, స్విట్జర్లాండ్‌లోని ఇతర అంతర్జాతీయ సంస్థలు కలిసి ఈ తీర్మానాన్ని రూపొందించాయి. ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి చెన్ జు ఈ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైనాతో పాటు డెన్మార్క్, ఫ్రాన్స్, కెన్యా, మెక్సికోలు కలిసి ఈ తీర్మానాన్ని మండలి సమావేశాల్లో ప్రవేశపెట్టాయి. ఈ చొరవకు 112 దేశాలు మద్దతిచ్చాయి. అంతర్జాతీయంగా మహిళా హక్కుల అభివృద్ధిలో చారిత్రిక మైలురాయిగా నిలిచిపోయిన బీజింగ్ డిక్లరేషన్, ప్లాట్‌ఫారమ్ ఫర్ యాక్షన్‌ను 1990వ దశకంలో జరిగిన నాల్గవ ప్రపంచ మహిళా సదస్సు ఆమోదించింది. గత మూడు దశాబ్దాల్లో మహిళల సామాజిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయని చెన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డిక్లరేషన్‌లో పేర్కొన్న లక్ష్యాలను పూర్తిగా సాధించడంలో ఇంకా సవాళ్లు మిగిలివున్నాయన్నారు. ఆ డిక్లరేషన్ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేయడం ఈ తీర్మానం ప్రధాన లక్ష్యంగా వుంది. లింగ సమానతను శీఘ్రగతిన సాధించాలన్న ఆకాంక్ష ప్రతిబింబిస్తోంది. ఈ సవాళ్లను ఎదుర్కొనడంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలని ఈ తీర్మానం కోరుతోంది. వచ్చే ఏడాదిలో లింగ సమానత్వంపై, మహిళా సాధికారతపై అంతర్జాతీయ నేతలతో సమావేశాలను ఏర్పాటు చేయాలని కూడా చైనా ప్రతిపాదించింది.

జేపీ విగ్రహానికి నివాళులర్పించేందుకు నిరాకరణ

- యోగి ప్రభుత్వంపై అఖిలేశ్ ఆగ్రహం
- ఎన్డీఏకు మద్దతు ఉపసంహరించుకోండి : నితీశ్‌కు సూచన



లక్నో : సోషలిస్ట్ నేత లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసేందుకు వెళ్లాలనుకున్న మాజీ సీఎం, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. లక్నోలోని గోమతినగర్ ప్రాంతంలో ఉన్న జయప్రకాష్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేపీఎన్ఐసీ) గేటు వద్ద ఉన్న జేపీ విగ్రహంపాంతాన్ని ఏటా సమాజ్‌వాదీ పార్టీ నేతలు సందర్శించి, నివాళు లర్పిస్తారు. అక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, జెడ్ ప్లస్ భద్రత కల్పించడం సాధ్యం కాదని పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం అఖిలేశ్ యాదవ్ సందర్శనకు అనుమతిని నిరాకరించింది. దీంతో, ఆయన తన నివాసం వద్దకు చేరుకున్న వేలాదిమంది కార్యకర్తలతో కలిసి జేపీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిలేశ్ మాట్లాడుతూ "లోక్‌నాయక్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేయకుండా అడ్డుకుంది. అయినప్పటికీ రహదారిపై ఆయనకు నివాళు లర్పించాం. జయప్రకాష్ నారాయణ్ గౌరవార్థం నిర్మించిన విగ్రహాన్ని విక్రయించాలని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోంది. ఇటువంటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని ఎలా ఆశించగలమని' ప్రశ్నించారు. కేంద్రంలోని ఎన్డీఏలో ఉన్న జేడీయూ మద్దతు ఉపసంహరించుకోవాలని నితీశ్‌కుమార్‌కి అఖిలేశ్ సూచించారు. "జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం నుంచి నితీశ్ కుమార్ వచ్చారు. సోషలిస్టు భావాలను అనుసరించని ప్రభుత్వం నుంచి నితీశ్ కుమార్ వైదొలగాలి" అని అన్నారు.

దసరా ధమాకా

- ఉప్పల్‌లో భారత్, బంగ్లా టీ20 నేడు
- క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన సూర్యసేన

రాత్రి 7 నుంచి జియో సినిమాలో..

దసరా ధమాకాకు ఉప్పల్ స్టేడియం ముస్తాబైంది. తెలంగాణ అతి పెద్ద పండుగ దసరా రోజు.. హైదరాబాద్‌లో హైఓల్టేజ్ క్రికెట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, బంగ్లాదేశ్ ఆఖరు టీ20 టీ20 సమరం నేడు హైదరాబాద్ వేదికగా జరుగనుంది. 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో సూర్యసేన బరిలోకి దిగుతుండగా.. సీనియర్ ఆటగాడు మహ్మదుల్లాకు విజయంతో వీడ్కోలు పలికేందుకు బంగ్లాదేశ్ పట్టుదలగా కనిపిస్తోంది. భారత్, బంగ్లాదేశ్ టీ20 సమరం నేడు.

నవతెలంగాణ-హైదరాబాద్

పొట్టి ఫార్మాట్ ప్రపంచ చాంపియన్ భారత్‌కు బంగ్లాదేశ్ కనీస పోటీ ఇవ్వటం లేదు. ఐదు రోజుల ఆటలో ఓ మాదిరి మెరిసిన బంగ్లాదేశ్.. 20 ఓవర్ల ఆటలో పూర్తిగా తేలిపోయింది. గ్వాలియర్, న్యూఢిల్లీ టీ20ల్లో టీమ్ ఇండియా ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్ పూర్తిగా తేలిపోయింది. బౌలర్లు మాత్రం కొన్ని స్పెల్స్ నాణ్యమైన బౌలింగ్ చేశారు. బ్యాట్‌తో, బంతితో నిలకడగా దంచికొట్టిన భారత్.. నేడు హైదరాబాద్‌లోనూ అదే జోరు చూపించేందుకు సై అంటోంది. క్లీన్‌స్వీప్ విజయం కోసం టీమ్ ఇండియా.. మహ్మదుల్లా వీడ్కోలు విజయం కోసం బంగ్లాదేశ్ అమీతుమీ తేల్చుకోనుండటంతో నేడు మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది.

కుర్రాళ్లకు చాన్స్? : మూడు మ్యాచుల సిరీస్‌ను 2-0తో భారత్ ఇప్పటికే సొంతం చేసుకుంది. నామమాత్రపు మూడో మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇచ్చేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ఆలోచన చేస్తోంది. రవి బిష్ణోయ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ సహా హర్షిత్ రానాలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. సొంత మైదానంలో జాతీయ జట్టు తరఫున తొలి అవకాశం కోసం తిలక్ వర్మ ఎదురుచూస్తుండగా.. నితీశ్ కుమార్ మరో మెగా ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. రెండో టీ20లో పవర్‌ప్లేలోనే భారత్ మూడు వికెట్లు కోల్పోయినా.. నితీశ్ కుమార్ రెడ్డి మెరుపులతో భారత్ భారీ స్కోరు సాధించింది.



సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లు ఉప్పల్ స్టేడియంలో ఆడారు. ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. ధనాధన్ ఇన్నింగ్స్ బాకీ పడిన అభిషేక్ నేడు ఏం చేస్తాడో చూడాలి. సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్‌లు ఫామ్ కొనసాగిస్తే నేడు పరుగుల వరద లాంఛనమే. వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్‌లు స్పిన్ బాధ్యతలు.. మయాంక్ యాదవ్, అర్షదీప్ సింగ్‌లు పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

మహ్మదుల్లాకు ఇదే ఆఖరు : బంగ్లాదేశ్ వెటరన్ ఆటగాడు మహ్మదుల్లా నేడు ఉప్పల్ స్టేడియంలో కెరీర్ ఆఖరు టీ20 ఆడనున్నాడు. ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు ప్రకటించిన మహ్మదుల్లా.. ఆఖరు మ్యాచ్‌లో విజయం సాధించాలని అనుకుంటున్నాడు. జట్టు సైతం వెటరన్‌కు విజయంతో వీడ్కోలు పలకాలని అనుకుంటుంది. 140 టీ20లు ఆడిన మహ్మదుల్లా రెండో మ్యాచ్‌లో 41 పరుగులు చేసినా.. జట్టును గెలుపు ట్రాక్‌పై నడిపించలేకపోయాడు. నేడు హైదరాబాద్ పరుగుల పిచ్‌పై మహ్మదుల్లా ఆఖరిసారి మెరుస్తాడేమో చూడాలి. ఆల్‌రౌండర్ మెహది హసన్ మిరాజ్ రాణిస్తున్నా.. టాప్ ఆర్డర్‌లో బ్యాటర్లు ఎవరూ నిలబడటం లేదు. లిటన్ దాస్, నజ్ముల్ శాంటో, పర్వేజ్‌లు మెరిస్తే బంగ్లాదేశ్ నేడు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వగలదు.

వర్షం ప్రమాదం! : ఉప్పల్ స్టేడియం పరుగుల వరదకు చిరునామా. ఐపీఎల్ 2024లో ఇక్కడ తొలుత బ్యాటింగ్ చేసిన మూడు జట్లు 200 ప్లస్ పరుగులు చేసి విజయం సాధించాయి. నేడు భారత్, బంగ్లా మ్యాచ్‌కు సైతం పరుగుల పిచ్ సిద్ధం చేస్తున్నారు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. కానీ మ్యాచ్ ముంగిట వర్షం ప్రమాదం పొంచి ఉంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కానీ మ్యాచ్‌కు ఆటంకం కలిగించే స్థాయిలో వర్షం ఉండకపోవచ్చు!.

తుది జట్లు (అంచనా) :

భారత్ : సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, రింకూ సింగ్, హార్దిక్ పాండ్య రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్.

బంగ్లాదేశ్ : పర్వేజ్ హుస్సేన్, లిటన్ దాస్ (వికెట్ కీపర్), నజ్ముల్ శాంటో (కెప్టెన్), తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా, మెహిది హసన్ మిరాజ్, రిషద్ హుస్సేన్, టస్కిన్ అహ్మద్, హసన్ షకిబ్, ముస్తాఫిజుర్ రెహమాన్.

బౌలర్లు మెరిసినా..!

హైదరాబాద్, గుజరాత్ రంజీ పోరు

నవతెలంగాణ-హైదరాబాద్ : పేసర్లు, స్పిన్నర్లు మెరిసినా గుజరాత్‌ను స్వల్ప స్కోరుకు కట్టడి చేయటంలో హైదరాబాద్ విఫలమైంది. సివి మిలింద్ (3/51), తనయ్ త్యాగరాజన్ (2/62), శరణు నిశాంత్ (2/46) మెరవటంతో గుజరాత్ తొలుత 98 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. లంచ్ విరామం లోపే సగం వికెట్లు పడగొట్టిన హైదరాబాద్.. తర్వాతి రెండు సెషన్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసుకుంది. మనన్ (174 నాటౌట్, 259 బంతుల్లో 24 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగగా.. ఉర్విల్ పటేల్ (60, 94 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించాడు. ఈ ఇద్దరి మెరుపులతో గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 334/8 పరుగులు చేసింది. గుజరాత్‌ను స్వల్ప స్కోరుకు పరిమితం చేసే అవకాశం హైదరాబాద్ చేజార్చుకుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886